శనివారం
26•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక MNM
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD







ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



తన పుట్టినరోజు సందర్భంగా ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్

# కృత్రిమ మేధ ఏడాదిగా 2020

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ వెల్లడి
- నాస్కామ్ అధ్యక్షురాలు దేబ్‌జానిఘోష్‌తో చర్చలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 2020 ఏడాదిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంవత్సరంగా ప్రకటిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు వెల్లడించారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో ఆయనతో నాస్కామ్ అధ్యక్షురాలు దేబ్‌జానిఘోష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)ను వ్యవసాయం, పట్టణ రవాణా, ఆరోగ్య సంరక్షణరంగాల్లో వినియోగించుకోవాలని నిర్ణయించామని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై వచ్చే ఏడాది అనేక సదస్సులు నిర్వహించనున్నామని మంత్రి తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఏఐతోపాటు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చైన్ రంగాల కు సంబంధించిన కంపెనీలు హైదరాబాద్‌లో తమ పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు నాస్కామ్ ఆసక్తితో ఉన్నదని, ఐవోటీ, ఏఐ, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చైన్ అంశాలపై నాస్కామ్ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నదన్నారు. దేబ్‌జానిఘోష్ మాట్లాడుతూ.. ఓపెన్ డాటా విధానంలో తెలంగాణతో కలిసి పనిచేస్తామన్నారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవి, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ పాల్గొన్నారు.



ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌తో భేటీ అనంతరం నాస్కామ్ అధ్యక్షురాలు దేబ్‌జానిఘోష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్



# క్యాన్సర్‌ను ముందే గుర్తిద్దాం

- వ్యాధి నిర్ధారణకు సంచార వాహనాలు
- ఎంఎన్‌జేలో త్వరలోనే పెట్ స్కాన్ ఏర్పాటు
- బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవేర్‌నెస్ వాక్‌లో మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ఖైరతాబాద్:** మహిళల్లో ఎక్కువగా వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌లను ముందుగానే గుర్తించడం ద్వారా ఆ తల్లులను కాపాడుదామని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని సంజీవయ్య పార్కు నుంచి జలవిహార్‌వరకు క్యాన్సర్ అవేర్‌నెస్ వాక్ నిర్వహించారు. ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన డైరెక్టర్ ఎస్ జయలతతో కలిసి ఈ వాక్‌ను ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ.. దేశంలో క్యాన్సర్, గుండెజబ్బులు రోజురోజుకు పెరుగుతున్నాయని, లక్షల మంది చనిపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తిద్దాం.. క్యాన్సర్ బారి నుంచి కాపాడుకుందామని పిలుపునిచ్చారు. క్యాన్సర్ పట్ల మహిళల్లో అవగాహన ఎంతో అవసరమని, ముందుగా గుర్తిస్తే అతి తక్కువ ఖర్చుతో నయంచేయవచ్చని చెప్పారు. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో క్యాన్సర్ గుర్తించే పరికరాలతో కూడిన సంచార వాహనాలను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆలోచనలతో వైద్యారోగ్యశాఖలో వినూత్న నిర్ణయాలు తీసుకొని దేశంలోనే రాష్ట్రాన్ని మొదటిస్థానంలో నిలిపేందుకు కృషిచేస్తున్నామని వివరించారు. పీహెచ్‌సీల్లో, ఏరియా దవాఖానల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన పరికరాలను అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. ఆశ వర్కర్లకు క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు అవసరమైన శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించేందుకు ఎంఎన్‌జే దవాఖానలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలో పెట్ స్కాన్ కూడా అందుబాటులోకి తెస్తామని, రూ.60 కోట్లతో అధునాతన భవనాన్ని నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 11 ప్రభుత్వ బోధనాదవాఖానల్లో క్యాన్సర్‌ను గుర్తించేందుకు, చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. ఎడ్యుకేషన్- ప్రివెన్షన్- ట్రీట్మెంట్ అనే మూడు విధానాలతో క్యాన్సర్‌ను త్వరలో అధిగమిస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీలో అన్నిరకాల క్యాన్సర్ చికిత్సలను చేర్చామన్నారు. స్వచ్ఛందసంస్థలు కూడా ముందుకు వచ్చి క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ వాక్‌లో టీవీ నటుడు, జబర్దస్త్ ఫేమ్ కార్తీక్, ఆర్‌ఎంవో నిర్మల, హెచ్‌వోడీలు డాక్టర్ బెంజమిన్, సంజీవనికుమారి, వైద్యులు శ్రీకాంత్, రాధిక, సురేశ్‌బాబు, గీతా వాసవి, దుర్గాప్రసాద్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవేర్‌నెస్ వాక్‌లో పాల్గొన్న మంత్రి ఈటల రాజేందర్, వైద్యులు తదితరులు

# సాంకేతికతతో కులవృత్తుల అభివృద్ధి

అధికారులతో సమీక్షలో బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్



బీసీ సంక్షేమశాఖ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి గంగుల కమలాకర్. చిత్రంలో బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ అనితారాజేంద్ర తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బలహీనవర్గాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పథకాలపై బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ సమీక్షించారు. శుక్రవారం తన కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. బీసీ కులాల ఫెడరేషన్ల పనితీరు, వాటి ద్వారా అమలుచేస్తున్న ఆర్థిక సహకార కార్యక్రమాలు, నిధుల కేటాయింపు వంటి అంశాలను మంత్రి ఆరాతీశారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఇప్పటివరకు అమలుకావాల్సిన నిధులు, మిగిలిన నిధుల ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించినట్టు తెలిపారు. నూతన సాంకేతికతను వినియోగించి కులవృత్తులవారి జీవితాలను మెరుగుపరిచేందుకు పథకాల అమలుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా 300 మంది విద్యార్థులకు ప్రతి సంవత్సరం విదేశాల్లో ఉన్నతవిద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా బీసీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కల్యాణలక్ష్మి పథకంతో నిరుపేద ఆడబిడ్డల పెండ్లిండ్లకు ఆర్థికసాయం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ అనితారాజేంద్ర, సంయుక్త కార్యదర్శి సైదా, ఫెడరేషన్ల ఎండీ అలోక్‌కుమార్, రజక ఫెడరేషన్ ఎండీ చంద్రశేఖర్, బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ బాలాచారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు విస్తృతంగా వైద్యసేవలు

- కీటకజనిత వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా లాంటి సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలని, ఇందుకోసం జిల్లాల్లోని ప్రాజెక్టు అధికారులను అప్రమత్తంచేసి విస్తృతంగా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉన్నతాధికారులను ఆదేశించారు. వ్యాధుల నివారణపై శుక్రవారం ఆయన బీఆర్కేభవన్‌లో సమీక్ష నిర్వహించారు. వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్య విద్యాపరిషత్ కమిషనర్ యోగితారాణా, ఆరోగ్యశాఖ డైరెక్టర్ శ్రీనివాసరావు, కేంద్ర కీటకజనిత వ్యాధుల నివారణ విభాగం డిప్యూటీ డైరెక్టర్ సుమన్ లతాపాటిల్, కన్సల్టెంట్ కౌశల్‌కుమార్, ఎన్సీడీసీ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌వర్మ, ఎపిడెమాలజీ కన్సల్టెంట్ సాహిత్‌గోయల్, జీహెచ్‌ఎంసీ సీనియర్ ఎపిడెమాలజిస్ట్ రాంబాబు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ రీజనల్ డైరెక్టర్ అనురాధ, అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో సీఎస్ జోషి మాట్లాడుతూ.. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. జ్వరాలు వచ్చినచోట వెంటనే వైద్యసేవలు అందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో కీటకజనిత వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు స్పష్టంచేశారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, ఫైలేరియా, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ తదితర కీటకజనిత వాధ్యుల నివారణపై చర్చించేందుకు ప్రత్యేక బృందాన్ని పంపిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం తరపున సీఎస్ జోషి ధన్యవాదాలు తెలిపారు.



వ్యాధుల నివారణపై శుక్రవారం బీఆర్కేభవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ ఎస్కే జోషి. చిత్రంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్య విద్యాపరిషత్ కమిషనర్ యోగితారాణా తదితరులు ఉన్నారు.

# ఎన్టీసీఏలో తెలంగాణకు చోటు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) లో తెలంగాణ రాష్ట్రానికి చోటుదక్కింది. కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని చట్టబద్ధమైన సంస్థ 'ఎన్టీసీఏ' మన దేశంలో పెద్దపులుల సంరక్షణ బాధ్యతను పర్యవేక్షిస్తున్నది. అభయారణ్యాల్లో పెద్దపులుల రక్షణకు ప్రత్యేక నిధులను కూడా కేటాయిస్తున్నది. అలాగే పులుల రక్షణకు టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను మంజూరు చేస్తుంటుంది. ప్రతీ మూడేండ్లకోసారి దేశంలోని ఆరు రాష్ట్రాలకు కమిటీలో అవకాశం కల్పిస్తారు. ఆయా రాష్ట్రాలు ఇచ్చే సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ క్రమంలో ఈసారి తెలంగాణకు అవకాశం దక్కింది. ఇప్పటికే పెద్దపులుల పరిరక్షణలో 71 మార్కులను సాధించిన తెలంగాణకు టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను ఇవ్వడానికి కేంద్రం అంగీకారం తెలిపింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఎన్టీసీఏ సమావేశంలో ఈ మేరకు తెలంగాణకు చోటు కల్పిస్తూ నిర్ణయం తీసుకొన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆర్ శోభ హాజరయ్యారు. పెద్దపులుల రక్షణకు అమ్రాబాద్, కవ్వాల్ అభయారణ్యాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కావాలన్న అటవీశాఖ అభ్యర్థనకు ఎన్టీసీఏ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది.

# రైల్వే నిబంధనలు పాటించండి

- దక్షిణ మధ్య రైల్వేలో ఐటీఐ అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ అవకాశం ఇవ్వండి
- 2014లో సవరించిన చట్టాన్ని అమలుచేయండి
- కేంద్రమంత్రికి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ లేఖ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దక్షిణ మధ్య రైల్వే నిబంధనలు పాటించక పోవడం వల్ల తెలంగాణ, ఏపీ ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్‌లో తీవ్ర అన్యాయం జరుగుతున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రైల్వేశాఖ మంత్రి పీయూష్‌గోయల్, రైల్వే బోర్డు చైర్మన్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్లకు లేఖలు రాశారు. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థుల అప్రెంటిస్‌షిప్ విషయంలో ఉద్యోగ, ఉపాధి కల్పనాశాఖ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్నవారికే అవకాశం కల్పించాలనే నిబంధన ఉన్నదని, దీనిని దక్షిణ మధ్య రైల్వే కచ్చితంగా అమలు చేసేలా జనరల్ మేనేజర్‌ను ఆదేశించాలని మంత్రిని లేఖలో కోరారు. ఈ నిబంధనను అమలు చేయకపోవడం వల్ల దక్షిణ మధ్య రైల్వేలో ఉత్తరాది రాష్ట్రాలైన బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులే పెద్దఎత్తున అప్రెంటిస్‌షిప్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. దీంతో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు తీరని నష్టం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా అప్రెంటిస్‌షిప్‌చేసినవారికి రైల్వే గ్రూప్ డీ ఉద్యోగ నియామకాల్లో 20 శాతం రిజర్వేషన్ అవకాశాన్ని తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు కోల్పోతున్నారని తెలిపారు. 1961లో రూపొందించిన అప్రెంటిస్‌షిప్ చట్టాన్ని 2014లో సవరించారని, దీనిని అమలుచేయాలని కోరారు. రైల్వేశాఖ, రైల్వే బోర్డులు జారీచేసిన ఉత్తర్వులు కచ్చితంగా అమలుచేయాలని విజ్ఞప్తిచేశారు.

# షైన్ దవాఖాన ఎండీ అరెస్టు

- డ్యూటీ డాక్టర్, నర్సులు, ఎలక్ట్రీషియన్ కూడా
- అగ్నిప్రమాదం వారి పాపమేనన్న సీపీ మహేశ్‌భగవత్
- కనీస భద్రతా ప్రమాణాలు లేవని వెల్లడి



షైన్ దవాఖాన నర్సు స్రవంతి, ఎండీ సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ హరికృష్ణ, ఎలక్ట్రీషియన్ బషీర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** షైన్ దవాఖానలో జరిగిన అగ్నిప్రమాదానికి యాజమాన్యం, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తేల్చిన ఎల్బీనగర్ పోలీసులు శుక్రవారం ఆ దవాఖాన మేనేజింగ్ డైరెక్టర్ వీ సునీల్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేశారు. ఈ నెల 21న జరిగిన ఈ దుర్ఘటనలో విక్కీ అనే నాలుగు నెలల పసికందు మరణించడంతోపాటు మరో నలుగురు శిశువులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విక్కీ తండ్రి నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన ఎల్బీనగర్ పోలీసులు షైన్ దవాఖాన ఎండీతోపాటు డ్యూటీ డాక్టర్ హరికృష్ణ, ఐసీయూ డ్యూటీ నర్సులు స్రవంతి, శాంతిదీపిక, ఎలక్ట్రీషియన్ బషీరుద్దీన్‌ను అరెస్టుచేసినట్టు రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్ శుక్రవారం వెల్లడించారు. దవాఖానలోని సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలతోపాటు ప్రత్యక్ష సాక్షుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా దర్యాప్తు నిర్వహించామని సీపీ తెలిపారు. షైన్ దవాఖాన యాజమాన్యం కనీస భద్రతా ప్రమాణాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, జీహెచ్‌ఎంసీలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నుంచి ఫైర్ ఎన్వోసీ తీసుకోలేదని, అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌అలారం సిస్టమ్‌తోపాటు ఎలాంటి సామగ్రిని అందుబాటులో ఉంచలేదని దర్యాప్తులో తేలినట్టు సీపీ వివరించారు. ఈ దవాఖానలోకి వెళ్లిరావడానికి కేవలం ఒక్క మార్గమే ఉన్నదని, రెండో ద్వారంగానీ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లుగానీ ఉంటే ప్రమాదం నుంచి బయటపడేందుకు అవకాశాలుండేవని సీపీ పేర్కొన్నారు. ప్రమాదం సంభవించిన వెంటనే ఆ దవాఖాన సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఉంటే ప్రాణనష్టం జరిగేదికాదన్నారు. ఆ సమయంలో విధినిర్వహణలో ఉండాల్సిన నర్సు స్రవంతి తెల్లవారుజామున 1.57 గంటలకు ఎన్‌ఐసీయూ నుంచి బయటికెళ్లిందని, ఎన్‌ఐసీయూకి సమీపంలోని మరో ఐసీయూలో ఉన్న మరో నర్సు శాంతిదీపిక ఈ అగ్నిప్రమాదం పట్ల ఏమీ పట్టనట్టు వ్యవహరించిందని సీపీ వివరించారు. దవాఖానలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న బషీర్ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని, ఎన్‌ఐసీయూలోని ఇంక్యుబేటర్‌కు విద్యుత్‌ను సరఫరాచేసే పరికరాల నాణ్యతను అతను పరిశీలించకపోవడం, రిఫ్రిజిరేటర్ వద్ద ఉన్న సమస్యలను సరిదిద్దకపోవడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని సీపీ పేర్కొన్నారు.

**పలు దవాఖానలకు జీహెచ్‌ఎంసీ నోటీసులు**

షైన్ దవాఖానలో జరిగిన దుర్ఘటనతో జీహెచ్‌ఎంసీ విపత్తుల నిర్వహణ విభాగం అప్రమత్తమైంది. ముందుముందు ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించేందుకు నగరంలోని పలు దవాఖానాలకు నోటీసులు జారీచేసి.. ప్రమాద నివారణ చర్యలు ఎలా ఉన్నాయన్న దానిపై దృష్టిసారించింది.

# గోదావరి బోర్డు చైర్మన్‌గా చంద్రశేఖర్

పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోగానూ అదనపు బాధ్యతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా చంద్రశేఖర్ అయ్యర్ నియామితులయ్యారు. ఈ మేరకు కేంద్ర జల వనరుల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఏకే దాస్ రెండ్రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బోర్డు చైర్మన్‌గా ఉన్న ఆర్కే జైన్‌ను బదిలీ చేసిన కేంద్రం ఆయన స్థానంలో అయ్యర్‌ను నియమించింది. గోదావరి బోర్డు చైర్మన్.. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోగానూ అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో జైన్‌ను రెండు బాధ్యతల నుంచి బదిలీ చేసిన కేంద్రం వాటిని అయ్యర్‌కు అప్పగించింది. జైన్ బదిలీపై రెండురాష్ట్రాల ఇంజినీరింగ్ వర్గాల్లో పలురకాలుగా ప్రచారం జరుగుతున్నది. ఏపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి చేపట్టిన రివర్స్ టెండరింగ్‌పై మొన్నటి దాకా బోర్డు చైర్మన్‌గా ఉన్న జైన్ సహకరించలేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఏపీ సీఎం జగన్ ఢిల్లీ పర్యటన నేపథ్యంలోనే జైన్ బదిలీ చోటుచేసుకున్నదనే ప్రచారం జరుగుతున్నది.

# పశుసంవర్ధకశాఖకు రూ.89.75 కోట్లు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం దీపావళికి ముందే గోపాలమిత్రలు, పాడి రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపింది. ఈ ఏడాది రెండో త్రైమాసికం కోసం రూ.89.75 కోట్లను విడుదల చేస్తూ పశుసంవర్ధకశాఖ ఉత్తర్వులు జారీచేసింది. గోపాలమిత్రలకు వేతనాల కింద రూ.8.63 కోట్లు, పాడి రైతులకు రూ.4 ప్రోత్సాహకం కింద 55.50 కోట్లను మంజూరు చేసింది. వీటితోపాటు పశువైద్యశాలలకు మందుల సరఫరా కోసం రూ.6.5 కోట్లు, పరికరాల కొనుగోలుకు రూ.2.5 కోట్లు, సంచార వైద్యశాలల నిర్వహణకు రూ.7.87 కోట్లు, ఎస్సీడీసీ రుణం చెల్లింపు కోసం రూ.22.39 కోట్లు కేటాయించారు. పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా ఇచ్చిన మాట ప్రకారం నిధులు విడుదల చేయడంతో గోపాలమిత్రలు, పాడి రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. గోపాలమిత్రల కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్‌రావులకు మంత్రి తలసాని కృతజ్ఞతలు తెలిపారు.

# కొనసాగుతున్న టీఆర్టీ కౌన్సెలింగ్ ప్రక్రియ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని టీఆర్టీ (ఎస్జీటీ తెలుగు మీడియం) టీచర్ పోస్టులకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా శనివారం వరకు టీఆర్టీ ద్వారా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు. ముందుగా విడుదలచేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28, 29 తేదీల్లో ఎంపికైన టీచర్లకు పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వడం కోసం జిల్లాలవారీగా కౌన్సెలింగ్ నిర్వహించడానికి డీఈవోలు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ నెల 29న కౌన్సెలింగ్‌తోపాటుగా పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనున్నట్టు షెడ్యూల్‌లో తెలిపారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా మొత్తం 3,325 ఎస్జీటీ తెలుగు మీడియం పోస్టులను భర్తీ చేయనున్నారు.

**ఖాళీలస్థానంలో విద్యావలంటీర్లు**

రాష్ట్రంలోని విద్యాశాఖలో టీఆర్టీ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా 3,325 మంది ఎస్జీటీ టీచర్లు విధుల్లో చేరబోతున్నారు. ఇప్పటివరకు ఈ పోస్టులను విద్యావలంటీర్లతో భర్తీచేశారు. టీఆర్టీ ప్రక్రియ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న విద్యావలంటీర్లు విధుల నుంచి తప్పుకోవాల్సి ఉన్నది. అయినప్పటికీ పాఠశాల విద్యాశాఖ వలంటీర్లకు మరో అవకాశం కల్పించింది. టీఆర్టీ నియామకం తర్వాత ఎక్కడైన ఖాళీలు ఏర్పడినట్లయితే ఆ స్థానాల్లో తిరిగి విద్యావలంటీర్లను నియమించుకొనే అధికారాలను డీఈవోలకు కల్పిస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు.

# కేజీబీవీ టీచర్ల బదిలీలకు 28 వరకు గడువు

దరఖాస్తులకు షెడ్యూల్ జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్ల బదిలీలకోసం దరఖాస్తు చేసుకొనేందుకు ఈ నెల 28 వరకు గడువు పొడిగించారు. ఈ మేరకు విద్యాశాఖ శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల ఫారంలో తప్పులను సరిచేసుకోవడానికి 29న అవకాశం కల్పించారు. 30న ఎస్వో, పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీ ఇతర ఉద్యోగులు డీఈవోలకు ధ్రువపత్రాలు దాఖలు చేయాలని పేర్కొన్నారు. 31న డీఈవోలు ధ్రువపత్రాలను పరిశీలించి నవంబర్ 2న దరఖాస్తు చేసుకున్న వారి పాయింట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. నవంబర్ 2 నుంచి 3 వరకు అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి.. 4న పరిష్కరించనున్నారు. 5న తుదిజాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరుచనున్నారు. వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకొనేందుకు 6న అవకాశం కల్పించారు. 7న బదిలీ చేసిన ప్రాంతాలను కేటాయించనున్నారు. పూర్తివివరాలకు విద్యాశాఖ వెబ్‌సైట్‌ను చూడాలని అధికారులు కోరారు.

## పట్టు పరిశ్రమాభివృద్ధి నిధి అథారిటీ పునర్నియామకం

ఉత్తర్వులు జారీచేసిన ముఖ్యకార్యదర్శి పార్థసారథి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ పట్టు పరిశ్రమాభివృద్ధి నిధి అథారిటీని రాష్ట్ర ప్రభుత్వం పునర్నియమించింది. పట్టుపరిశ్రమశాఖ సంచాలకుడు చైర్మన్‌గా, ఆ శాఖ సంయుక్త కార్యదర్శి కన్వీనర్‌గా, వ్యవసాయ సహకారశాఖ అదనపు కార్యదర్శి, ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి, పట్టు రైతులు బీ జ్యోతి (నల్లగొండ), ఎం కిశోర్‌రెడ్డి (ఫరూక్‌నగర్)ని సభ్యులుగా నియమిస్తూ వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ అథారిటీ రాష్ట్రంలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి కృషిచేయనున్నది.

# డిసెంబర్‌లో అపెక్స్ కమిటీ భేటీ!

- ఎనిమిది అంశాలతో ఎజెండా ప్రతిపాదన
- కేంద్రం ఆదేశంతో రూపొందించిన కృష్ణాబోర్డు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కూడిన అపెక్స్ కౌన్సిల్ భేటీకి కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తున్నది. రాష్ట్ర విభజన తర్వాత ఒక్కసారి మాత్రమే సమావేశమైన కౌన్సిల్.. డిసెంబర్‌లో మరోసారి భేటీ అయ్యే అవకాశాలు ఉన్నట్టు కృష్ణా నదీయాజమాన్యబోర్డు వర్గాల ద్వారా తెలిసింది. అపెక్స్ కమిటీ సమావేశంలో చర్చించే అంశాలపై ప్రతిపాదనలు పంపాలన్న కేంద్రం అదేశాలతో.. ఎనిమిది అంశాలతో కృష్ణాబోర్డు ఎజెండా రూపకల్పన చేసింది. అపెక్స్ కౌన్సిల్‌లో కేంద్ర జల వనరులశాఖ మంత్రితోపాటు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉంటారు. కేంద్ర జల వనరులశాఖ మంత్రిగా ఉమాభారతి ఉన్న సమయంలో 2016 సెప్టెంబర్ 20న అపెక్స్ కౌన్సిల్ తొలి సమావేశం నిర్వహించారు. నాటి ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబు ఆ సమావేశంలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఇప్పటివరకు అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరుగలేదు. ఏపీలో జగన్ ప్రభుత్వం వచ్చాక రెండు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడినప్పటికీ కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం రాలేదు.ఈ క్రమంలో కొన్నిరోజుల కిందట కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు ఈ అంశంపై లేఖరాశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించి ఏయే అంశాలను ఎజెండాగా చేర్చాలనే ప్రతిపాదనలను పంపాలని ఆదేశించారు. దీంతో కృష్ణా బోర్డు తాజాగా ఎనిమిది అంశాలను ఎజెండా అంశాలుగా పొందుపరచాలని ప్రతిపాదించింది. ఇందులో గోదావరి మళ్లింపు వాటా అంశాన్ని కూడా చేర్చింది.

**బోర్డు ప్రతిపాదించిన అంశాలు**

- రెండురాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీ విధివిధానాల ఖరారు
- ప్రాజెక్టుల వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలు పారదర్శకంగా ఉండేలా వ్యవస్థ ఏర్పాటు (టెలిమెట్రీ)
- కృష్ణా నది, బేసిన్‌కు తరలిస్తున్న గోదావరిజలాలకు సంబంధించి వాటాలు తేల్చడం.
- చిన్న నీటివనరుల కింద రెండురాష్ట్రాల నీటి వినియోగ లెక్కలపై స్పష్టత
- శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల ఆపరేషన్ ప్రొటోకాల్
- రెండు రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులు చేపడితే వాటికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలను సమర్పించడం
- కృష్ణా బోర్డు పరిధిని తేల్చడం
- కృష్ణాబోర్డు కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి విజయవాడకు తరలించడం.

## సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

దరఖాస్తులకు డిసెంబర్ 31వరకు అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణి స్థలాలు ఆక్రమించి ఇండ్లు కట్టుకున్నవారికి క్రమబద్ధీకరించుకొనేందుకు గడువును ప్రభుత్వం పొడిగించింది. దరఖాస్తుల గడువును ఈ ఏడాది డిసెంబర్ 31వరకు పెంచింది. శుక్రవారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం దరఖాస్తులు స్వీకరించాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

శనివారం
26•10•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD




# అశ్వత్థామపై కేసు



ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డిపై శుక్రవారం కూకట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్ కే రాజు

## కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్ ఫిర్యాదు

- కార్మికులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణ
- సమ్మె విరమించి విధుల్లో చేరేందుకు సిద్ధమని వెల్లడి

### పునరాలోచనలో కార్మికలోకం • డిపోలకు వస్తున్న ఆర్టీసీ కార్మికులు

తిరిగి ఉద్యోగాల్లో చేరేందుకు మొగ్గు • సీఎం కేసీఆర్ సుదీర్ఘ వివరణతో నూతనోత్తేజం

ఆర్టీసీ సమ్మెపై సీఎం కేసీఆర్ సమీక్ష • ప్రభుత్వానికి చేరిన ఈడీల నివేదిక

కొనసాగుతున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లు • సమ్మెకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/సిటీబ్యూరో/కూకట్‌పల్లి, నమస్తే తెలంగాణ:**

ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డిపై ఆర్టీసీ డ్రైవర్ ఒకరు ఫిర్యాదుచేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే పేరుతో కార్మికుల మనస్సులలో విషాన్ని నింపి, గత 21 రోజులుగా సమ్మె చేయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు అశ్వత్థామరెడ్డిపై కేసు నమోదైంది. మరోవైపు ఆర్టీసీ సమ్మెపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కార్మికుల 21 డిమాండ్ల సాధ్యాసాధ్యాలపై నియమించిన ఈడీల కమిటీ.. మూడు రోజులుగా పలు దఫాలుగా చర్చలు జరిపిన అనంతరం రూపొందించిన నివేదికను ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మకు శుక్రవారం సమర్పించింది. దీంతో ఉన్నతాధికారులతో సీఎం ప్రగతిభవన్‌లో సమావేశమయ్యారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈడీల నివేదికలోని అంశాలపై దాదాపు మూడు గంటలపాటు కూలంకషంగా చర్చించినట్లు తెలుస్తున్నది. కాగా.. దరఖాస్తు పెట్టుకొని విధుల్లో చేరాలంటూ సీఎం కేసీఆర్ గురువారం చెప్పడంతో శుక్రవారం ఉదయమే చాలా మంది డ్రైవర్లు డిపోలకు వచ్చి.. తాము ఉద్యోగంలో తిరిగిచేరడం.. సర్వీసు నిబంధనలపై మేనేజర్లను అడిగారు. సర్వీసు విషయంలో స్పష్టతవస్తే ఉద్యోగాల్లో తిరిగి చేరడానికి సంసిద్ధత వ్యక్తంచేశారని తెలుస్తున్నది.

**తప్పుదోవ పట్టిస్తున్న అశ్వత్థామరెడ్డి**

కూకట్‌పల్లి డిపోకు చెందిన డ్రైవర్ కోరేపాటి రాజు (బ్యాడ్జ్ నంబరు 236236) శుక్రవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో అశ్వత్థామరెడ్డిపై ఫిర్యాదుచేశారు. డ్రైవర్ రాజు చేసిన ఫిర్యాదు మేరకు అశ్వత్థామరెడ్డిపై క్రైం నంబర్ 628/2019 కింద ఐపీసీ 341, 506 సెక్షన్ ఆఫ్ క్రిమినల్ లా అమెండ్‌మెంట్ యాక్ట్ 1982 ప్రకారం కేసు నమోదుచేశామని కూకట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. సమ్మెలో భాగంగా

మిగతా 4వ పేజీలో



హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజాకృతజ్ఞత సభ ప్రాంగణం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

# నేడు ప్రజాకృతజ్ఞత సభ

### హాజరుకానున్న ముఖ్యమంత్రి కేసీఆర్

హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ ప్రకటన!

సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా

**హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ:**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శనివారం హుజూర్‌నగర్‌లో పర్యటించనున్నారు. తాజా ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించిన నేపథ్యంలో పట్టణంలో ఏర్పాటుచేసిన ప్రజాకృతజ్ఞత సభలో ప్రసంగిస్తారు. పట్టణంలోని సాయిబాబా టాకీస్ రోడ్డులో సభకు జరుగుతున్న ఏర్పాట్లను విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంద్వారా హుజూర్‌నగర్‌కు చేరుకుంటారు. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని హుజూర్‌నగర్ ప్రజలు బలపరిచారని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం గత పదినెలల్లో తీసుకొన్న అనేక నిర్ణయాలు, సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు అచంచలమైన

మిగతా 4వ పేజీలో

## సింగరేణి కార్మికులకు
# డబుల్ ధమాకా

దీపావళి బోనస్‌గా ఒక్కొక్కరికి రూ.64,700

- రూ. 258 కోట్లు చెల్లించిన సింగరేణి యాజమాన్యం
- తెలంగాణ వచ్చిన తర్వాత 209% పెరిగిన బోనస్
- కోల్ ఇండియాలో 62% పెరుగగా, సింగరేణిలో 645% బోనస్
- హర్షం వ్యక్తంచేస్తున్న కార్మికలోకం

**హైదరాబాద్/ గోదావరిఖని/ మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ యైటింక్లయిన్ కాలనీ:**

సింగరేణి కార్మికులకు ఈ ఏడాది డబుల్ ధమాకా లభించింది. సింగరేణి సంస్థ దీపావళి బోనస్ అయిన పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు స్కీం (పీఎల్‌ఆర్‌ఎస్)ను శుక్రవారం ఒక్కో కార్మికుడికి రూ.64,700 చొప్పున చెల్లించింది. ఇది పీఎల్‌ఆర్‌ఎస్ బోనస్ చరిత్రలోనే అత్యధికం. కార్మికులకు సింగరేణి యాజమాన్యం చెల్లించిన మొత్తం రూ.258 కోట్లు కావడం గమనార్హం. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఇటీవల ప్రకటించిన 28 శాతం లాభాల (దసరా) బోనస్‌ను ఒక్కో కార్మికుడు సగటున రూ.లక్ష అందుకోగా, ఇప్పుడు దీపావళి బోనస్ భారీగానే అందింది. ఈ రెండు కలిపి ఒకే నెలలో ఒక్కో కార్మికుడు సుమారు రూ.1.65 లక్షలు అందుకోవడం సింగరేణి చరిత్రలోనే ప్రథమం. ఒకే నెలలో డబుల్ బోనస్ అందుకోవడంపై కార్మికుల్లో

మిగతా 4వ పేజీలో



2022 నాటికి
## పార్లమెంటుకు
# కొత్తరూపు

గుజరాత్‌కు చెందిన హెచ్‌సీపీకి కాంట్రాక్ట్

సెంట్రల్‌విస్టా, రాజ్‌పథ్ పునరుద్ధరణ కూడా..

కొత్త పార్లమెంటు భవనం..

లేదా పాతదానికే ఆధునిక హంగులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 25:** దేశానికి స్వాతంత్ర్యం లభించి 75 ఏండ్లు పూర్తయ్యే 2022 నాటికి పార్లమెంటు రూపురేఖలను మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రం.. ఆ దిశగా చర్యలను ముమ్మరం చేసింది. పార్లమెంటు భవన పునరుద్ధరణ పనుల కాంట్రాక్టును గుజరాత్ కంపెనీకి అప్పగించింది. అహ్మదాబాద్

మిగతా 5వ పేజీలో

# బీజేపీ సర్కారులే

### మహారాష్ట్ర, హర్యానాలో కొలువుదీరనున్న సంకీర్ణ ప్రభుత్వాలు

హర్యానాలో బీజేపీతో చేతులు కలిపిన జేజేపీ


దుష్యంత్ చౌతాలాకు డిప్యూటీ సీఎం పదవి

**మహారాష్ట్ర,** హర్యానాల్లో ప్రభుత్వాల ఏర్పాటుపై స్పష్టత వచ్చింది. రెండుచోట్లా బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాలే కొలువుదీరనున్నాయి. హర్యానాలో శుక్రవారం హైడ్రామా కొనసాగింది. అనూహ్యంగా జననాయక్ జనతా పార్టీ (జేజేపీ).. బీజేపీతో చేతులు కలిపేందుకు ముందుకొచ్చింది. జేజేపీ అధినేత దుష్యంత్ చౌతాలా ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. హర్యానాలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని, జేజేపీకి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వనున్నట్టు అమిత్ షా ప్రకటించారు. మనోహర్‌లాల్ ఖట్టర్ మరోసారి సీఎంగా అధికార పగ్గాలు చేపట్టనున్నారు. మరోవైపు మహారాష్ట్రలో బీజేపీ-శివసేన కూటమి 161 స్థానాలు గెలుచుకొని మ్యాజిక్ ఫిగర్‌ను దాటింది. అయితే అధికారాన్ని పంచుకునే విషయంలో విభేదాలు తలెత్తాయని, కాంగ్రెస్-ఎన్సీపీ మద్దతుతో శివసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, ఆదిత్య ఠాక్రే సీఎం అవుతారని ప్రచారం జరిగింది. ఈ వార్తలను ఎన్సీపీ, కాంగ్రెస్ ఖండించడంతో దేవేంద్ర ఫడ్నవీస్ మరోసారి సీఎం కావటం ఖాయమైంది.


5



దేవేంద్రఫడ్నవీస్



మనోహర్‌లాల్ ఖట్టర్






శుక్రవారం నాగార్జునసాగర్ 16 గేట్లు ఎత్తివేయటంతో దుంకుతున్న కృష్ణమ్మ

# కృష్ణమ్మకు వరదపోటు

- ఎగువ ప్రాజెక్టుల నుంచి కొనసాగుతున్న భారీ ఇన్‌ఫ్లో
- వచ్చిన వరద వచ్చినట్లే దిగువకు విడుదల
- జూరాల 24 గేట్లు.. శ్రీశైలం 10.. సాగర్లో 16 గేట్ల ఎత్తివేత

7

# విజయవంతంగా గ్రూప్-2 నియామకాలు



- రాష్ట్రావిర్భావం తర్వాత తొలిసారి 1027 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి
- గడిచిన ఐదేండ్లలో 30వేల ఉద్యోగాలు..
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

4

## జమ్ముకశ్మీర్, లడఖ్‌లకు
# లెఫ్టినెంట్ గవర్నర్లు

గిరీశ్‌చంద్ర ముర్ము, రాధాకృష్ణ మాథుర్‌లను నియమించిన కేంద్రం

5

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 79.00 | రిటైల్ లైవ్ | 101.00 |
| డ్రెస్డ్ | 146.00 | స్కిన్‌లెస్ | 167.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 386.00 | రంగారెడ్డి | 386.00 |
| మెదక్ | 386.00 | కరీంనగర్ | 389.00 |
| వరంగల్ | 389.00 | చిల్లర ధర | 4.45 |

# భారీగా ఏఎస్పీలు, డీఎస్పీల బదిలీ

50 మంది అదనపు ఎస్పీలు, 68 మంది డీఎస్పీలకు స్థానచలనం

9






హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ భారీ విజయానికి కృషిచేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను శుక్రవారం ప్రగతిభవన్‌లో అభినందిస్తున్న మంత్రి కేటీఆర్. మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న కోలేటి దామోదర్

## హుజూర్‌నగర్ గెలుపుపై మంత్రి కేటీఆర్‌కు కోలేటి శుభాకాంక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉపఎన్నికలో టీఆర్‌ఎస్ పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం ప్రగతిభవన్‌లో కలిశారు. తిరుగులేని నాయకత్వ పటిమతో కేటీఆర్ వ్యూహాత్మకంగా చేసిన దిశానిర్దేశం గెలుపులో కీలకమైందని చెప్పారు. మంత్రి కేటీఆర్‌కు కోలేటి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో కొబ్బరికాయలు కొడుతున్న ఆంధ్రప్రదేశ్‌లోని టీఆర్‌ఎస్ అభిమాని కొణిజేటి ఆదినారాయణ తదితరులు

## టీఆర్‌ఎస్ గెలుపుతో కనకదుర్గమ్మకు 101 కొబ్బరికాయలు!

- హుజూర్‌నగర్‌లో విజయంతో మొక్కుతీర్చుకున్న ఆంధ్రా అభిమాని

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి భారీ మెజారిటీతో గెలిచినందుకు టీఆర్‌ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అభిమాని కొణిజేటి ఆదినారాయణ శుక్రవారం విజయవాడ కనకదుర్గమ్మకు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కుతీర్చుకున్నారు. హుజూర్‌నగర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ పార్టీని ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు చెప్పారు. కనకదుర్గమ్మ ఆశీస్సులు తెలంగాణ ప్రజలకు, సీఎం కేసీఆర్‌కు ఉండాలని ప్రార్థించారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఘనవిజయం సాధిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.



# విజయవంతంగా గ్రూప్-2 నియామకాలు

- రాష్ట్రావిర్భావం తర్వాత తొలిసారి.. 1027 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి
- వివిధ కారణాలతో ఐదు పెండింగ్.. పారదర్శకంగా ముగిసిన ప్రక్రియ
- త్వరలోనే మెరిట్ లిస్ట్ విడుదల.. వచ్చేవారం ఎస్జీటీ ఇంగ్లిష్ జాబితా
- రోస్టర్ తేలాక కొత్త నోటిఫికేషన్లు.. గడిచిన ఐదేండ్లలో 30వేల ఉద్యోగాలు
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొట్టమొదటి గ్రూప్-2 నియామకాల ప్రక్రియ పూర్తయింది. మొత్తం 1032 పోస్టులకుగాను 1027 పోస్టులకు నియమితులైన వారి జాబితాను టీఎస్‌పీఎస్సీ శుక్రవారం విడుదలచేసింది. అత్యంత పారదర్శకంగా.. సిబ్బంది సమర్థ నిర్వహణతో గ్రూప్-2 నియామకాలను విజయవంతంగా పూర్తిచేసినట్లు కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపిన ఆయన, బంగారు తెలంగాణ నిర్మాణం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు పదేండ్లకాలంలో 20 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీచేశారని.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఐదేండ్లకాలంలోనే 30 వేల ఉద్యోగాలను భర్తీచేశామని పేర్కొన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు, రాష్ట్రపతి ఉత్తర్వులు రావడంతో గ్రూప్-1తోపాటు ఇతర పోస్టులకు ప్రభుత్వం నుంచి కొత్తగా అనుమతి రావాల్సి ఉన్నదని తెలిపారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన గ్రూప్-2 మెరిట్ లిస్టును త్వరలోనే విడుదలచేస్తామని వెల్లడించారు.

### గ్రూప్-2 ప్రతిష్ఠాత్మకమైంది

టీఎస్‌పీఎస్సీకి గ్రూప్-2 రిక్రూట్‌మెంట్ ప్రతిష్ఠాత్మకమైన నోటిఫికేషన్ అని చక్రపాణి తెలిపారు. నిరుద్యోగుల కోరికమేరకు 590 ఉన్న పోస్టుల సంఖ్యను సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపి పెంచడంతో.. 1032 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఇందులో 1027 పోస్టులను భర్తీచేశామని చెప్పారు. ఇంత పెద్దమొత్తంలో ఎన్నడూ గ్రూప్-2 ఉద్యోగాలు భర్తీ కాలేదన్నారు. ఈ పోస్టులకు రికార్డుస్థాయిలో 7,89,985 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. భారీ రిక్రూట్‌మెంట్ కావడం వల్ల చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తూ ముందుకు వెళ్లామన్నారు.

### పనికట్టుకొని తప్పుడు ప్రచారం

ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ చక్రపాణి స్పష్టం చేశారు. దేశంలోనే ఏ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కూడా వినియోగించని రీతిలో అధునాతన సాంకేతికతను వాడుతున్నామని చెప్పారు. గ్రూప్-2 నియామకాల విషయంలో కొందరు పనికట్టుకొని లేనిపోని ప్రచారంచేశారని తెలిపారు. ఇంకొందరు కోర్టులకు వెళ్లి అడ్డుకొన్నారని.. చివరకు హైకోర్టు ఫుల్ బెంచ్ సరైన నిర్ణయాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ తీర్పును కూడా సవాలుచేస్తూ కొందరు సుప్రీంకోర్టుకు వెళ్తే.. పిటిషన్‌ను విచారణకు స్వీకరించకుండా.. టీఎస్‌పీఎస్సీ చేస్తున్న కృషిని అత్యున్నత న్యాయస్థానం అభినందించిందని గుర్తుచేశారు. ఎన్నో అడ్డంకులను అధిగమిస్తూ గ్రూప్-2 ఫలితాలను విడుదలచేశామని.. వీటిపై ఎవరైనా మళ్లీ కోర్టుకు వెళ్తే.. ఇప్పటికే తీర్పుచెప్పినందున విచారణ చేపట్టే అవకాశం లేదని స్పష్టంచేశారు.

### త్వరలోనే మెరిట్ లిస్ట్ విడుదల

టీఎస్‌పీఎస్సీ ఏ పరీక్ష నిర్వహించినా మెరిట్‌లిస్టును విడుదలచేస్తున్నామని.. గ్రూప్-2 మెరిట్‌లిస్టును కూడా త్వరలోనే విడుదలచేస్తామని చక్రపాణి వివరించారు. యూపీఎస్సీతోపాటు ఏ ఇతర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు కూడా మెరిట్ లిస్ట్ పెట్టడంలేదని.. తాము మాత్రం పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. గ్రూప్-2 పోస్టుల్లో ఇంకా ఐదు పోస్టుల భర్తీ పూర్తిచేయాల్సి ఉన్నదని తెలిపారు. న్యాయ వివాదం కారణంగా ఒక పోస్టును పక్కన పెట్టగా.. మిగతా నాలుగు పోస్టుల్లో మూడింటికి లా డిగ్రీ కలిగిన అభ్యర్థులు లేరని, ఒక మాజీ సైనికోద్యోగి క్యాటగిరీకి చెందిన పోస్టులో ఎకనమిక్స్ డిగ్రీ కలిగిన అభ్యర్థులు లేరని చెప్పారు. ఈ పోస్టులకు తర్వాతి మెరిట్ కలిగిన అభ్యర్థులను పిలిచి ఇంటర్వ్యూలు చేయాల్సి ఉన్నందున.. మెరిట్ లిస్ట్ వెంటనే విడుదలచేయడంలేదని వివరించారు.



### ప్రభుత్వ అనుమతి రాగానే మరికొన్ని నోటిఫికేషన్లు

గతంలో 128 గ్రూప్-1 పోస్టులు ఉన్నట్లు గుర్తించినా.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు, ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో స్పష్టత లేకపోవటం వల్ల నోటిఫికేషన్ ఇవ్వలేకపోయామని చక్రపాణి తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో రాష్ట్రంలో రెండు మల్టీజోన్లు వచ్చాయని, జోన్లవారీగా ఉద్యోగాల విభజన జరుగాల్సి ఉన్నదని చెప్పారు. ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం మళ్లీ సవరించిన రోస్టర్ ఇవ్వాలని, పలు పోస్టులకు నోటిఫికేషన్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, పరిపాలనాపరమైన అంశాల వల్ల ఆలస్యమవుతున్నదని చెప్పారు. ఇవి తొలగిపోయిన అనంతరం ప్రభుత్వం అనుమతి వస్తే నోటిఫికేషన్లు ఇవ్వవచ్చని తెలిపారు. విద్యార్థులు ఆశావహ దృక్పథంతో ఉండాలని.. ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని సూచించారు. పారామెడికల్, పీఈటీ పోస్టుల్లో వివాదం ముగిస్తే అవి కూడా విడుదల అవుతాయని చెప్పారు. 70 ఏండ్ల కాలంలో జరిగిన ఉద్యోగాల భర్తీ ఒక ఎత్తు అయితే.. రాష్ట్ర ఏర్పాటు తర్వాత టీఎస్‌పీఎస్సీ ద్వారా జరిగిన భర్తీ మరొక ఎత్తు అని అన్నారు. ఎస్జీటీ ఇంగ్లిష్ మీడియం ఫలితాలు వారంలోగా ఇస్తామని చక్రపాణి తెలిపారు.

#### గ్రూప్-2 టాపర్లు..

1. ఉదరప నరేశ్ –ఖమ్మం
2. ఒగ్గు రఘునందన్‌రెడ్డి – ఖమ్మం
3. బీ మనోహర్‌రావు –మెదక్
4. ఎం చంద్రశేఖర్‌రెడ్డి– మహబూబ్‌నగర్
5. లక్కిరెడ్డి శివతేజ – వరంగల్
6. మధు బీ – వరంగల్
7. ఆకుల వెంకటేశ్– ఆదిలాబాద్
8. పంతంగి భాస్కర్ –వరంగల్
9. చెన్న నాగేశ్వర్‌రావు– ఖమ్మం
10. మర్రిపెల్లి అనిల్‌కుమార్ – నల్లగొండ

#### మహిళా టాపర్లు

24. దేవగిరి నిర్మల – ఖమ్మం
51. సుజాత రాణి బలుసు – ఖమ్మం
60. ఓలాద్రి నవత – వరంగల్
85. ఆకారపు ప్రశాంతి – నల్లగొండ
91. సుజాత ఏ– నల్లగొండ

### బీసీ స్టడీ సర్కిళ్లలో శిక్షణ పొందిన 242 మంది ఎంపిక

- అభ్యర్థులకు మంత్రి గంగుల అభినందనలు

తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిళ్లలో గ్రూప్-2 పరీక్ష కోసం శిక్షణ పొందిన 400 మందిలో 242 మంది ఉద్యోగాలకు ఎంపికకావడం విశేషమని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. గ్రూప్-2కు ఎంపికైన అభ్యర్థులను శుక్రవారం మంత్రి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో అర్హత సాధించిన 242 బీసీ అభ్యర్థుల్లో డిప్యూటీ తాసిల్దార్ ఉద్యోగానికి 61 మంది, ఏసీటీవో ఉద్యోగాలకు 37, ఎక్సైజ్ ఎస్‌ఐ పోస్టుల్లో 84 మంది ఎంపికవడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమశాఖ, స్టడీ సర్కిల్ నిర్వహణాధికారులను మంత్రి అభినందించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో కూడా బీసీ అభ్యర్థులు ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు.



శుక్రవారం హుజూర్‌నగర్‌లో సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, గాదరి కిశోర్

# నేడు ప్రజాకృతజ్ఞత సభ

మూడోపేజీ తరువాయి...

విశ్వాసాన్ని కనబరచి టీఆర్‌ఎస్ అభ్యర్థికి భారీ మెజార్టీని అందించారని చెప్పారు. రాష్ట్రంలో ఏయే వర్గాలకు.. ఏయే ప్రాంతాలకు.. ఏయే అవసరాలున్నాయో పూర్తిగా తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఆయన నాయకత్వంలోనే తెలంగాణ ముందుకు పోతుందన్న నమ్మకాన్ని మరోసారి ఓటర్లు రుజువుచేశారని చెప్పారు. అందుకే హుజూర్‌నగర్ ప్రజలను ప్రత్యక్షంగా కలిసి వారికి ధన్యవాదాలు తెలిపేందుకు సీఎం కేసీఆర్ శనివారం హుజూర్‌నగర్‌కు వస్తున్నారని తెలిపారు. ప్రజాకృతజ్ఞత సభకు హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలతోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి టీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సభలో హుజూర్‌నగర్ అభివృద్ధికోసం రోడ్‌మ్యాప్‌ను సీఎం ప్రకటించే అవకాశం ఉన్నదని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు.

### లక్షమంది తరలిరానున్నారు: ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ సభకు వస్తున్న సీఎం కేసీఆర్‌ను చూడటానికి, ఆయన మాటలను వినడానికి లక్షమందికిపైగా ప్రజలు తరలిరావడానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో సీఎం సభ రద్దయినా భారీ మెజార్టీ ఇచ్చిన ప్రజలను కలవాలని తాము సీఎంను అడిగామని, అందుకు ఆయన వెంటనే అంగీకరించారని చెప్పారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సభాస్థలిని సందర్శించిన వారిలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, గాదరి కిశోర్, టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సోమగాని భరత్, కలెక్టర్ అమయ్‌కుమార్, ఎస్పీ భాస్కరన్ తదితరులు ఉన్నారు.

## ఇంటర్ రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫీజు వాపస్

- ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 2018-19 ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల అనంతరం రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు విద్యార్థులు చెల్లించిన ఫీజును వాపస్ ఇవ్వాలని ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించింది. ఇంటర్ ఫెయిలైన 21,537 మంది విద్యార్థుల నుంచి స్వీకరించిన రూ.1,62,25,100ను శుక్రవారం విడుదలచేసి, జిల్లా ఇంటర్ విద్యా అధికారులకు (డీఐఈవో), నోడల్ అధికారులకు చెల్లించారు. హాల్‌టికెట్లవారీగా విద్యార్థులకు ఫీజులను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ ఒమర్ జలీల్ ఆదేశించారు. ఇంటర్ ఫలితాలు, ఆపై జరిగిన ఘటనల నేపథ్యంలో విద్యార్థులకు ఉచితంగానే రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టిన సంగతితెలిసిందే. బోర్డుకు అప్పటికే ఫీజు చెల్లించిన వారికి ఆ మొత్తం తిరిగి చెల్లించినట్టు శుక్రవారం ఆయన తెలిపారు.

## బోటు ప్రమాద బాధితులకు పరిహారం

- మంజూరు చేస్తూ ఏపీ ప్రభుత్వం జీవో
- తెలంగాణకు చెందిన 12 మంది కుటుంబాలకు పరిహారం
- రూ.10 లక్షల చొప్పున రూ.కోటి 20 లక్షలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తూర్పుగోదావరి జిల్లా కుచులూరు వద్ద బోటు ప్రమాదంలో మృతిచెందినవారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ శుక్రవారం జీవో విడుదల చేశారు. బోటు ప్రమాదంలో మరణించిన తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన బస్కె రాజేందర్, బస్కె అవినాశ్, బస్కె రాజేంద్రప్రసాద్, గొర్రె రాజేంద్రప్రసాద్, బస్కె వెంకటయ్య, దోమల హేమంత్, బస్కె ధర్మరాజు, కొమ్ముల రవి, కొండూరు రాజ్‌కుమార్, ఖమ్మం జిల్లాకు చెందిన రేపాకుల విష్ణుకుమార్, జనగాం జిల్లాకు చెందిన గడ్డమీది సునిల్, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఈరన్ సాయికుమార్ కుటుంబసభ్యులకు పరిహారం అందజేయాలని జీవోలో సూచించారు. ఈ మేరకు రూ. కోటి 20 లక్షలు విడుదల చేశారు. పరిహారం పంపిణీకి చర్యలు తీసుకోవడంతోపాటు, ఆ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని ఏపీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్.. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

#### ముహూర్తం

సూర్యోదయం: 6.13 గంటలకు

సూర్యాస్తమయం: 5.43 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం, త్రయోదశి మధ్యాహ్నం 3.46 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: ఉత్తర ఉదయం 8.27 వరకు, తదుపరి హస్త, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 9.05 నుంచి 10.32 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.13 నుంచి 7.45 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 3.55 నుంచి సాయంత్రం 5.21 వరకు.

# సింగరేణి కార్మికులకు డబుల్ ధమాకా

మూడోపేజీ తరువాయి...

హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

### రాష్ట్రం వచ్చాక బోనస్ 209 శాతం పెరుగుదల

తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు 2013-14లో సింగరేణి కార్మికుడు లాభాల బోనస్ రూ.13,540, దీపావళి బోనస్ (పీఎల్‌ఆర్‌ఎస్ బోనస్)గా రూ.40 వేలు అందుకున్నాడు. తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ చొరవతో లాభాల బోనస్ క్రమంగా పెంచుతూ వస్తున్నారు. 2018-19 (ఈ ఆర్థిక సంవత్సరం)లో ఒక్కో కార్మికుడికి లాభాల బోనస్‌గా రూ.లక్ష, దీపావళి బోనస్‌గా రూ.64,700 కలిపి మొత్తం రూ.1.65 లక్షలు తీసుకున్నారు. రాష్ట్రం వచ్చాక గతం కన్నా సుమారు 209 శాతం అధికంగా బోనస్ అందుకున్నట్టు స్పష్టమవుతున్నది.

### కోల్ ఇండియాను మించి బోనస్

సాధారణంగా కోల్ ఇండియాను అనుసరించే లాభాల బోనస్‌ను ప్రకటిస్తారు. 2013-14లో కోల్ ఇండియా తమ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.40 వేలు ఇవ్వగా.. 2018-19 నాటికి రూ.64,700 లకు పెరిగింది. ఈ పెరుగుదల 62 శాతం. సింగరేణిలో మాత్రం లాభాల పెరుగుదల 645 శాతం రావడం గమనార్హం. 2013-14లో సింగరేణి కార్మికుడికి లాభాల బోనస్ రూ.13,540 ఇవ్వగా.. ఈ ఏడాది రూ.లక్షకు చేరుకున్నది. దేశంలోని ఏ ఇతర ప్రభుత్వ కంపెనీల్లో ఇంత పెద్దయెత్తున లాభాల బోనస్ చెల్లించడంలేదు.

### శ్రమిద్దాం.. లాభాలు సాధిద్దాం



పీఎల్‌ఆర్‌ఎస్ (దీపావళి) బోనస్‌ను అందుకున్న కార్మికులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు. దసరా, దీపావళి సందర్భంగా వచ్చిన బోనస్ సొమ్మును పొదుపు చేయండి లేదా కుటుంబ అవసరాలకు సద్వినియోగం చేసుకోండి. గత ఆర్థిక సంవత్సరంలో బాగా పనిచేసినందువల్లే రూ.1,766 కోట్ల లాభాలు ఆర్జించాం. ఈ ఏడాదీ అదే స్ఫూర్తితో బాగా పనిచేసి గత ఏడాదికంటే మించి లాభాలు సాధించాలి. సంస్థకు వచ్చిన లాభాలతో సింగరేణి విస్తరణ చర్యలు చేపట్టాం, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయి, లాభాల బోనస్ లభించింది.

– ఎన్ శ్రీధర్, సింగరేణి సీఎండీ

#### చాలా ఆనందంగా ఉన్నది



ఒకే నెలలో ఇంత పెద్ద మొత్తంలో రెండు బోనస్‌లు తీసుకోవడం చరిత్రలో ఇదే మొదటిసారి అనుకుంట. చాలా ఆనందంగా ఉన్నది. ఈ డబ్బుతో కుటుంబ అవసరాలన్నీ తీరిపోతాయి. కాలయాపన చేయకుండా సకాలంలోనే బోనస్‌లు చెల్లించిన సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు.

– ఎస్ లింగారెడ్డి, ఓసీపీ-1 సీహెచ్‌పీ, రామగుండం

#### నమ్మలేకపోతున్నాం



ఒకే నెలలో రెండు బోనస్‌లు చేతికి రావడాన్ని నమ్మలేకపోతున్నాం. పండుగలకు ముందే యాజమాన్యం కార్మికుల గురించి ఆలోచించి బోనస్‌లు చెల్లించడం సంతోషకరం. ఈ మొత్తంతో కుటుంబ అవసరాలు తీరుతాయి.

– దానం శేఖర్, వకీల్‌పల్లి మైన్, రామగుండం

#### సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ



సింగరేణి కార్మికులమని చెప్పుకొనేందుకు గర్వంగా ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు పండుగలంటే ఏదో నామమాత్రంగా బోనస్‌లు ఇచ్చేవారు. అవి కూడా ఎటూ సరిపోయేవి కాదు. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని సింగరేణి కార్మికుల కష్టాన్ని గుర్తించి.. ఊహించని విధంగా ఏటేటా బోనస్‌లు పెంచడం చాలా ఆనందంగా ఉన్నది.

– గోపాల్‌రెడ్డి, రామగుండం

# అశ్వత్థామపై కేసు

మూడోపేజీ తరువాయి...

కార్మికుల ఆత్మహత్యలకు అశ్వత్థామరెడ్డి కారణమని.. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చౌడారం గ్రామానికి చెందిన రాజు ఎనిమిదేండ్లుగా ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సమ్మె వల్ల లాభం లేకపోగా.. కార్మికులు ఉద్యోగాలు పోగొట్టుకొని వీధిన పడే అవకాశం ఎక్కువగా ఉన్నదని ఫిర్యాదులో తెలిపారు. కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులుపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులను విధుల్లో చేరాలని పిలుపునిస్తే అశ్వత్థామరెడ్డి తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. సమ్మెకు మద్దతునిస్తున్న రాజకీయ పార్టీలు సమస్యలపై పోరాటం చేసి పరిష్కారాన్ని కనుక్కోవాలి కానీ, సమ్మెతో ప్రజలనే ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. సమ్మె పేరుతో విద్యార్థులను సైతం ఇందులోకి లాగి, వారి చదువులను నాశనంచేయడానికి అశ్వత్థామరెడ్డి పథకం పన్నుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమపోరాటంలో కులమతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు, అన్నివిభాగాల ఉద్యోగులు పోరాటంచేశారని గుర్తుచేశారు. సీఎం చెప్పిన వాస్తవాలను కార్మికులు ఆలోచించాలని, నెలలతరబడి సమ్మెచేసి ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. సమ్మెతో సమస్యలు పరిష్కారం కావని.. చర్చలు జరిపితే చాలన్న ఉద్దేశంతోనే తాను సమ్మె విరమించి విధుల్లో చేరేందుకు సిద్ధపడ్డానని తెలిపారు. విలీనం అంశంపై కార్మికులను పక్కదారి పట్టిస్తూ.. ఆత్మహత్యలకు పురిగొల్పుతున్న అశ్వత్థామరెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

### ప్రాణ రక్షణ కావాలి: డ్రైవర్ రాజు

సమ్మె విరమించి విధుల్లో చేరుతున్న తనకు ప్రాణరక్షణ కల్పించాలని డ్రైవర్ రాజు పోలీసులకు విజ్ఞప్తిచేశారు. ఇప్పటికే పలువురి నుంచి తనకు బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పిలుపుమేరకు సమ్మె విరమించి విధుల్లో చేరుతుండటంతో యూనియన్ నాయకుల నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరారు. మరోవైపు సమ్మె విరమించి విధుల్లో చేరిన రాజు మొబైల్ నంబర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్‌చేసి దూషించాలని పలువురు సూచిస్తున్నారు. తీవ్ర పదజాలాన్ని ఉపయోగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సమ్మె విరమించి విధుల్లో చేరుతానని కూకట్‌పల్లి డిపో మేనేజర్ నామ నర్సింహకు ఆయన దరఖాస్తు అందించారు. ఈ విషయాన్ని డివిజన్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని నర్సింహ చెప్పారు.

### డిపోలకు వస్తున్న ఆర్టీసీ కార్మికులు

దరఖాస్తు పెట్టుకుని విధుల్లో చేరాలని సీఎం కేసీఆర్ గురువారం మీడియాద్వారా చెప్పడంతో చాలామంది డ్రైవర్లు శుక్రవారం ఉదయం నుంచే డిపోలకు చేరుకొన్నారు. యూనియన్ నాయకులు వారించినా వినకుండా డిపో మేనేజర్ల దగ్గరకు వచ్చి.. విధుల్లో తిరిగిచేరడంపై ఆరాతీశారు. దరఖాస్తు చేసుకుంటే పాత సర్వీసు కొనసాగిస్తారా? దరఖాస్తు చేసుకున్న నాటి నుంచే సర్వీసుగా పరిగణించి జూనియర్‌గా గుర్తిస్తారా? అన్న విషయంపై స్పష్టత అడిగారు. అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో వెనుదిరిగారు. సర్వీసు విషయంలో స్పష్టతఇస్తే చాలామంది కండక్టర్లు, డ్రైవర్లు విధుల్లో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని సమాచారం. వేతనాలు కోల్పోవడమే కాకుండా.. సంస్థ పూర్తిగా లేకుండాపోతే ఎలా అని కార్మికులు ఆందోళన చెందుతున్నారని అధికారులు తెలిపారు. కార్మికులకు సీఎం ప్రకటన ఊరటనిచ్చిందని, సమ్మె వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ ఉన్నదని కార్మికులు గ్రహిస్తున్నారని అధికారులు చెప్తున్నారు. కార్మికసంఘాలకు చెందిన అగ్రనేతలు మినహా అత్యధికులు సమ్మె విరమణకు మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తున్నదన్నారు. సమ్మె నిర్వీర్యం అవుతున్నదని తెలిసి.. ఆర్టీసీ అధికారులను కూడా సమ్మెలోకి లాగేందుకు ఆర్టీసీ జేఏసీ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

### ప్రయాణికులకు మెరుగైన సేవలపై దృష్టి

సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను మెరుగుపరచడానికి అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు 1,928 అద్దె బస్సులు సహా మొత్తం 6,519 బస్సులను తిప్పారు. 11 వేలకు పైగా తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వర్తించగా, 4,320 బస్సుల్లో టిమ్స్ ద్వారా, 1,402 బస్సుల్లో నేరుగా టికెట్లు జారీచేశారు. నిర్దేశించిన చార్జీలను మాత్రమే వసూలుచేయడం, విధిగా టిక్కెట్ ఇచ్చేలా చూడటంపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టింది. బస్‌పాసులను అనుమతించాలని చెప్తున్నారు. రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

### సమ్మె చట్టవిరుద్ధమంటూ హైకోర్టులో పిటిషన్లు

ఆర్టీసీ కార్మికసంఘాలు చేస్తున్న సమ్మె చట్టవిరుద్ధమని, కార్మికసంఘాల డిమాండ్లు సర్వీసు రూల్స్‌కు విరుద్ధమని పేర్కొంటూ శుక్రవారం హైకోర్టులో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. లక్షలసంఖ్యలో ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్న టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్, ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ), ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ తదితర సంఘాలపై కఠినచర్యలు తీసుకునేలా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యాలను ఆదేశించాలని పిటిషనర్లు విజ్ఞప్తిచేశారు. కార్మికులు సమ్మెను విరమించుకొని ఉద్యోగాల్లో చేరకపోతే వారిపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు. కార్మికసంఘాల డిమాండ్లు వారి సర్వీస్‌రూల్స్‌కు, సుప్రీంకోర్టు పలు కేసుల్లో ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పిటిషన్లు ఇప్పటికే చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం వద్ద విచారణలో ఉన్న ప్రధాన పిటిషన్‌తోపాటు విచారణకు వచ్చే అవకాశం ఉన్నది.

## మున్సిపల్ జాబితాలో పేరుంటేనే ఓటు

- జాబితాలో పేరు చెక్ చేసుకోండి
- లేకపోతే వెంటనే నమోదు చేయించండి
- ప్రజలకు రాష్ట్ర ఎన్నికల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్రం ఎన్నికల సంఘం 2019 జనవరి 1న ప్రచురించిన అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా మున్సిపల్ కమిషనర్లు, వార్డులవారీగా ఓటరు ఫొటో గుర్తింపుకార్డులను సిద్ధంచేసి 2019 జులై 16న ప్రచురించారు. అర్హులైన వారు మున్సిపల్ ఓటర్ల జాబితాలో తమ పేరున్నదీ, లేనిదీ సరిచూసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచిస్తున్నది. ఇటీవలి ఎన్నికల్లో ఓటేసినా.. ఎన్నికల సంఘం ఎపిక్ కార్డు ఉన్నా.. మున్సిపల్ ఓటర్ జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కును వినియోగించుకొంటారని స్పష్టం చేసింది. సీఈవో డాట్ తెలంగాణ (ceo.telangana) వెబ్ పోర్టల్‌కి లాగిన్ అయి సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ జాబితాలో పేరు ఉన్నదీ, లేనిదీ పరిశీలించుకోవాలి. ఒకవేళ జాబితాలో పేరు లేనిపక్షంలో సంబంధిత పత్రాలను నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు అందజేసి పేరు నమోదయ్యేలా చూసుకోవాలి. త్వరలో జరిగే కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే 2019 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏండ్ల వయసు నిండినవారు పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి జాబితాలో నమోదైన పేర్లనే వార్డుల ఓటర్ జాబితాలో చేరుస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

## మున్సిపల్ రిట్ పిటిషన్లపై 31న విచారణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపల్ ఎన్నికల ముందు చేపట్టాల్సిన (ప్రీ ఎలక్షన్) ప్రక్రియలో భాగంగా వార్డుల విభజన సక్రమంగా చేయలేదని, నిబంధనలు పాటించలేదనే వివిధ కారణాలతో 77 మున్సిపాల్టీలపై దాఖలైన వేర్వేరు రిట్ పిటిషన్లు ఈ నెల 31న విచారణకు రానున్నాయి. ఆయా మున్సిపాల్టీలపై పెండింగ్‌లో ఉన్న కేసులపై విచారణ చేపట్టాలని జస్టిస్ చల్లా కోదండరాం నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం వద్ద అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు శుక్రవారం ప్రస్తావించారు. మున్సిపల్ ఎన్నికల ప్రీ ఎలక్షన్ ప్రక్రియపై దాఖలైన రెండు వేర్వేరు పిల్‌లను విచారించిన చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించిందని పేర్కొన్నారు. సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల్లో పిటిషనర్లు తెలిపిన అన్ని అభ్యంతరాలు ద్విసభ్య ధర్మాసనం వద్ద వాదనల సందర్భంగా కవర్ అయ్యాయని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున డివిజన్ బెంచ్ తీర్పు ఆధారంగా కేసులను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 31న పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తామని ఏకసభ్య ధర్మాసనం పేర్కొన్నది.


## దేవికారాణి డొల్ల కంపెనీల గుట్టు రట్టు

- మూడు షెల్ కంపెనీలను గుర్తించిన ఏసీబీ అధికారులు
- జేడీ పద్మ నకిలీ హెల్త్‌క్యాంపులపై కీలక ఆధారాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) స్కాంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి అక్రమాల కుట్రలు ఒక్కొక్కటి వెలుగుచూస్తున్నాయి. దేవికారాణి సృష్టించిన డొల్ల కంపెనీల వ్యవహారాన్ని ఏసీబీ అధికారులు బయటపెడుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇప్పటివరకు మూడు డొల్ల కంపెనీలను గుర్తించినట్టు తెలిసింది. ఈ నెల 23న కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన సోదాల్లో డొల్ల కంపెనీల వ్యవహారం బయటకు వచ్చింది. రమాదేవి పేరిట సాయి శ్రీనివాస డిస్ట్రిబ్యూషన్ అనే బోగస్ కంపెనీని దేవికారాణి సృష్టించినట్టు ఇప్పటికే గుర్తించిన ఏసీబీ అధికారులు.. తాజాగా మరో రెండు షెల్ కంపెనీలను గుర్తించినట్టు సమాచారం. ఈ మూడు కంపెనీల ద్వారా రూ.20 కోట్ల మేర నిధులు కొల్లగొట్టినట్టు ప్రాథమిక దర్యాప్తులో వెలుగుచూసింది. మరోవైపు ఈ స్కాంలో కీలకంగా ఉన్న ఐఎంఎస్ వరంగల్ జేడీ పద్మ అక్రమాలపై అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. హెల్త్ క్యాంపులు నిర్వహించినట్టు రికార్డులు సృష్టించి ఖరీదైన మందులు, మెడికల్ కిట్లను పక్కదారి పట్టించిన విషయాన్ని అధికారులు ఇప్పటికే వెలుగులోకి తెచ్చారు. తాజాగా ఈ వ్యవహారంపై కీలక ఆధారాలు లభించినట్టు సమాచారం. వాటి ఆధారంగా ఏసీబీ మరిన్ని సోదాలకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

# వైట్‌హౌస్‌లోకి.. వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్‌టైమ్స్ బంద్

చందాను నిలిపివేసిన ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. వైట్‌హౌస్‌లోకి ఇకపై ప్రముఖ దిన పత్రికలు వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్ పత్రికలను తెప్పించుకోవద్దని నిర్ణయించారు. ఈ మేరకు తన అధికార నివాసంలో వాటి చందాలను రద్దు చేశారు. వాటిని నకిలీ పత్రికలుగా ఆరోపించిన ఆయన ప్రభుత్వ సంస్థలూ దీన్ని పాటించాలని సూచించారు. సోమవారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ సంగతి సూచన ప్రాయంగా ప్రస్తావించారు. న్యూయార్క్ టైమ్స్‌ను నకిలీ దిన పత్రికగా అభివర్ణించారు. 'వైట్‌హౌస్‌లో ఆ పత్రికలు మాకు అవసరం లేదు. న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్ చందాలను మేం రద్దు చేయబోతున్నాం' అని చెప్పారు. కాగా 'అవి నకిలీవి' అన్న శీర్షికన ఇంటర్వ్యూలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలను న్యూయార్క్ టైమ్స్ ప్రచురించింది. జర్నలిస్టులు ప్రజలకు శత్రువులని ట్రంప్ అన్నట్లు తెలిపింది. తప్పుడు వార్తలు ప్రచురించిన సంస్థలు, జర్నలిస్టులపై దావా వేస్తామని ఆయన హెచ్చరించినట్లు పేర్కొంది. మరోవైపు 'ప్రభుత్వ సంస్థలు ఈ పత్రికల చందాలను పునరిద్ధరించకపోతే చాలా ఆదా అవుతుంది' అని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ స్టెఫానీ గ్రిషామ్ అన్నారు. తమ పత్రికల చందాల రద్దుపై వ్యాఖ్యకు ఆ పత్రికలు నిరాకరించాయి.

# భారత్‌తో శాంతి చర్చలకు పాక్‌దే బాధ్యత

- అమెరికా విదేశాంగశాఖ అధికారి వ్యాఖ్య
- ఇరుదేశాల కర్తార్‌పూర్ ఒప్పందంపై హర్షం

**వాషింగ్టన్:** ఉగ్రవాద సంస్థలకు వ్యతిరేకంగా పాకిస్థాన్ నిరంతరం గట్టి చర్యలు తీసుకోవడంపైనే భారత్-పాక్ మధ్య శాంతి చర్చలు ఆధారపడి ఉన్నాయని అమెరికా పేర్కొన్నది. భారత్-పాక్ మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిపేందుకు అనువైన వాతావరణం నెలకొల్పేందుకు ఆ రెండు దేశాలను తాము ప్రోత్సహిస్తామని పేరు చెప్పడానికి ఇష్టపడని అమెరికా విదేశాంగశాఖ అధికారి ఒకరు తెలిపారు. కశ్మీర్‌పై ఇరుదేశాలు అంగీకరిస్తే మధ్యవర్తిత్వం వహించేందుకు తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమేనని పునరుద్ఘాటించారు. కానీ బయటి పక్షం మధ్యవర్తిత్వానికి భారత్ సిద్ధంగా లేదని గుర్తు చేశారు. కర్తార్‌పూర్ కారిడార్‌పై ఇరుదేశాలు అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోవడాన్ని స్వాగతించారు. ఇది భారత్, పాకిస్థాన్ మధ్య విశ్వాస కల్పనను పెంపొందిస్తుందన్నారు.




హాంకాంగ్‌లో నాలుగు నెలలు కొనసాగిన ప్రజా ఉద్యమం చైనాతో సంబంధం ఉన్న బ్యాంకులు, రెస్టారెంట్లు, మాల్స్ యాజమాన్యాల గుండెల్లో రైళ్లను పరుగెత్తించింది. ప్రస్తుతానికి ప్రజలు శాంతించినా.. భవిష్యత్తులో మళ్లీ అల్లర్లు చెలరేగి దాడులు చేస్తారనే భయంతో వ్యాపార సంస్థలు తమ భవనాలకు ఇలా ఇనుప తలుపులను బిగిస్తున్నాయి.



# హర్యానాలో బీజేపీ+జేజేపీ

- సీఎం ఖట్టర్.. డిప్యూటీ సీఎం దుష్యంత్ చౌతాలా
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో జేజేపీ అధినేత భేటీ
- సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు ఒప్పందం
- మరో ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు సైతం కాషాయానికి జై



శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా. చిత్రంలో జేజేపీ అధినేత దుష్యంత్ చౌతాలా, బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్

**న్యూఢిల్లీ/చండీగఢ్, అక్టోబర్ 25:** హర్యానాలో ఒక్కరోజులోనే రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. బీజేపీ, జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమైంది. జేజేపీ అధినేత దుష్యంత్ చౌతాలా శుక్రవారం సాయంత్రం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యాక ప్రభుత్వంలో భాగస్వామి కానున్నట్టు ప్రకటించారు. ఆయనకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వనున్నట్టు అమిత్ షా తెలిపారు. మనోహర్ లాల్ ఖట్టర్ మరోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్నారు. శనివారం బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశమై తమ శాసనసభాపక్ష నేతగా ఖట్టర్‌ను ఎన్నుకోనున్నారు. తర్వాత గవర్నర్‌ను కలువనున్నారు. మరోవైపు ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు సైతం బీజేపీకి మద్దతు ప్రకటించారు. గురువారం వెల్లడైన హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 40, కాంగ్రెస్ 31, జేజేపీ 10, స్వతంత్రులు ఏడుచోట్ల, లోక్‌హిత్ పార్టీ, ఐఎన్‌ఎల్డీ చెరో స్థానంలో గెలుపొందిన సంగతి తెలిసిందే. 90 స్థానాలు ఉన్న ఈ రాష్ట్రంలో.. బీజేపీ మెజార్టీకి ఆరు స్థానాల దూరంలో నిలిచిపోయింది.

### సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకే..

జేజేపీ అధినేత దుష్యంత్ చౌతాలాకు శుక్రవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా నుంచి పిలుపు అందింది. ఈ మేరకు దుష్యంత్ సాయంత్రం ఢిల్లీకి వెళ్లి అమిత్‌షాతో భేటీ అయ్యారు. అనంతరం సంయుక్తంగా మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. అమిత్‌షా మాట్లాడుతూ హర్యానాలో బీజేపీ, జేజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రకటించారు. పొత్తులో భాగంగా జేజేపీకి ఉప ముఖ్యమంత్రి పదవి కేటాయించినట్టు తెలిపారు. దుష్యంత్ చౌతాలా మాట్లాడుతూ రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పడాలనే ఉద్దేశంతో బీజేపీతో చేతులు కలిపినట్టు చెప్పారు. అంతకుముందు జేజేపీ ఎమ్మెల్యేలు చండీగఢ్‌లో సమావేశమై దుష్యంత్‌ను అసెంబ్లీలో జేజేపీ పక్ష నేతగా ఎన్నుకున్నారు.

### నడ్డాను కలిసిన స్వతంత్ర ఎమ్మెల్యేలు

శుక్రవారం సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ ఢిల్లీలోని హర్యానా భవన్‌లో ఐదుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. అనంతరం రాష్ట్ర బీజేపీ ఇంచార్జి అనిల్ జైన్‌తో కలిసి ఎమ్మెల్యేలు ధర్మపాల్ గొండన్, నయన్‌పాల్ రావత్, సోంబిర్ సంగ్వాన్, రాకేశ్ దౌలతాబాద్, రణ్‌ధీర్ గోలన్‌ను వెంటబెట్టుకొని బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. తర్వాత ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ ఖట్టర్ ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములమవుతామన్నారు. ఆ తర్వాత మరో ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలూ బేషరతుగా బీజేపీకి మద్దతు పలికారు. దీంతో బీజేపీ బలం 47కు పెరిగింది. హర్యానా లోక్‌హిత్ పార్టీ నేత, సిర్సా ఎమ్మెల్యే గోపాల్ కండా సైతం ఖట్టర్‌కు మద్దతు ప్రకటించారు. ఆయనకు తీవ్రమైన నేర చరిత్ర ఉన్న నేపథ్యంలో పక్కనబెట్టనున్నట్టు సమాచారం.

### కాంగ్రెస్ ఆశలు గల్లంతు


హర్యానాలో ఎలాగైనా ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న కాంగ్రెస్ ఆశలు గల్లంతయ్యాయి. ఆ పార్టీకి చెందిన మాజీ సీఎం భూపిందర్ హుడా జేజేపీతోపాటు స్వతంత్రుల మద్దతు కోసం ప్రయత్నించారు. శుక్రవారం ఢిల్లీకెళ్లి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, గులాం నబీ ఆజాద్‌తో సమావేశమయ్యారు. దుష్యంత్ చౌతాలాతోపాటు ఏడుగురు స్వతం త్ర ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతు పలుకడంతో కాంగ్రెస్ ఆశలు ఆవిరయ్యాయి. రాష్ట్ర ప్రజా తీర్పునకు విరుద్ధంగా స్వతంత్ర ఎమ్మెల్యేలను బెదిరించి అధికారంలోకి రావడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని హుడా విమర్శించారు.

### బీజేపీలో 'కండా' కల్లోలం

హర్యానా లోక్‌హిత్ పార్టీ ఎమ్మెల్యే, వివాదాస్పద నేత గోపాల్ కండాను ప్రభుత్వంలో చేర్చుకోవాలన్న ప్రతిపాదనపై బీజేపీలో, బయట విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కండాపై పలు కేసులున్నాయి. ముఖ్యంగా ఇద్దరు మహిళల ఆత్మహత్యకు కారణమయ్యారనే ఆరోపణలున్నాయి. కండాకు చెందిన ఎండీఎల్‌ఆర్ ఎయిర్‌లైన్స్‌లో పనిచేస్తున్న గీతికాశర్మ అనే ఎయిర్ హోస్టెస్ 2012 ఆగస్ట్ 5న ఢిల్లీలో ఆత్మహత్య చేసుకున్నారు. కండాతో పాటు సంస్థ ఉద్యోగుల వేధింపుల వల్లే బలవన్మరణానికి పాల్పడుతున్నట్టు ఆమె సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. కండా ఆ సమయంలో హుడా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో హోంమంత్రిగా ఉన్నారు. గీతికపై కండా లైంగికదాడి చేశాడనే ఆరోపణలు కూడా వచ్చాయి. మరో ఆరు నెలలకు గీతిక శర్మ తల్లి సైతం అనుమానాస్పద స్థితిలో మరణించారు. కండా వేధింపుల వల్లే ఆమె కూడా ఆత్మహత్య చేసుకున్నదని దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. అన్నివైపుల నుంచి ఒత్తిడి రావడంతో కండా తన పదవికి రాజీనామా చేశారు. తర్వాత ఆయనను అరెస్ట్ చేశారు. 2014లో ఢిల్లీ హైకోర్టు గీతికాశర్మ ఆత్మహత్య కేసును కొట్టివేసింది. ప్రస్తుతం గీతిక తల్లి ఆత్మహత్య కేసుపై విచారణ నడుస్తున్నది. ఇటీవల సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో కండా తనపై తొమ్మిది కేసులు ఉన్నట్టు చెప్పారు. ఇందులో మోసం, పన్ను ఎగ్గొట్టడం, చెక్‌బౌన్స్ వంటివి ఉన్నాయి. ఈ నేపథ్యంలో కండాను ప్రభుత్వంలోకి తీసుకోవాలన్న బీజేపీ ఆలోచనపై విమర్శలు వెల్లువెత్తాయి. స్వయంగా ఆ పార్టీ సీనియర్ నేత ఉమాభారతి ఆయనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నేరచరిత్ర ఉన్న కండాను చేర్చుకుంటే ప్రధాని మోదీ, సీఎం ఖట్టర్‌కు ఉన్న క్లీన్ ఇమేజ్‌పై మచ్చపడుతుందన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా సైతం బీజేపీ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. 'గోపాల్ కండాపై ఆరోపణలు వచ్చినప్పుడు మోదీ, అమిత్ షా చేసిన వ్యాఖ్యలను, ఆయన పదవి నుంచి తప్పుకునేవరకు చేసిన పోరాటాన్ని గుర్తుతెచ్చుకోవాలి' అని సూచించారు. ఈ విమర్శలపై గోపాల్ కండా స్పందిస్తూ.. తనపై తప్పుడు కేసులు బనాయించారని చెప్పారు.

## 'మృత్యులారీ'పై కొనసాగుతున్న దర్యాప్తు

- కంటెయినర్‌ను పరిశీలించిన చైనా కాన్సుల్ జనరల్ టోంగ్ జ్యూజౌన్
- జిన్‌పింగ్ వల్లే విదేశాలకు చైనీయుల అక్రమ వలసలన్న రాజకీయ విశ్లేషకుడు



**లండన్, అక్టోబర్ 25:** రెండు రోజుల క్రితం లండన్‌లోకి వచ్చిన ఒక కంటెయినర్‌లో లభ్యమైన 39 మృతదేహాలను గుర్తించేందుకు బ్రిటన్ దర్యాప్తు అధికారులు చర్యలను తీవ్రం చేశారు. మృతులంతా చైనీయులేనని భావిస్తున్నా.. గురువారం 11 మంది మృతదేహాలను సమీప దవాఖానకు తరలించారు. మానవ అక్రమ రవాణా కింద ఈ కేసు దర్యాప్తును విస్తరించడానికి పోలీసులు చర్యలు చేపట్టనున్నారు. వారెలా మరణించారన్న సంగతిని నిర్ధారించేందుకు పోస్ట్‌మార్టం నివేదికలు దోహదపడతాయని చెబుతున్నారు. మరోవైపు సదరు కంటెయినర్‌ను నడుపుకుంటూ వచ్చిన డ్రైవర్‌ను పోలీసులు ప్రశ్నించేందుకు స్థానిక కోర్టు మరో 24 గంటల సమయం ఇచ్చింది. దీంతో ఆ డ్రైవర్‌ను అధికారులు శుక్రవారం కూడా ప్రశ్నించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'డిజాస్టర్ విక్టిమ్ ఐడెంటిఫికేషన్ (డీవీఐ)' ప్రకారం మృతదేహాల గుర్తింపునకు చర్యలు చేపట్టాం. ఈ ప్రక్రియ మరికొంత సమయం పట్టవచ్చు' అని ఎస్సెక్స్ డిప్యూటీ పోలీస్ చీఫ్ పిప్పా మిల్స్ చెప్పారు. మృతులను కంటెయినర్‌లో అతి శీతల ఉష్ణోగ్రత -25 డిగ్రీల స్థాయికి తీసుకొచ్చి కిరాతకంగా చంపారని పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. మరోవైపు, లండన్‌లో చైనా కాన్సుల్ జనరల్ టోంగ్ జ్యూజౌన్ సారథ్యంలోని చైనా అధికారుల బృందం.. కంటెయినర్ గల ప్రాంతాన్ని సందర్శించారు. మృతులు ఏ దేశం వారన్న దానిని త్వరగా నిర్ధారించాలని పోలీసు అధికారులను కోరారు. కాగా, బీజింగ్ కేంద్రంగా పని చేస్తున్న రాజకీయ విశ్లేషకుడు హువా పో స్పందిస్తూ.. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అనుసరిస్తున్న సంప్రదాయ విధానాల వల్లే చైనీయులు యూరప్ దేశాలకు పారిపోతున్నారని పేర్కొన్నారు. 'ప్రైవేట్ సంస్థల మనుగడ ప్రశ్నార్థకంగా మారడంతో నిరుద్యోగం పెరిగిపోతున్నది. ఈ నేపథ్యంలో వారంతా యూరప్ దేశాలకు పారిపోతున్నారని హువా పో చెప్పారు.

## డిజైన్ లోపాల వల్లే బోయింగ్ విమాన ప్రమాదాలు


ఇండోనేషియా జాతీయ రవాణా భద్రతా కమిటీ నివేదికలో వెల్లడి

**జకార్తా:** డిజైన్ లోపాలు, పైలెట్‌కి తగిన శిక్షణ ఇవ్వకపోవడం, విమాన సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించనందునే గతేడాది ఇండోనేషియాలో లయన్ ఎయిర్ సంస్థకు చెందిన బోయింగ్ విమానం కుప్పకూలిందని ఇండోనేషియా జాతీయ రవాణా భద్రతా కమిటీ(ఐఎన్‌టీఎస్‌సీ) తన నివేదికలో తెలిపింది. ఈ ఏడాది మార్చిలో ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737 మ్యాక్స్ విమానం ఇథియోపియా రాజధాని అడీస్ అబాబా నుంచి టేకాఫ్ తీసుకున్న కొన్ని నిమిషాలకే కూలింది. ఈ విమానం కూడా అదే రకం బోయింగ్ విమానమని, ఈ ప్రమాదానికీ డిజైన్ తదితర లోపాలే కారణమని నివేదిక పేర్కొంది. ఈ ప్రమాదం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న బోయింగ్ 737 విమానాలపై నిషేధం విధించారు.

# శివసేనతో కలవం!

- స్పష్టం చేసిన కాంగ్రెస్, ఎన్సీపీ
- ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీకి మార్గం సుగమం
- నేడు కొత్త ఎమ్మెల్యేలతో శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే సమావేశం

**ముంబై:** మహారాష్ట్రలో బీజేపీ-శివసేన కూటమి తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు మెరుగయ్యాయి. ఎన్నికల ఫలితాలు వెల్లడైన మరునాడు రాష్ట్రంలో జరిగిన పరిణామాలు ఇందుకు ఊతమిచ్చాయి. బీజేపీని అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు నేషనల్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ), కాంగ్రెస్ శివసేనతో జట్టు కడుతాయన్న వదంతులకు ఆ పార్టీ నేతలు శుక్రవారం తెరదించారు. తాము శివసేనతో కలిసే అవకాశాలు లేవని, ప్రజల తీర్పును గౌరవించి విపక్షంలో ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని ఎన్సీపీ, కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. దీనిపై ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ మాట్లాడుతూ.. 'మేము శివసేనతో కలువబోం. ఎన్సీపీ-కాంగ్రెస్, ఇతర మిత్ర పక్షాలు కలిసి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం' అన్నారు. 'ప్రజలు మమ్మల్ని విపక్షంలో కూర్చోవాలని నిర్ణయించారు. కనుక అధికార పీఠంపై కూర్చోవాలన్న ఆలోచన మా మనసుల్లోకి కూడా రాలేదు' అని పవార్ స్పష్టం చేశారు. బీజేపీని అధికారంలోకి రాకుండా చేయడానికి కాంగ్రెస్ శివసేనతో చేతులు కలపబోతున్నదన్న వార్తలను మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలాసాహెబ్ థొరాట్ కూడా తోసిపుచ్చారు. విపక్షంలో ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని శుక్రవారం మీడియాతో అన్నారు. శివసేన నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే వ్యూహంగానీ, ప్రతిపాదన గానీ తమకు లేదని తేల్చిచెప్పారు. 'శివసేనకు కాంగ్రెస్ మద్దతివ్వడం జరుగదు. ఒకవేళ, ప్రభుత్వ ఏర్పాటుకు శివసేన మమ్మల్ని సంప్రదిస్తే.. పార్టీ అధిష్ఠానం సలహాను తీసుకొని, వారి నిర్ణయాన్ని పాటిస్తాం'అని తెలిపారు. గురువారం వెల్లడైన మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి సీట్ల సంఖ్య తగ్గడంతో శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే అధికార పీఠాన్ని ఇరు పార్టీలు సమానంగా పంచుకునే '50-50' సూత్రాన్ని తెరపైకొచ్చిన విషయం తెలిసిందే. 'బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మా ఇంటికొచ్చినప్పుడు 50-50 సూత్రంపై ఒక అవగాహనకొచ్చాం. ఆ ప్రతిపాదనను బీజేపీకి ఇప్పుడు గుర్తు చేస్తాం' అని ఠాక్రే పేర్కొన్నారు. కొత్త ఎమ్మెల్యేలతో ఠాక్రే శనివారం ముంబైలో సమావేశమై, ప్రభుత్వ ఏర్పాటుపై చర్చిస్తారని శివసేన వర్గాలు పేర్కొన్నాయి.



### ప్రతిభావంతులైన నేతలను తయారుచేస్తాం!


ప్రతిభావంతులైన నేతలను తయారు చేయడంపై ఇకపై పార్టీ దృష్టి సారిస్తుందని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగం, వ్యవసాయం తదితర సమస్యలపై తాము ఆందోళన చెందుతున్నట్టు పేర్కొన్నారు. ఇకపై ప్రజా సమస్యలపైనే దృష్టి పెడతామని స్పష్టం చేశారు. సతారా ఫలితం ఊహించిందేనని అన్నారు.

### విర్రవీగితే.. వాత పెడతారు!


మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల దరిమిలా బీజేపీపై మిత్రపక్షం శివసేన విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టింది. అధికారంలో ఉన్న నాయకులు అహంకారంతో వ్యవహరించినందుకు ప్రజలు కీలెరిగి వాత పెట్టారని పేర్కొంది. ఎన్నికల ముందు సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలో చేపట్టిన 'మహా జనదేశ్ యాత్ర' ప్రభావమేదీ లేదని తేల్చింది. ఈ ఎన్నికల్లో కూటమికి 200కు పైగా స్థానాలు వస్తాయన్న ఫడ్నవీస్ అంచనాలు తప్పాయని పేర్కొంది. శివసేన అధికారిక పత్రిక సామ్నాలో రాసిన సంపాదకీయంలో బీజేపీపై విమర్శలు గుప్పించింది. విపక్షాల్లో చీలికలతో ఎన్నికల్లో గెలువలేరని స్పష్టమైందని పేర్కొంది. ఎన్నికల ముందు శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీని బీజేపీ తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని తెలిపింది. అయితే, 50 సీట్లకు పైగా గెలుచుకుని ఎన్సీపీ తమ బలం పెరిగిందని నిరూపించుకుందని, సరైన నాయకత్వంలేని కాంగ్రెస్ సైతం 44 స్థానాలు గెలుచుకుని తన సత్తా చూపిందన్నది. 'పార్టీల ఫిరాయింపులు, విపక్షాల్లో చీలికలతో ఎన్నికల్లో విజయం సాధించవచ్చని బీజేపీ భావించింది. అయితే, ఇలాంటి పనులకు పాల్పడే వాళ్లకు ఎలా బుద్ధి చెప్పాలో ప్రజలు కూడా నేర్చుకున్నారు' అని పేర్కొంది. 'ఉదయన్‌రాజే తరుపున సతారా లోక్‌సభ స్థానంలో మోదీ సభకు హాజరయ్యారు. ఉదయన్ రాజే బీజేపీలో ఉన్నందుకు ఛత్రపతి శివాజీ ఆశీస్సులు ఆయనకు లభించాయని సీఎం ఫడ్నవీస్ అన్నారు. అయినా, ఆయన అక్కడ ఓడిపోయారు' అని తెలిపింది. ఫడ్నవీస్ కంటే శరద్ పవార్ ఎంతో శక్తిమంతమైన వ్యక్తి అని కొనియాడింది. మన పాదాలు ఎప్పుడూ నేలపైనే ఉండాలని, అహంకారంతో పెట్రేగిపోయే అధికారుల్ని మహారాష్ట్ర ప్రజలు హర్షించరని బీజేపీకి శివసేన చురకలు అంటించింది. మరోవైపు, శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ట్విట్టర్ వేదికగా బీజేపీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పులి (శివసేన చిహ్నం) మెడలో ఓ గడియారం (ఎన్సీపీ చిహ్నం) వేలాడుతూ ఉండగా ఆ పులి కమలం (బీజేపీ చిహ్నం) వాసన చూస్తున్న ఓ కార్టూన్‌ను ఆయన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. దీపావళి కదా... తప్పుగా అనుకోకండి అని శీర్షిక పెట్టి దీన్ని పోస్టు చేశారు. ఒకవేళ మీరు మద్దతివ్వకపోతే తాము ఎన్సీపీ మద్దతు తీసుకుంటాం అన్న సందేశాన్ని ఇవ్వడానికే సంజయ్ ఈ కార్టూన్‌ను పోస్ట్ చేశారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కశ్మీర్, లడఖ్‌కు లెఫ్టినెంట్ గవర్నర్లు

- గిరీశ్‌చంద్ర ముర్మూ, రాధాకృష్ణ మాథుర్‌ను నియమించిన కేంద్రం
- ఈ నెల 31న ప్రమాణ స్వీకారం
- అదేరోజు నుంచి ఉనికిలోకి కొత్త కేంద్ర పాలిత ప్రాంతాలు



గిరీశ్ చంద్ర ముర్మూ



రాధాకృష్ణ మాథుర్

**న్యూఢిల్లీ:** కొత్తగా ఏర్పాటయ్యే జమ్ముకశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలకు తొలి లెఫ్టినెంట్ గవర్నర్లను కేంద్రం నియమించింది. కేంద్ర ఆర్థిక శాఖలో వ్యయ నిర్వహణ కార్యదర్శి గిరీశ్ చంద్ర ముర్మూకు జమ్ముకశ్మీర్, రక్షణ శాఖ మాజీ కార్యదర్శి రాధాకృష్ణ మాథుర్‌కు లడఖ్ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు కేంద్రం శుక్రవారం తెలిపింది. గుజరాత్ కేడర్ 1985 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ముర్మూ (59), నరేంద్ర మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఆ రాష్ట్ర అదనపు ప్రిన్సిపల్ కార్యదర్శిగా పని చేశారు. ఈ ఏడాది నవంబర్ 30న ముర్మూ పదవీ విరమణ చేయనున్నారు. ఆర్‌కే మాథుర్ త్రిపుర కేడర్‌కు చెందిన 1977 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జమ్ముకశ్మీర్ ప్రస్తుత గవర్నర్ సత్యపాల్ మాలిక్‌ను కేంద్రం గోవాకు బదిలీ చేసింది. 2017 సెప్టెంబర్‌లో బీహార్ గవర్నర్‌గా నియమితులైన ఆయన గతేడాది ఆగస్టులో జమ్ముకశ్మీర్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుత గోవా గవర్నర్ మృదుల సిన్హా స్థానాన్ని మాలిక్ భర్తీ చేస్తారు. ఆగస్టులో ఆమె ఐదేండ్ల పదవీకాలం పూర్తి కాగా ఈ నెల 23 వరకు పొడిగించారు. బీజేపీ కేరళ అధ్యక్షుడు పీఎస్ శ్రీధరన్ పిళ్లైను మిజోరం గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటన చేసింది. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) మాజీ అధిపతి, జమ్ముకశ్మీర్‌లో కేంద్రం చర్చల ప్రతినిధి దినేశ్వర్ శర్మను లక్షదీప్ పరిపాలన విభాగానికి బదిలీ చేసినట్లు హోంశాఖ తెలిపింది. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370ని కేంద్రం ఆగస్టు 5న రద్దు చేయడంతోపాటు ఆ రాష్ట్రాన్ని జమ్ముకశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన సంగతి తెలిసిందే. ఈ రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ నెల 31 నుంచి ఉనికిలోకి వస్తాయి. ఈ నేపథ్యంలో వీటికి తొలి లెఫ్టినెంట్ గవర్నర్లుగా కేంద్రం నియమించిన ముర్మూ, మాథుర్ అదే రోజు శ్రీనగర్, లేహ్‌లో ప్రమాణ స్వీకారం చేస్తారు.

## ఉగ్రవాదుల నియంత్రణలో పీవోకే

భారత సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్



**న్యూఢిల్లీ:** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను ఉగ్రవాదులు నియంత్రిస్తున్నారని భారత సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ పేర్కొన్నారు. గిల్గిట్-బాల్టిస్తాన్, పీవోకేలను పాక్ అక్రమంగా తన స్వాధీనంలోకి తీసుకున్నదని మండిపడ్డారు. భారత్‌కు వ్యతిరేకంగా పాక్ ఎటువంటి దుస్సాహసానికి పాల్పడినా తిప్పి కొట్టేందుకు భారత్ సర్వ సన్నద్ధంగా ఉన్నదన్నారు. శుక్రవారం ఫీల్డ్ మార్షల్ కేఎం కరియప్ప స్మారకోపన్యాసం చేస్తూ..రాజ్యాంగంలోని ఒకటో అధికరణం ప్రకారం భారత్‌లో జమ్ముకశ్మీర్ భాగమన్నారు. దీని ప్రకారం పీవోకే, గిల్గిట్-బాల్టిస్థాన్ కూడా భారత్‌లో అంతర్భాగమేనని జనరల్ రావత్ అన్నారు. కనుక భారత్ భూభాగంలోని పీవోకే, గిల్గిట్-బాల్టిస్థాన్‌లను పొరుగుదేశం ఆక్రమించుకున్నదని చెప్పారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని తొలిగించిన తర్వాత కశ్మీర్‌లోయలో సాధారణ పరిస్థితులకు అంతరాయం కలిగించేందుకు ఉగ్రవాదులు.. ఆపిల్ వ్యాపారులపైనా, రాష్ట్రేతర డ్రైవర్లపైనా దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు.

## సహచరులపై సైనికుడి కాల్పులు..

రష్యాలో ఎనిమిది మంది మృతి

**మాస్కో:** రష్యాలో ఓ సైనికుడు తోటి సైనికులపై కాల్పులు జరిపాడు. దీంతో ఎనిమిది మంది జవాన్లు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ ఘటన శుక్రవారం ఛీటా ప్రాంత సైనిక స్థావరంలో జరిగింది. మృతుల్లో ఇద్దరు అధికారి స్థాయివాళ్లు ఉన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల మానసికంగా బాధపడుతున్న సైనికుడు కాల్పులకు పాల్పడ్డాడని రక్షణశాఖ అధికారులు తెలిపారు. దీనిపై విచారణకు కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## 2022 నాటికి పార్లమెంటుకు కొత్తరూపు

మూడోపేజీ తరువాయి...

కేంద్రంగా పనిచేసే 'హెచ్‌సీపీ డిజైన్, ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ'కి ఈ కాంట్రాక్టు దక్కింది. పార్లమెంటు రీ డిజైన్‌తో పాటు ఢిల్లీలోని సెంట్రల్ విస్టా, రాజ్‌పథ్ ప్రాంతాల్ని కూడా ఈ సంస్థ పునరుద్ధరించనున్నది. ఈ విషయాన్ని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్‌దీప్ పూరి శుక్రవారం వెల్లడించారు. 'ఢిల్లీలోని సెంట్రల్ విస్టా, పార్లమెంట్ భవనం, రాజ్‌పథ్ ప్రాంతాల్ని రీ డిజైన్ చేసే ప్రాజెక్టులను హెచ్‌సీపీ సంస్థ దక్కించుకున్నది' అని తెలిపారు. ఈ ప్రాజెక్టుల కోసం పోటీ పడిన పలు కాంట్రాక్ట్ సంస్థల గురించి సమీక్షించిన తర్వాత సాధికారత జ్యూరీ కమిటీ సభ్యులు తుది నిర్ణయాన్ని తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా హెచ్‌సీపీ సంస్థ 2022 నాటికి (75వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి) ప్రస్తుతం ఉన్న పార్లమెంటు భవనాన్ని పునరుద్ధరించడం లేదా కొత్త భవనాన్ని నిర్మించడం గానీ చేయాలి. అలాగే, 2024 నాటికి కనీసం డజను ప్రభుత్వ కార్యాలయాలతో సమీకృత భవన సముదాయాన్ని ఏర్పాటు చేయాలి. ప్రాజెక్టులో భాగంగా రాజ్‌పథ్‌ను కూడా హెచ్‌సీపీ పునరుద్ధరించాల్సి ఉంటుంది. దీంట్లో భాగంగా సుమారు 4 చ. కి. మీ. విస్తీర్ణంలో అంటే రాష్ట్రపతి భవన్ నుంచి విజయ్‌చౌక్, మధ్య ఢిల్లీలోని ఇండియా గేట్ వరకు ఉన్న ప్రాంతాలన్నిటినీ పునరుద్ధరిస్తారు. కాగా, ఈ మూడు ప్రాజెక్టుల కోసం 15 నిర్మాణ సంస్థల నుంచి 24 ప్రతిపాదనలను గత సెప్టెంబర్‌లో ప్రభుత్వం స్వీకరించింది. వీటిలో ఆరు సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి. బిడ్డింగ్‌లో అహ్మదాబాద్, ముంబై, ఢిల్లీకి చెందిన పలు సంస్థలు పాల్గొన్నాయి. హెచ్‌సీపీ సంస్థ గతంలో సబర్మతీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను, ఢిల్లీలో బీజేపీ నూతన ప్రధాన కార్యాలయం నిర్మాణ ప్రాజెక్టును పూర్తి చేసింది.

# దూసుకొస్తున్న తుఫాన్ 'క్యార్'

మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, గుజరాత్‌లపై ప్రభావం: ఐఎండీ

**ముంబై, మంగళూరు, అక్టోబర్ 25:** అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం శుక్రవారం తెల్లవారుజామున తుఫాన్‌గా మారిందని, శనివారం ఇది పెను తుఫాన్‌గా మారే అవకాశముందని వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని సముద్రతీర ప్రాంత జిల్లాలు రత్నగిరి, సింధూదుర్గ్‌లలో శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువొచ్చంటూ హెచ్చరిక జారీ చేసింది. తుఫాన్ 'క్యార్' వల్ల బలమైన గాలులు వీస్తాయని, ఈ గాలులు శనివారం గంటకు 110 కి.మీ. వేగంతో వీచే అవకాశముందని తెలిపింది. మహారాష్ట్ర తీరప్రాంత జిల్లాలు కాకుండా మిగతా ప్రాంతాల్లో, ఉత్తర కర్ణాటక, గుజరాత్, గోవా తీరప్రాంతాల్లో కూడా రానున్న 24 గంటల్లో గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో గాలులు వీయొచ్చని పేర్కొంది. అరేబియా సముద్రంలో ఏర్పడిన ఈ తుఫాన్ ఓమన్ తీరం వైపునకు పయనించే అవకాశముందని వెల్లడించింది. మరోవైపు తుఫాన్ ప్రభావం కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాపై పడింది. ఆ జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. చాలా చోట్ల వృక్షాలు నేలకొరిగాయి.



గోవా తీరంలో క్యార్ తుఫాన్ ప్రభావంతో వీచిన గాలులకు కార్లపై విరిగిపడిన కొబ్బరిచెట్టు

పలు ఇండ్లు దెబ్బతిన్నాయి. దక్షిణ కన్నడ, ఉడిపి, ఉత్తర కన్నడ జిల్లాల్లో శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ తెలిపింది.

## 'కర్తార్‌పూర్' రుసుమును కేంద్రమే భరించాలి

- కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 25:** పాకిస్థాన్‌లోని కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారాను దర్శించడానికి వెళ్లే భారత యాత్రికులపై ఆ దేశం విధించే 20 డాలర్ల (రూ.1,400) రుసుమును భారత ప్రభుత్వమే భరించాలని కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ డిమాండ్ చేశారు. ఈ జిజియా పన్నును విధించకుండా చూడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, కాబట్టి కేంద్రమే దీన్ని భరించాలని సూచించారు. శుక్రవారం ఆయన ట్విట్టర్‌లో స్పందిస్తూ 'ప్రతిరోజు దాదాపు 5,000 మంది భారత్ యాత్రికులు కర్తార్‌పూర్‌ను సందర్శించడానికి వెళ్లనున్నారు. ఒక్కో యాత్రికుడి వద్ద పాకిస్థాన్ రూ.1,400 వసూలు చేయనుంది. అంటే ఒక్క రోజుకు రూ.70 లక్షలు వసూలు అవుతాయి. ఈ లెక్క ప్రకారం సంవత్సరానికి రూ.265 కోట్లను పాక్ వసూలు చేస్తుంది. అసలు ఈ రుసుమును విధించకుండా అడ్డుకోవడంలో భారత్ విఫలమైంది. కాబట్టి ఈ రుసుమును భారత ప్రభుత్వమే భరించాలి' అని కోరారు. మరోవైపు ఓ అధికారి మాట్లాడుతూ 'భారత కరెన్సీ ప్రకారం ఒక అమెరికన్ డాలర్ రూ.70 వరకు విలువ చేస్తుంది. అదే పాకిస్థాన్ కరెన్సీ ప్రకారం రూ.155.74 విలువ చేస్తుంది. అంటే వసూలయ్యే మొత్తం రూ.555 కోట్లు అవుతుంది' అన్నారు.


**THE COOPERATIVE ELECTRIC SUPPLY SOCIETY (CESS) LTD, SIRCILLA-505301, DIST:RAJANNA SIRCILLA**
**RECRUITMENT NOTIFICATION NO.1/2019, DT: 25-10-2019**
Applications are invited from eligible candidates for filling up vacancies for the post of Additional Assistant Engineers (13 Nos) in CESS Ltd. Sircilla. Detailed notification available on or after 03-11-2019 on website www.tscess2019.com Sd/- **Managing Director**



హర్యానాలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ బీజేపీ సాధించలేకపోయింది. హర్యానా ప్రజలతో తిరస్కారానికి గురైనామని దీంతోనైనా బీజేపీ గుర్తించాలి. అధికారం కోసం ప్రలోభాలకు దిగితే, అది ప్రజలను వంచించటమే అవుతుంది.

**కమల్‌నాథ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి**

గోపాల్ కందా నేరస్తుడా, కాదా అన్నది కోర్టు నిర్ణయిస్తుంది. అది సాక్ష్యాధారాలను బట్టి నిర్ణయించబడుతుంది. హర్యానా ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన క్లీన్‌చిట్ వచ్చినట్లు కాదు. ఎన్నికల్లో గెలువటానికి అనేక కారణాలు పనిచేస్తాయి.

**ఉమాభారతి, సీనియర్ బీజేపీ నాయకురాలు**



**చరిత్రలో నేడు**



**1916**

కుటుంబ నియంత్రణ గురించి ప్రచారం చేసిన మార్గరెట్ సాంగర్. అనైతికాన్ని బోధిస్తున్నదన్న ఆరోపణపై అరెస్టు.

**1947**

భారత్‌తో విలీన ఒప్పందం చేసుకున్న జమ్ము కశ్మీర్ మహారాజు రాజా హరిసింగ్.





**1950**

కలకత్తాలో మిషనరీస్ ఆఫ్ చారిటీ ప్రారంభించిన మదర్ థెరిసా.

మహారాష్ట్ర, హర్యానా శాసనసభ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు పునర్జీవనం వచ్చింది. గత లోక్‌సభ ఎన్నికల్లో తిరుగులేని విధంగా ఆధిపత్యాన్ని ప్రదర్శించిన బీజేపీ, ఇప్పుడు అధికారం కోసం మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన స్థితి ఏర్పడింది. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ప్రాభవాన్ని కోల్పోయిన స్థితికి ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అద్దం పడుతున్నాయి. ఓటర్ల తీర్పు బీజేపీకి ఇచ్చిన సందేశంగా పరిగణించవచ్చు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

భారత ఆర్థికవ్యవస్థకు మంచిరోజులు రానున్నాయి. సులభతర వాణిజ్యంపై ప్రపంచబ్యాంకు చేసిన అధ్యయనంలో భారత్ మెరుగైన పాయింట్లను సాధించింది. సులభతర వాణిజ్య ర్యాంకింగ్‌లో 2014లో 142వ స్థానంలో ఉన్న భారత్, 2020 నాటికి 63వ స్థానానికి చేరుకోనున్నది. ప్రపంచవ్యాప్తంగా సులభ వ్యాపార పది దేశాల్లో భారత్ స్థానం దక్కించుకున్నది. దీంతో విదేశీ పెట్టుబడుల ప్రవాహంతో భారత ఆర్థికస్థితికి ఊపు రానున్నది.

**ది హిందూ**



# కర్తార్‌పూర్ బాట

భారత పాకిస్థాన్ దేశాల మధ్య నిర్మాణమవుతున్న కర్తార్‌పూర్ కారిడార్ రెండుదేశాల మధ్య శాంతివారధిగా మారాలనే ఆశాభావం వ్యక్తమవుతున్నది. ఈ కారిడార్‌ను సిక్కు మత స్థాపకుడు గురునానక్ 550 జయంతి సందర్భంగా వచ్చే నెలలో ప్రారంభించడానికి వీలుగా గురువారం నాడు రెండుదేశాల ప్రతినిధుల మధ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భారత హోం మంత్రిత్వ శాఖ ఆంతరంగిక భద్రత సంయుక్త కార్యదర్శి ఎస్.సి.ఎల్.దాస్, పాకిస్థాన్ విదేశాంగ శాఖ అధికారి మహమ్మద్ ఫైజల్ సరిహద్దు రేఖ మీద భేటీ అయి సంతకాలు చేశారు. గురునానక్ చివరి దశలో గడిపిన ప్రదేశంలో నిర్మించినది కావడం వల్ల సరిహద్దుకు అవతలివైపున పాకిస్థాన్‌లో ఉన్న దర్బార్ సాహిబ్ గురుద్వారా సిక్కులకు పవిత్రమైనది. కానీ పాకిస్థాన్‌లో ఉండటం వల్ల సిక్కులు ఈ గురుద్వారాను దర్శించుకోలేకపోతున్నారు. ఇంతకాలం సరిహద్దుకు ఇవతల ఎత్తు ప్రదేశానికి చేరుకొని టెలిస్కోపు ద్వారా ఈ గురుద్వారాను దర్శించుకునేవారు. ఈ గురుద్వారాకు సులభంగా వెళ్ళడానికి ఏర్పాట్లుచేయాలని రెండుదేశాల ప్రభుత్వాలను ప్రపంచవ్యాప్తంగా సిక్కులు ఎంతోకాలంగా కోరుతున్నారు. ఎంతోకాలంగా చర్చలు సాగిన అనంతరం ఎట్టకేలకు రెండుదేశాలు ఒప్పందంపై సంతకాలు చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతున్నది. సరిహద్దుకు అతిదగ్గరలోనే భారత భూభాగంలో డేరా బాబా నానక్ గురుద్వారా ఉన్నది. ఇది కూడా ప్రాముఖ్యం గలదే. ఈ రెండు గురుద్వారాల మధ్య రహదారిని నిర్మిస్తే సిక్కులు పాకిస్థాన్‌లోని దర్బార్ సాహిబ్ గురుద్వారాను సందర్శించడం సులభమవుతుంది.

దేశ విభజన తర్వాత తమకు పవిత్రమైన గురుద్వారాను కోల్పోయామనే బాధ సిక్కులలో నెలకొన్నది. ఒక దశలో ఆ ప్రాంతాన్ని భారత్ స్వాధీనం చేసుకోవాలనే విజ్ఞప్తి కూడా వచ్చింది. అప్పట్లో ప్రధాని ఇందిరాగాంధీ మన భూభాగాన్ని కొంత అప్పగించి అందుకు బదులుగా పాకిస్థాన్ నుంచి గురుద్వారా ప్రాంతాన్ని ఇవ్వమని కోరుతామని తెలిపారు. 1990 దశకంలో దక్షిణాసియా దేశాల మధ్య వాణిజ్యంతో పాటు ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయాలనే విధానాలు బలపడ్డాయి. 1999లో వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఢిల్లీ-లాహోర్ బస్సు సౌకర్యంతో పాటు కర్తార్‌పూర్ కారిడార్ ప్రతిపాదన ముందుకు వచ్చింది. ఆ తర్వాత ఎన్నో చర్చలు తర్వాత గతేడాది-2018లో శంఖుస్థాపన జరిగింది. కర్తార్‌పూర్ కారిడార్ దాదాపు ఐదు కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఈ రహదారిలో భాగంగా మధ్యలో రావి నదిపై వంతెన కూడా నిర్మించవలసి వస్తున్నది. ఎవరి భూ భాగంలోని మార్గాన్ని ఆ దేశం నిర్మించుకోవలసి ఉంటుంది. రెండు దేశాలు ఇప్పటికే తమవంతు నిర్మాణాన్ని ప్రారంభించాయి. ఈ నెల ఒకటవ తేదీలోగా నిర్మాణం పూర్తిచేయడానికి శరవేగంగా పనులు సాగుతున్నాయి. భారత్ నుంచి పాకిస్థాన్‌లోని దర్బార్ సాహిబ్ గురుద్వారాకు వెళ్లే యాత్రికులు వీసా తీసుకోవలసిన అవసరం లేదు. అయితే యాత్రికులు పాకిస్థాన్ నుంచి అనుమతి పొందవలసి ఉంటుంది. భారత్ ద్వారానే ఎప్పటికప్పుడు యాత్రికుల జాబితా పాకిస్థాన్‌కు చేరుతుంది.


> **రెండుదేశాల మధ్య సరిహద్దులో కాల్పులు కూడా సాగుతున్న దశలో కర్తార్‌పూర్ కారిడార్ ఒప్పందం కుదురడం ఆశ్చర్యకరపరిణామమే. కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా వెళ్లడానికి యాత్రికులు ఇరువై డాలర్ల ఫీజు చెల్లించాలనే నిబంధన పట్ల భారత్ అభ్యంతరం తెలిపింది. కానీ వచ్చే నెల గడువు దగ్గరలోనే ఉన్నందున వివాదాలతో కాలయాపన చేయవద్దని నిర్ణయించింది. పాకిస్థాన్ నుంచి వీసా పొంది ఈ గురుద్వారా సందర్శించడం అంత సులభం కాదు. రెండుదేశాల మధ్య ఎప్పుడూ ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. ఇప్పటి పరిస్థితిలో అయినా సిక్కులకు ఈ దర్శన భాగ్యం కలుగడమే పెద్ద ఊరట.**

రోజుకు పదివేల మంది యాత్రికులు వెళ్లిరావడానికి అవకాశం ఉంటుంది. ఉదయం వెళ్ళిన యాత్రికులు రాత్రిలోగా తిరిగి రావలసిందే. కర్తార్ కారిడార్‌కు ఇరువైపులా ముళ్ళ కంచె ఉంటుంది.

రెండుదేశాల మధ్య సరిహద్దులో కాల్పులు కూడా సాగుతున్న దశలో కర్తార్‌పూర్ కారిడార్ ఒప్పందం కుదురడం ఆశ్చర్యకరపరిణామమే. కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా వెళ్లడానికి యాత్రికులు ఇరువై డాలర్ల ఫీజు చెల్లించాలనే నిబంధన పట్ల భారత్ అభ్యంతరం తెలిపింది. కానీ వచ్చే నెల గడువు దగ్గరలోనే ఉన్నందున వివాదాలతో కాలయాపన చేయవద్దని నిర్ణయించింది. పాకిస్థాన్ నుంచి వీసా పొంది ఈ గురుద్వారా సందర్శించడం అంత సులభం కాదు. రెండుదేశాల మధ్య ఎప్పుడూ ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. ఇప్పటి పరిస్థితిలో అయినా సిక్కులకు ఈ దర్శన భాగ్యం కలుగడమే పెద్ద ఊరట. సిక్కుల యాత్ర కోణంలో రెండు దేశాలు దిగివచ్చి ఒప్పందం కుదుర్చుకోవడం ఒక అరుదైన ఘట్టం. ఈ ఘట్టాన్ని అంతవరకు మాత్రమే పరిమితం చేసి చూడాలనీ, మరీ ఎక్కువగా ఆశించకూడదని సైనికాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్ ఈ యాత్రలను ఖలిస్థాన్‌వాదులను సమీకరించడానికి ఉపయోగించుకుంటుందనే అనుమానాలు భారత్‌కు ఉన్నాయి. రెండుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైనప్పుడల్లా ఆ ప్రభావం ఈ యాత్రలపై ఎట్లా ఉంటుందనేది ఇప్పుడే ఊహించలేం. కర్తార్‌పూర్ కారిడార్‌ను చరిత్రను మలుపుతిప్పే ఘటనగా భావించకున్నా, సత్సంబంధాల బాటలో ఇదొక ముందడుగుగా భావించవచ్చు. ప్రజల మధ్య సంబంధాలు బలపడితే ప్రభుత్వాల మధ్య ఉద్రిక్తతలు సడలుతాయనడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడం ద్వారా పాకిస్థాన్‌ను నియంత్రించడం అనేది కూడా ఒక విదేశాంగ వ్యూహం కావాలె. ఆధునికయుగంలో పలు అభివృద్ధి చెందిన దేశాలు ఇటువంటి విధానాలను అనుసరిస్తున్నాయి.

**జనగళం**

## జ్ఞానజ్యోతి దీపావళి



**అశ్వీయుజపు అంచులో**
ఆనాటి రాముని విజయగాథల్ని మోసుకొస్తూ
నాటి వీరనారి సత్యభామ శౌర్యాన్ని గుర్తుచేస్తూ
నింగి నుంచి తారలు దిగివచ్చి
భువి యెదపై పసుపు తివాచీ పరిచినట్లు
ఇంటింటా కోటి వెలుగులు విరజిమ్ముతూ
చిన్నిచిన్న దివిటీల దీపాలు
చీకటి అనే అజ్ఞానాన్ని
ఈ లోకం నుంచి తరిమేస్తూ
దేదీప్యమానంగా ప్రకాశిస్తూ
పసిపాప నుంచి పండుముసలి దాకా
ఉకరలెత్తే ఉత్సాహంతో
కేరింతల పులకింతలతో
అంబరమంటే సంబురాల కేళీ
ఆనందాల ఆరావళి
కోటి వెలుగుల ఈ దీపావళి..!
మిత్రమా..
అజ్ఞానమనే తిమిరాన్ని తరిమివేస్తూ
నీ మదిలోని జ్ఞానజ్యోతిని
వెలిగించిన నాడే
నీ జీవితానికి
నిజమైన దీపావళి!!

**- డాక్టర్ ఆర్.రమేష్, 9849294694**


**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118


**ముక్తసరి**



**దేవులపల్లి ప్రభాకరరావు**

# మట్టి కరచిన మతోన్మాదం

హుజూర్‌నగర్ ఎన్నిక ఫలితాలకు జాతీయస్థాయిలో ఎంతో ప్రాధాన్యం ఉన్నది. విచ్ఛిన్నకర, నిరంకుశ విధానాలతో భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి భంగం కలిగిస్తున్న మతోన్మాద శక్తులను తట్టుకొని గెలువడం కష్టమన్న ప్రచారం గత ఆరు సంవత్సరాల నుంచి జరుగుతున్నది; ఈ ప్రచారంతో ప్రజాస్వామ్యశక్తులు దేశమంతట నిస్పృహపాలై బలహీనపడుతున్నాయి. ఈ ప్రచారంలో పసలేదని తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వం నిరూపించింది.

తెలంగాణ పీఠభూమిపై మతోన్మాదం మరోసారి మట్టి కరచింది; ఎప్పుడూ డిపాజిట్ కోల్పోయే పార్టీ మరోసారి డిపాజిట్ కోల్పోయింది; కుహనా దేశభక్తి, జాతీయ దురభిమానం నినాదాలతో ప్రజలను మభ్యపెడుతున్న పార్టీ ఆటలు ఇక్కడ ఈ తెలంగాణ పోరాటాల గడ్డపై ఎంతమాత్రం సాగబోవని మరోసారి ప్రపంచానికి వెల్లడైంది. తమ మాటలకు చేతలకు అడ్డులేదని, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు తమ కుట్రలను ఇవి కుట్రలని చెప్పగలిగేవారు, సవాలు చేయగలిగేవారు లేరని, ఇక దేశమంతట ఆధిపత్యం తమదేనని విర్రవీగుతున్నవారికి దిమ్మతిరిగే దెబ్బ తెలంగాణ గడ్డపై మరోసారి తప్పలేదు. దేశభద్రత పేరిట దేశంలో ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తూ, కోట్లాది దేశ ప్రజలను అభద్రతకు గురిచేస్తున్న పార్టీకి, మతోన్మాదశక్తికి ఈ రాష్ట్రంలో చోటులేదని చాటిచెప్పిన ఘనత తెలంగాణ నేలది. గత ఆరు సంవత్సరాల అనైతిక, నిరంకుశ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను కుంగదీసిన పార్టీకి ఇక్కడ ఈ రాష్ట్రంలో అంగుళమైనా స్థానం లేదని తీర్పు ఇచ్చిన వారు తెలంగాణ ప్రజలు. హుజూర్‌నగర్ శాసనసభ ఉప ఎన్నిక ఫలితాల్లో తెలంగాణ ప్రజల, ఓటర్ల చైతన్యం, అవగాహన, పరిణతి స్పష్టంగా వ్యక్తమైనాయి. ఇళ్లు కాలి ఒకడు ఏడుస్తుంటే కొందరు చలికాచుకొని ఆహ్లాదం పొందినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న తాత్కాలిక సమస్యలను మరింత రెచ్చగొట్టి కొందరు లాభపడాలనుకున్నారు. ఈ ఉపఎన్నిక తర్వాత ఇక రాష్ట్రంలో తమదే అధికారం అన్నట్లు భ్రమలు పడ్డారు. వీరందరికి మరోసారి ఆశాభంగం తప్పలేదు. ఈ ప్రతిపక్ష పక్షులు భ్రమల్లో తేలియాడటం ఇది మొదటిసారి కాదు-2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణమే భ్రమల పర్వం మొదలైంది. అప్పుడు ఈ భ్రమల పర్వం చక్రవర్తి చంద్రబాబు నాయుడు. 2019లో తెలంగాణలో అధికారం తమదే అన్నారు. 2019 ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి ఘన విజయం సాధించడంతో భ్రమల చక్రవర్తి, ఆయన అనుచరులు తోక ముడువకతప్పలేదు. మతోన్మాద అధినేతలు, వారి లోకల్ చేలాలు తెలంగాణలో అధికారం కోసం కలలు గనడంలో ఇప్పుడు అగ్రగామిగా మొదటి శ్రేణిలో మొదటిస్థానంలో ఉంటున్నారు. ఎన్ని భ్రమలు కన్నా, ఎంతగా ఊహాలోకంలో విహరించినా, అధికారం తమదేనని ఎంతగా ప్రచారం జరిపినా వీళ్లకు కనీసం డిపాజిట్లు అయినా దక్కడం లేదు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఫలితానికి ఎన్నో విధాల ఎంతో ప్రాధాన్యం ఉన్నది. తెలంగాణ ప్రజలు, ఓటర్లు బయటి శక్తులు అరచేతిలో వైకుంఠం చూపించినా వారిని విశ్వసించడం లేదని, వారిని బయటిశక్తులుగానే పరిగణించి ఏవగించుకుంటున్నారని హుజూర్‌నగర్ ఎన్నికల ఫలితాల్లో మరోసారి వెల్లడైంది. బయటిశక్తులు తమ ప్రయోజనాలను పరిరక్షించలేరని తెలంగాణ ప్రజలు గట్టిగా భావిస్తున్నారు. గత ఆరేండ్ల నుంచి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తూ సకల జనుల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న కేసీఆర్ ప్రభుత్వం మాత్రమే తమ ప్రయోజనాలను పరిరక్షిస్తుందని తెలంగాణ ప్రజలు దృఢంగా విశ్వసిస్తున్నారు. హుజూర్‌నగర్ ఉపఎన్నిక ఫలితాల్లో నిర్దిష్టంగా ధ్రువపడిన యదార్థాలు ఇవి.



అంతేకాదు, హుజూర్‌నగర్ ఎన్నిక ఫలితాలకు జాతీయస్థాయిలో ఎంతో ప్రాధాన్యం ఉన్నది. విచ్ఛిన్నకర, నిరంకుశ విధానాలతో భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి భంగం కలిగిస్తున్న మతోన్మాద శక్తులను తట్టుకొని గెలువడం కష్టమన్న ప్రచారం గత ఆరు సంవత్సరాల నుంచి జరుగుతున్నది; ఈ ప్రచారంతో ప్రజాస్వామ్యశక్తులు దేశమంతట నిస్పృహపాలై బలహీనపడుతున్నాయి. ఈ ప్రచారంలో పసలేదని తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వం నిరూపించింది. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు అన్ని ఎన్నికల్లో (ఫ్లూక్‌గా గెలిచిన మూడు లోక్‌సభ స్థానాలను మినహాయిస్తే) మతోన్మాదులు డిపాజిట్లు కోల్పోయారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఘన విజయం సాధించింది. వెన్నెముక విరిగిన, జాతీయ పార్టీగా చలామణి అవుతున్న కాంగ్రెస్ పార్టీ నిస్పృహ పాలై రోజుకో అపవిత్ర కలయికకు అంగీకరిస్తున్నా ఏ ఎన్నికల్లోనూ గెలువలేకపోతున్నది. ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను సోకాల్డ్ జాతీయపార్టీలు పరిరక్షించలేవని, ప్రాంతీయ పార్టీలు మాత్రమే గుర్తిస్తాయని, గౌరవిస్తాయని, పరిరక్షిస్తాయని ప్రజలు భావిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో ఇంతవరకు జరిగిన ఎన్నికల్లో స్పష్టమైంది. దేశమంతట మతోన్మాదుల విజృంభణ వల్ల రాష్ట్రాల అధికారాలకు, ప్రాంతీయ ప్రయోజనాలకు భంగం కలుగుతున్నది. ఇందుకు ఇటీవలి ప్రబల నిదర్శనం కశ్మీరు; ఆరు రోజులయితే ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా జమ్ము-కశ్మీర్ మూడు ముక్కలవుతుంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో, స్వతంత్ర భారత దేశంలో ఇదొక ఘోర సంఘటన. కశ్మీర్ నాయకులను, ముఖ్యంగా ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులను, వేలాది రాజకీయకార్యకర్తలను, సామాజిక కార్యకర్తలను, విద్యార్థులను, స్త్రీలను జైళ్లలో బంధించి, సాయుధ బలగాల అండతో కశ్మీరును మూడు ముక్కలు చేయడం జరుగుతున్నది. ఈ విపరీత, అప్రజాస్వామిక చర్యను ప్రపంచమంతా గర్హిస్తున్నా, ప్రజాస్వామిక భారతదేశం అప్రతిష్టపాలవుతున్నా మతోన్మాదశక్తులు వాటి ధోరణిని మార్చుకోవడం లేదు. కశ్మీరులో మానవహక్కులకు భంగం కలిగిందని అమెరికన్ కాంగ్రెస్‌లో, బ్రిటన్ పార్లమెంట్‌లో, ఇస్లామిక్ దేశాలలో తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. అమెరికా (యూఎస్ఏ) తదితర పాశ్చాత్య దేశాల మీడియాలో భారత ప్రభుత్వం పట్ల విమర్శలు చెలరేగుతున్నాయని భారత విదేశాంగశాఖ మంత్రి స్వయంగా అంగీకరించారు.

> వెన్నెముక విరిగిన, జాతీయ పార్టీగా చలామణి అవుతున్న కాంగ్రెస్ పార్టీ నిస్పృహ పాలై రోజుకో అపవిత్ర కలయికకు అంగీకరిస్తున్నా ఏ ఎన్నికల్లోనూ గెలువలేకపోతున్నది. ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను సోకాల్డ్ జాతీయపార్టీలు పరిరక్షించలేవని, ప్రాంతీయ పార్టీలు మాత్రమే గుర్తిస్తాయని, గౌరవిస్తాయని, పరిరక్షిస్తాయని ప్రజలు భావిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో ఇంతవరకు జరిగిన ఎన్నికల్లో స్పష్టమైంది.

మతోన్మాదుల మతిభ్రమణాన్ని, నిరంకుశధోరణిని సూచించే విజ్ఞతా రహిత చర్య కశ్మీర్ ప్రజా నాయకులందరిని నిర్బంధించి, మూడు నెలల నుంచి కశ్మీరు ప్రజల ప్రాథమిక హక్కులకు, మానవహక్కులకు భంగం కలిగించి కశ్మీర్ భవిష్యత్తును మతోన్మాదులు ఏకపక్షంగా నిర్ణయించడం. ఇది నిరంకుశత్వానికి పరాకాష్ట. కశ్మీర్‌లో అక్కడి ప్రజలు రాళ్లు కొట్టడం, తుపాకులు పట్టడం బదులు ప్రస్తుతం గాంధేయ విధానాలను అనుసరిస్తున్నారనిపిస్తున్నది. గాంధీజీ ప్రబోధించిన శాసనోల్లంఘన, సహాయ నిరాకరణ విధానాలను కశ్మీర్ ప్రజలు అనుసరిస్తున్నారు. పాఠశాలలు తెరిచినా తల్లిదండ్రులు తమ బిడ్డలను పాఠశాలలకు పంపడం లేదు. సైనిక నిఘాలో కార్యాలయాలు తెరువడానికి ప్రయత్నించినా కశ్మీరు ప్రజలు కార్యాలయాలకు వెళ్లడంలేదు. కశ్మీరు ప్రజలు తమ ఇండ్లకు వేసిన తాళాలను తీయడం లేదు. పోస్ట్ పెయిడ్ సెల్‌ఫోన్లకు కొంతవరకు అనుమతి ఇచ్చినా రాష్ట్రంలోని రాష్ట్రపతి ప్రభుత్వం ఎస్.ఎం.ఎస్.లకు, ఫేస్‌బుక్ సంబంధాలకు అనుమతి ఇవ్వడానికి భయపడుతున్నది. రాష్ట్ర నాయకులను, కార్యకర్తలను, మాజీ ముఖ్యమంత్రులను విడుదల చేస్తే కొంప మునుగుతుందన్న భయం మతోన్మాద ప్రభుత్వాన్ని పట్టి పీడిస్తున్నది. ఇవాళ కశ్మీర్‌కు జరిగిందే రేపు ఇంకే రాష్ట్రానికైనా జరిగే ప్రమాదం ఉన్నది. హుజూర్‌నగర్ చరిత్రాత్మక విజయంతో తెలంగాణ ప్రజలు ముక్త కంఠంతో కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని నిర్ద్వంద్వంగా స్పష్టమైంది. రాష్ట్రాల హక్కుల పరిరక్షణలో సీఎం కీలక పాత్ర నిర్వహిస్తే రాష్ట్ర ప్రజలు ఆయనకు అండగా ఉంటారనడంలో సందేహం లేదు.

# ప్రతిపక్షాలపై తిరుగుబాటు తీర్పు

**విశ్లేషణ**



**నర్రా విజయ్ కుమార్**

హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రతిపక్షాలపై తిరుగుబాటుగానే భావించాలి. ఎన్నికలు, స్వేచ్ఛ పేరుతో ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం, వ్యవహరించటం చేస్తే సహించేది లేదని ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారు. కేసీఆర్ నాయకత్వం, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారనే నమ్మకం, విశ్వాసం ఈ తీర్పుతో తేటతెల్లమైంది. ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవటంలో కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు, ఇతరసంస్థలు విఫలమయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలోని విపక్షాలు కొన్ని సంస్థలు, వ్యక్తులు నేలవిడిచి సాము చేశాయి. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఒక విప్లవంతో సమానం. విప్లవం తర్వాత ఏర్పడిన రాజ్యంలో ఆశలు, ఆకాంక్షలు ప్రజల్లో ఎక్కువగానే ఉంటాయి. వాటన్నింటినీ నెరవేర్చడం ప్రభుత్వాలకు కష్టంగానే ఉంటుంది. వీటన్నింటినీ బ్యాలెన్స్ చేస్తూ ప్రజలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంటుంది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ఉమ్మడిరాష్ట్రం నుంచి వారసత్వంగా వచ్చిన కొన్ని అలసత్వాలు, నిర్లక్ష్య ధోరణులు కొన్నివర్గాల్లో, ఉద్యోగుల్లో ఉంటాయి. వీటన్నింటిని సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. సరిచేసే క్రమంలో వస్తున్న ఇబ్బందులే సమ్మె రూపంలో బయటపడుతున్నాయి. కొత్తదనాన్ని, కొత్త పద్ధతులను ఉద్యోగులు తీసుకోలేకపోతున్నారు. వీటన్నింటిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వానికి అనేక ఇబ్బందులు వస్తున్నాయి. ఇబ్బందులను రాజకీయంగా వాడుకునే ప్రయత్నం మిగితా రాజకీయ పార్టీలు కొన్ని సంస్థలు చేస్తున్నాయి. అందులోభాగంగా ఉప ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో ఆర్టీసీ సమ్మెను ఇతర ఉద్యోగుల సమస్యలను, ప్రభుత్వాధినేతపై వ్యక్తిగత విమర్శలను ఎజెండాగా ఎన్నికల్లో ఇతర పార్టీలు ప్రజల ముందుంచాయి. వీటిని హుజూర్‌నగర్ ప్రజలు తిరస్కరించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజల్లో మారిన ఆలోచనా దృక్పథాన్ని అర్థం చేసుకోవటలో విపక్షాలు విఫలమవుతున్నాయి. ప్రజల్లో మారిన ఆలోచనను అధికార పార్టీ గ్రహించి దానికి అనుగుణంగా వ్యూహాలతో అడుగులు వేస్తున్నది. అయితే ఈ మార్పును ఉద్యోగులు, కొన్ని సెక్షన్లు ప్రజలు స్వాగతించలేక గతంలో లాగా రొటీన్‌గా ఒక వ్యతిరేక భావజాలంతో ఆలోచించినట్లు, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఆ నెగిటివ్ ఆలోచనలతోనే ముందుకువెళ్తున్నారు. ప్రభుత్వానికి, నెగిటివ్‌గా ఆలోచించే కొన్నివర్గాల ప్రజలకు, కొన్ని రాజకీయ పార్టీలకు, సంస్థలకు గ్యాప్ చాలా ఎక్కువగా ఉన్నది. అయితే ప్రజలతో నేరుగా సంబంధాలు కొనసాగిస్తున్న ప్రభుత్వం, సాధారణ ప్రజలు.. ఒకే సానుకూల దృక్పథంతో ముందుకువెళ్తున్నారు. ఇక్కడ ప్రజల ఆలోచనా విధానం గతంలో నెగిటివ్‌గా ఉండేది.

ప్రస్తుతం మారిన పరిస్థితులకు అనుగుణంగా సమాజంలో వస్తున్న పరిణామాలకు అనుగుణంగా సానుకూల దృక్పథంతో, ఆలోచనలతో ప్రజలు వెళ్తున్నారు, దానికి అనుగుణంగా ప్రభుత్వం వెళ్తుంది. కొన్ని సంస్థలు ఈ సానుకూల దృక్పథం అర్థం చేసుకోకుండా.. ఇరువై ఏండ్ల కిందట ఎలాంటి నెగెటివ్ రాజకీయాలు చేశారో, ప్రస్తుతం అలాంటి రాజకీయాలు చేస్తే ప్రజలు తిరస్కరిస్తున్నారు. ఈ ఉప ఎన్నిక ఫలితాన్ని ఆ కోణంలో చూడాలి. రాజకీయంగా టీఆర్‌ఎస్‌ను ఓడించాలంటే విపక్షాలు ఒక ప్రత్యామ్నాయ బలమైన, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకురావాల్సిన అవసరం ఉన్నది. కేవలం వ్యక్తులపై విమర్శలు తీవ్రపద జాలంతో ఆరోపణలు చేయటం వల్ల మీడియాలో అదేవిధంగా ఇతర సోషల్ మీడియాలో కొద్దిరోజులు ఉత్సాహంగా కామెంట్లు, ట్రోల్ కావచ్చు. కానీ అంతిమ ఫలితం సానుకూల దృక్పథం వైపే ప్రజలు తీర్పు ఇస్తున్నారు. ప్రజల్లో మారిన ఈ ఆలోచనావిధానాన్ని ప్రతిపక్షాలు గ్రహించలేకపోతున్నాయి. మూస పద్ధతిలోనే రాజకీయాలు చేస్తున్నారు. విమర్శకు ప్రతివిమర్శ సమాధానం అయినట్టు వ్యవహరిస్తున్నాయి. రాష్ట్రంలో విపక్షాలు తమ దృక్పథాన్ని పూర్తిగా మార్చుకోవలసిన అవసరం ఉన్నది.

ప్రజల ఆలోచన ఒక విధంగా ఉంటే ప్రతిపక్షాల విధానం మరోవైపు ఉన్నది. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకు ఏం కావాలి, ఎలా అయితే తెలంగాణలో మరింత అభివృద్ధి జరుగుతుందనే అంశంపై విపక్షాలు మేధోమథనం చేసుకోవాల్సిన సమయం వచ్చింది. గుడ్డిగా ఒకటి రెండు అంశాలను వ్యతిరేకిస్తూ అదే ప్రజల్లోకి తీసుకువెళ్తే సానుకూల ఫలితం వస్తుందని ఆలోచన ఉన్నన్ని రోజులు విపక్షాలకు ఇలాంటి తీర్పులే వస్తాయి. ప్రస్తుతం కేసీఆర్ ప్రభుత్వం కొన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తూ ప్రజలను ఆకట్టుకోగలిగింది. ఈ కార్యక్రమాలు కాకుండా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు, నీటి పారుదల రంగంలో కావచ్చు, లేదా విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో ఇంతకంటే ఎక్కువేం చేయగలమనే అంశంపై విపక్షాలు దృష్టిపెట్టి కేసీఆర్ కంటే మేం ఎక్కువచేసి చూపిస్తామనే విశ్వాసం ప్రజల్లో కల్పించి, ఆ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్తే అప్పుడు విపక్షాల వైపు ప్రజలు చూసే అవకాశం ఉంటుంది. తెలంగాణ మనసుతో తెలంగాణ ప్రజల కోణంలో, తెలంగాణ తత్వంతో తెలంగాణ భూమి పుత్రులుగా కార్యక్రమాలు రూపొందించుకోవాలి. టీఆర్‌ఎస్ కంటే మరింత అభివృద్ధి చేయగలుగుతామనే నమ్మకం, విశ్వాసం ప్రజల్లో కల్పించాలి. ఆలోచించి పథకాలు, అభివృద్ధి ఎజెండాను విపక్షాలు తయారుచేసుకోవలసిన అవసరం ఉన్నది. అంతే కానీ వ్యక్తిగత దూషణలతో, కుటుంబంపై ఆరోపణలతో విపక్షాలు విజయం సాధించలేరు.

మీరు చేయాలనుకున్న అభివృద్ధి ఎజెండాను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. సానుకూల ఆలోచనలతో ప్రజలు, ప్రభుత్వం.. కలిసివెళ్తున్న సందర్భంలో నెగెటివ్ ఆలోచనలు, అంశాలను ప్రజలమీదికి వదలాలని చేసే ప్రయత్నాలు చరిత్రలో ఎప్పుడైనా విఫలమవుతాయి. ప్రజల్లో వచ్చిన ఈ మార్పును గ్రహించలేక విపక్షాలు గిలగిలా కొట్టుకొని ఎన్ని పోరాటాలు చేసినా, ఎన్ని ఉద్యమాలు చేసినా ప్రజలు మా వైపు చూడటం లేదు. ఈవీఎంల ట్యాంపరింగ్ అనే ఆలోచనతో విపక్షాలున్నాయి తప్పా, మేం చేస్తున్న పొరపాట్లు ఏమిటి, ఎక్కడ మేం తప్పటడుగులే వేస్తున్నామనే అంశాన్ని గ్రహించలేకపోతున్నాయి. దొర, గడి, సచివాలయానికి ముఖ్యమంత్రి రాడనే ఆరోపణలను, ఇలాంటి పదాలను విపక్షాలు ఇక మర్చిపోయి, కొత్త ఆలోచనలు ప్రత్యామ్నాయ అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నది. చిన్న అంశం దొరికినా అదొక రాష్ట్ర, ప్రజల సమస్యగా సృష్టించడం, రెండు రోజులు వివిధ రకాల మీడియాలో చర్చలు చేయడం వల్ల తాత్కాలిక ఉపశమనం, మానసిక తృప్తి తప్ప మరొకటి ఉండదు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఫలితంతోనైనా రాష్ట్రంలో ఉన్న విపక్ష పార్టీలు పూర్తిగా తమ దృక్పథాన్ని మార్చుకోవాలి. తెలంగాణ కోణంలో ప్రజలు సానుకూల దృక్పథంతో ఉన్న నేపథ్యంలో అలాంటి ఆలోచనలతో ప్రజలకు కావలసిన అంశాలపై దృష్టిపెట్టాలి. ఆ సమస్యలకు తాము ఎలాంటి పరిష్కారం చూపుతారో చెప్పి, ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం విపక్షాలకు ఉన్నది. తెలంగాణ అంటే ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థ ఉద్యోగులు మాత్రమే కాదనే విషయం తెలుసుకోవాలి. నాలుగున్నర కోట్ల ప్రజల అభివృద్ధి ఎజెండాను విపక్షాలు తయారుచేసుకోవాలి. ప్రజలు సానుకూల దృక్పథంతో ఉంటే విపక్షాలు నెగెటివ్ ధోరణి ప్రదర్శించడం సమాజ పరిణామంలో, చరిత్రలో ఎక్కడా లేదు.

> హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఫలితంతోనైనా రాష్ట్రంలో ఉన్న విపక్ష పార్టీలు పూర్తిగా తమ దృక్పథాన్ని మార్చుకోవాలి. తెలంగాణ కోణంలో ప్రజలు సానుకూల దృక్పథంతో ఉన్న నేపథ్యంలో అలాంటి ఆలోచనలతో ప్రజలకు కావలసిన అంశాలపై దృష్టిపెట్టాలి. ఆ సమస్యలకు తాము ఎలాంటి పరిష్కారం చూపుతారో చెప్పి, ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం విపక్షాలకు ఉన్నది. తెలంగాణ అంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థ ఉద్యోగులు మాత్రమే కాదనే విషయం తెలుసుకోవాలి.

**(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com



జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సంగాల చెరువులో బోటులో షికారు చేస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్. చిత్రంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

## ట్యాంక్‌బండ్‌గా సంగాల చెరువు

- రెండు నెలల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తాం
- పర్యాటక మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** సంగాల చెరువును హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ మాదిరిగా అభివృద్ధి చేస్తామని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సంగాల చెరువులో నూతనంగా ఏర్పాటు చేసిన బోటింగ్ సదుపాయాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, కలెక్టర్ శశాంకతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో సకల సదుపాయాలతో గద్వాల పట్టణవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. గద్వాల జిల్లాలో బండలాగుడు, సందెరాళ్ల పోటీలను అధికారికంగా నిర్వహిస్తామన్నారు. ప్రతిపక్షాల వంద ప్రశ్నలకు ఒకేఒక్క సమాధానం హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఫలితమన్నారు.





దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో నరకాసుర వధను నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నరకాసురుడి ప్రతిమకు నిప్పంటించారు. కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మేయర్ గుండా ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు. - కరీమాబాద్





సంగారెడ్డిలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి హరీశ్‌రావు

## మున్సిపాలిటీల్లోనూ హుజూర్‌నగర్ ఫలితాలే

- అన్ని పార్టీలు ఏకమైనా టీఆర్‌ఎస్‌నే ఆదరించిన ప్రజలు
- మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**సంగారెడ్డి, నమస్తేతెలంగాణ ప్రధానప్రతినిధి:** అన్ని పార్టీల నాయకులు ఏకమై ప్రభుత్వంపై ఎన్ని అభాండాలు మోపినా, అసత్య ప్రచారాలు చేసినా హుజూర్‌నగర్ ప్రజలు మాత్రం కేసీఆర్ పార్టీకే పట్టంగట్టి ఇతర పార్టీల డిపాజిట్లు గల్లంతు చేశారని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ హుజూర్‌నగర్ ఫలితాలే పునరావృతం అవుతాయని మంత్రి స్పష్టం చేశారు. శుక్రవారం సంగారెడ్డిలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం జిల్లాలోని 56 పంచాయతీలకు మొదటి విడుత కింద ట్రాక్టర్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 12,751 పంచాయతీలకు ట్రాక్టర్లను పంపిణీ చేసి ప్రభుత్వం సరికొత్త రికార్డు సృష్టిస్తుందన్నారు. తెలంగాణ ఇప్పుడు దేశానికి దిక్సూచిగా మారిందని, ఇక్కడ అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచినట్టు చెప్పారు. ప్రభుత్వం నిర్వహించిన 30 రోజుల గ్రామ ప్రణాళిక అమలులో ప్రజలు ఏకమై 70 ఏండ్ల దారిద్ర్యాన్ని పారద్రోలారని, ఇది కలా? నిజమా? అనేలా పల్లెలు మారిపోయాయన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో పత్తి, వడ్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, యాసంగి యాక్షన్ ప్లాన్, పట్టణ ప్రణాళికపై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్, కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు.



సూర్యాపేట బస్టాండులో అందుబాటులో ఉన్న బస్సు సర్వీసులు



కరీంనగర్‌లో ప్రయాణికులకు టిమ్ మెషిన్ ద్వారా టికెట్లు జారీ చేస్తున్న తాత్కాలిక కండక్టర్

# లక్ష్యం దిశగా..

## పెద్ద సంఖ్యలో రోడ్డెక్కిన ఆర్టీసీ బస్సులు

- ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం
- టిమ్స్ ద్వారా టికెట్ల అందజేత
- పండుగకు వెళ్లే వారికి ప్రత్యేక ఏర్పాట్లు

**నమస్తే తెలంగాణనెట్‌వర్క్:** ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో పెద్దసంఖ్యలో బస్సులు రోడ్డెక్కుతున్నాయి. పండుగకు ఊరికి వెళ్లే ప్రజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో ఇబ్బందులు తొలగుతున్నాయి. అన్ని బస్సుల్లో టిమ్స్ ద్వారానే టికెట్లు ఇచ్చేలా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. శుక్రవారం పలు జిల్లాల్లో లక్ష్యం దిశగా బస్సులు వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేశాయి.

✦ కరీంనగర్ రీజియన్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో శుక్రవారం పెద్ద సంఖ్యలో బస్సులు నడిపారు. 674 బస్సులను నడిపించగా, 568 బస్సుల్లో టిమ్స్, 106 బస్సుల్లో టికెట్ల ద్వారా చార్జీలు వసూలు చేశారు. వరంగల్ రీజియన్‌లో 80 శాతం బస్సులు తిరిగాయి. రీజియన్ పరిధిలోని తొమ్మిది డిపోలకు చెందిన 866 బస్సులకు 698 బస్సులు నడిచాయి. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 533 బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఆరు డిపోల పరిధిలోని శుక్రవారం వివిధ రూట్లలో 428 (85 శాతం) బస్సులు నడిచాయి. నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం 275 బస్సులు, కామారెడ్డి జిల్లాలో 200 బస్సులు ప్రయాణికులకు సేవలందించాయి. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోల పరిధిలో 291 బస్సులు తిరిగాయి. వీటితోపాటు 29 ప్రైవేటు బస్సులు, 70 మ్యాక్సీక్యాబ్‌లు నడిచాయి.

✦ భద్రాద్రి కొత్తగూడెం 90 శాతం బస్సులు నడిచాయి. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల నుంచి 223 బస్సు సర్వీసుల ను నడిపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 106 బస్సులు 16 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాయి. నారాయణపేట జిల్లాలో 87 బస్సులు వివిధ రూట్లల్లో తిరిగాయి. నల్లగొండ జిల్లా పరిధిలోని వివిధ డిపోల నుంచి శుక్రవారం 304 బస్సులు నడిచాయి.

✦ సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, కోదాడ డిపోల పరిధిలో 175 బస్సులు ప్రజలకు సేవలందించాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట డిపో పరిధిలో శుక్రవారం 134 బస్సులు వివిధ ప్రాంతాలకు నడిచాయి.



శుక్రవారం ప్రయాణికులతో సందడిగా మారిన జనగామ బస్టాండ్

విద్యుదాఘాతంతో

## విద్యార్థి మృతి



అయాన్‌ఖాన్ (ఫైల్)

**నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందాడు. అసాద్‌బాబా నగర్ (బాబాన్ సహాబ్ పహాడ్)కు చెందిన అయాన్ ఖాన్(11) నగరంలోని కోటగల్లీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం భోజనవిరామ సమయంలో పాఠశాల ప్రాంగణంలో ఆడుకుంటున్నాడు. హైస్కూల్‌కు విద్యుత్ సరఫరా జరిగే వైర్ కిందకు ఉండటంతో అయాన్ ఖాన్ దానిని పట్టుకున్నాడు. వైర్ మధ్యలో తెగి ఉండటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

## వాట్సాప్‌లో సీఎంపై అభ్యంతరకర పోస్ట్

ఆరుగురిపై కేసు

**బెల్లంపల్లి రూరల్:** సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై సోషల్ మీడియాలో అభ్యంతరకర వీడియో క్లిప్పింగ్‌లను పెట్టిన వ్యక్తులపై కేసు నమోదైంది. శుక్రవారం రాత్రి బెల్లంపల్లి ఏసీపీ విక్టరీ బాలుజాదవ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రి కేటీఆర్‌పై అసభ్యకర పోస్టులు పెట్టి, ఇతర గ్రూపుల్లోకి పంపిన బొంతల లక్ష్మీనారాయణ(అంకుశం గ్రామం), జూపాక రాజేశ్ (మాల గురిజాల), యాదండ్ల బాలుయాదవ్(తాళ్లగురిజాల), యాదండ్ల వెంకటేశ్(తాళ్లగురిజాల), బండారి మల్లేశ్(కన్నాలబస్తీ), తోడె వెంకట కృష్ణారెడ్డి(బెల్లంపల్లి)పై కేసు నమోదు చేశారు. టీఆర్‌ఎస్వీ నాయకుడు రియాజ్, బెల్లంపల్లి మండల టీఆర్‌ఎస్ అధ్యక్షుడు సింగం గణేశ్ గౌడ్ ఫిర్యాదుమేరకు వీరిపై కేసు నమోదు చేశామనీ, శనివారం బెల్లంపల్లి కోర్టులో హాజరుపరుచనున్నట్టు ఏసీపీ వివరించారు.



చెన్నయ్య, నాగేంద్ర, మోహన్(ఫైల్)

## పెండ్లికి వెళ్తూ పరలోకాలకు..

- సంగారెడ్డి సమీపంలో క్వాలిస్, లారీ ఢీ
- ముగ్గురి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన క్వాలిస్

**కంది/కార్వాన్:** స్నేహితుడి వివాహం కోసం వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన సంగారెడ్డి సమీపంలోని ఫసల్‌వాది శివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్‌కు చెందిన కాషపోగుల చెన్నయ్య అలియాస్ చెన్నకేశవ(23), నాగేంద్ర(25), బంగారు మోహన్(25), కుంచం నవీన్, నీలంశెట్టి రమేశ్, శేఖ్ మస్తాన్, తిరుపతి అలియాస్ తివారి తమ స్నేహితుడి వివాహం కోసం గురువారం ఉదయం బోధన్‌కు క్వాలిస్‌లో బయలుదేరారు. సంగారెడ్డి జిల్లాకేంద్రం దాటిన తర్వాత ఫసల్‌వాది చౌరస్తా సమీపంలోకి రాగానే వీరి వాహనం ఎదురుగా వస్తున్న లారీని వేగంగా ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న ఏడుగురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స చేస్తుండగా చెన్నయ్య మృతి చెందగా.. నాగేంద్ర, మోహన్ మెరుగైన చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందారు. మిగిలిన ఐదుగురు గాంధీ దవాఖానలో చికిత్సపొందుతున్నారు.

# కృష్ణమ్మకు వరదపోటు

- ఎగువ ప్రాజెక్టుల నుంచి కొనసాగుతున్న భారీ ఇన్‌ఫ్లో
- వచ్చిన వరద వచ్చినట్టే దిగువకు విడుదల
- జూరాల 24గేట్లు.. శ్రీశైలం 10.. సాగర్‌లో 16 గేట్ల ఎత్తివేత



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న జలాలు



జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

**హైదరాబాద్, నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ/అయిజ, నందికొండ, మెండోరా, కాళేశ్వరం, మహదేవపూర్:** కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. ఎగువన ఆల్మట్టి నుంచి ప్రకాశం బరాజ్ వరకు ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా ఉండటంతో వచ్చిన నీళ్లు వచ్చినట్టే దిగువకు పరుగులు తీస్తున్నాయి. శుక్రవారం ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.4 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. అధికారులు 1.22 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేశారు. సాయంత్రం 7 గంటల సమయంలో నారాయణపుర జలాశయానికి 94వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండ గా.. 95 వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి వదులుతున్నారు. ప్రస్తుతం నారాయణపురలో 31.55 టీఎంసీల నీటి నిల్వ ఉన్నదని అధికారులు తెలిపారు. శుక్రవారం జూరాల జలాశయానికి 2.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవ్వగా 22 గేట్లు ఎత్తి 2.44 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఉదయంతో పోలి స్తే సాయంత్రానికి జూరాలకు వరద తగ్గింది. తుంగభద్ర నుంచి 50 వేల పైచిలుకు క్యూసెక్కుల వరద వస్తుండటంతో శ్రీశైలం జలాశయానికి భారీ ఇన్‌ఫ్లో నమోదవుతుంది. శుక్రవారం ఉదయం ఆరు లక్షల క్యూసెక్కుల పైచిలుకుగా ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రానికి 3.11 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు నుంచి 4.73 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నది. నాగార్జునసాగర్ జలాశయానికి ఇన్‌ఫ్లో 6.34 లక్షల క్యూసెక్కుల వరకు వస్తున్నది. 16 క్రస్టు గేట్ల ద్వారా వచ్చిన నీరు వచ్చినట్టు దిగువకు వెళ్తున్నది. పులిచింతల మీదుగా దాదాపు ఐదు లక్షల క్యూసెక్కుల జలాలు ప్రకాశం బరాజ్.. ఆపై సముద్రంలోకి వెళుతుండటంతో దిగువన అనేక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. సూర్యాపేట జిల్లా కేతేపల్లి పరిధిలోని మూసీ ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా 1,840 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. శుక్రవారం ఉదయం వరకు 650 టీఎంసీల కృష్ణాజలాలు సముద్రంలో కలిశాయి.

**ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద**

గోదావరి నదిలో వరద కొనసాగుతున్నది. శ్రీరాంసాగర్ జలాశయానికి శుక్రవారం ఉదయం 50 వేల క్యూసెక్కుల పైచిలుకు ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రం ఆరు గంటల సమయానికి 28 వేల క్యూసెక్కులకు తగ్గింది. కాగా 58 వేల క్యూసెక్కులకుపైగా దిగువకు వెళ్తున్నది. లోయర్ మానేరుకు 6,853 క్యూసెక్కుల వరద వస్తున్నది. కడెం జలాశయానికి 5,033 క్యూసెక్కుల వరద వస్తుండటంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నది. ప్రాణహిత నది నుంచి వరద ఉధృతి పెరగడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఏకంగా 1.84 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. 20 గేట్ల ద్వారా అంతేస్థాయి వరదను దిగువకు వదులుతున్నారు. దీంతో అధికారులు వరదగేటును ఎత్తి 8,689 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని జయశంకర్ భూపాలపల్లిలోని సరస్వతీ(అన్నారం) బరాజ్‌కు 17,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా శుక్రవారం 20 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం 9.47 టీఎంసీల నీరు ఉందని అధికారులు తెలిపారు. అంబట్‌పల్లి పరిధిలోని లక్ష్మి (మేడిగడ్డ)బరాజ్‌కు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అధికారులు 12 గేట్లను ఎత్తి అంతేమేర నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బరాజ్‌లో 4.726 టీఎంసీల నీటి నిల్వ ఉన్నదని తెలిపారు.

## గోదావరిలో చిక్కుకున్న మత్స్యకారులు

తెప్ప సహాయంతో బయటికి..



ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులు

**ఇబ్రహీంపట్నం:** చేపల వేటకు వెళ్లి గోదావరిలో చిక్కుకున్న మత్స్యకారులు చివరకు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. జగిత్యాలజిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఫకీర్‌కొండాపూర్‌కు చెందిన వాల్గొట్ పెద్దరాజం, గంగరాజం గ్రామ శివారులోని గోదావరి నదిలోకి గురువారం రాత్రి చేపలు పట్టేందుకు వెళ్లారు. గోదావరి అవతలి వైపునకు వెళ్లి శుక్రవారం ఉదయం తిరిగి వస్తుండగా వరద ఉధృతి పెరిగింది. కుర్రులో చిక్కుకున్న వారు ఫోన్ ద్వారా గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వారు అధికారులకు సమాచారం ఇవ్వగా రెవెన్యూ అధికారులు, సబ్ కలెక్టర్ గౌతం పోత్రూ అక్కడకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గోదావరి ఉధృతి తగ్గేవరకు నదిలోని కుర్రు ప్రాంతంలోనే తలదాచుకున్నారు. సాయంత్రం సమయంతో వరద ఉధృతి తగ్గడంతో గజ ఈతగాళ్ల సాయంతో మత్స్యకారులను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు.

# రెండు జిల్లాల్లో భారీ వర్షం

- వరంగల్ అర్బన్, జగిత్యాల జిల్లాల్లో భారీగా పంట నష్టం
- ఆందోళనలో రైతన్నలు
- గ్రేటర్ హైదరాబాద్‌లోనూ వాన

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో శుక్రవారం వరంగల్ అర్బన్, జగిత్యాల జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. ఆయా జిల్లాల్లో భారీగా పంట నష్టం జరిగింది. కృష్ణా నది ఉప్పొంగడంతో నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ పంటలు దెబ్బతిన్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. మరో రెండు రోజుల్లో రాష్ట్రంలో ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**వరంగల్ నగరాన్ని మళ్లీ ముంచెత్తిన వాన..**

కుండపోత వర్షం వరంగల్ నగరాన్ని మళ్లీ ముంచెత్తింది. గురువారం సాయంత్రం భారీ వర్షం కురువగా.. గురువారం రాత్రి, శుక్రవారం మధ్యాహ్నం సైతం భారీ వర్షం పడింది. దీంతో ప్రధాన రహదారులతోపాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలో 10.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వర్షాలతో ఖిలావరంగల్‌లో 35 ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. ఖిలావరంగల్ మండలవ్యాప్తంగా 75 ఎకరాల మేర పంట నష్టం వాటిల్లింది. ఖిలావరంగల్ మండలంలోని మామునూరు, అల్లిపురం, బొల్లికుంట గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించనున్నారు. జగిత్యాల జిల్లాలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. జిల్లాకేంద్రంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. జగిత్యాల మండలం నర్సింగాపూర్, వెల్దుర్తి, మోతె గ్రామాల్లో వరి పంట నేలవాలింది. కథలాపూర్ మండలం సిరికొండ, చింతకుంట, భూషణరావుపేట, తక్కళ్లపెల్లి, తాండ్ర్యాలలో మక్కకు తీవ్ర నష్టం జరిగింది. కృష్ణానది ఉప్పొంగడంతో నాగర్‌కర్నూల్ జిల్లా పెంటవెల్లి మండలం మంచాలకట్ట, మల్లేశ్వరం, వేంకల్, జటప్రోల్‌లో పొలాలు నీట మునిగాయి. 60 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.



ఖిలావరంగల్ కోట ప్రాంతంలో నీటమునిగినపంట పొలాలు



జగిత్యాలలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో వెళ్తున్న కారు

**గ్రేటర్ హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం**

**హైదరాబాద్ సిటీబ్యూరో:** గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు చోట్ల శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. శేరిలింగంపల్లి, చందానగర్, హఫీజ్‌పేటలో అత్యధికంగా 1.6 సెంటిమీటర్ల చొప్పున, రాజేంద్రనగర్‌లో 0.4 సెం.మీ., శివరాంపల్లి, మల్కాజిగిరిల్లో 0.3 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

**48 గంటల్లో రాష్ట్రంలో వర్షాలు**

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** వచ్చే రెండ్రోజుల్లో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఉత్తర కోస్తాంధ్ర దానిని ఆనుకొని ఉన్న దక్షిణ ఒడిశా, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనంగా మారింది. దీనికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 2.1 కిలోమీటర్ల ఎత్తు వరకు స్థిరంగా కొనసాగుతున్నది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతోపాటు ఓ మోస్తరు నుంచి భారీ వానలు కురుస్తాయని హైదరా బాద్‌వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాగల 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నట్టు వెల్లడించారు.



జనగామ జిల్లా చిలుపూర్ మండలం వంగాలపల్లి గేట్ వద్ద విడిపోయిన బోగీలు

## రైలింజిన్ నుంచి విడిపోయిన గూడ్స్ బోగీలు

**చిలుపూర్:** రైలింజిన్ నుంచి గూడ్స్ బోగీలు విడిపోయి రైల్వే ట్రాక్‌పై నిలిచిపోయిన ఘటన శుక్రవారం సాయంత్రం జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని వంగాలపల్లి రైల్వే గేట్ వద్ద చోటుచేసుకున్నది. గేటు వద్దే బోగీలు నిలిచిపోవడంతో అరగంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వైపు వెళుతున్న బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైల్ 54వ రైల్వే గేట్ వద్దకు రాగానే కొన్ని బోగీలు విడిపోగా, మరికొన్ని ఇంజిన్‌తో ముందుకు వెళ్లాయి. కొద్దిదూరం వెళ్లిన తర్వాత బోగీలు విడిపోయిన విషయం గమనించిన డ్రైవర్ రైలును నిలిపివేశాడు. రైల్వే సిబ్బంది రైలింజిన్‌ను వెనుకకు రప్పించి బోగీలను పంపించారు.

## జనగామలో ట్రిపుల్ తలాక్ కేసు

ఒకరి రిమాండ్

**జనగామటౌన్:** ట్రిపుల్ తలాక్ చెప్పి భార్యను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు జనగామ సీఐ మల్లేశ్‌యాదవ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎండీ అజామ్ జనగామకు చెందిన ఓ మహిళను 2018లో వివాహం చేసుకున్నాడు. అనంతరం వరకట్నం కోసం భార్యను తరచూ వేధిస్తుండడంతో గతంలో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో అజామ్ తన భార్యకు ట్రిపుల్ తలాక్ చెప్పాడు. దీంతో బాధితురాలు తనకు న్యాయం చేయాలని కోరుతూ జనగామ పోలీసులను ఆశ్రయించింది. కేసు న మోదు చేసి నిందితుడు అజామ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

## పేకాటస్థావరంపై దాడులు

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

**మిర్యాలగూడ రూరల్:** గుట్టుచప్పుడు కాకుండా పంటపొలాల మధ్య నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు దాడి చేసి తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేశారు. శుక్రవారం రూరల్ ఎస్సై డి.సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి పంచాయతీ శివారు పంటపొలాల్లో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో దాడులు చేశామన్నారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మంది జూదరులను పట్టుకుని, వారి నుంచి రూ.33 వేలు, 6 సెల్‌ఫోన్లు, 5 బైకులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

# హజారే విజేత కర్ణాటక



మిథున్ (5/34)

అభిమన్యు మిథున్ హ్యాట్రిక్

ఫైనల్లో తమిళనాడుపై విజయం

నాలుగోసారి టైటిల్ కైవసం

**కర్ణాటక జట్టు మళ్లీ మెరిసింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో విజేతగా నిలిచింది. వర్షం అంతరాయం మధ్య చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తుది పోరులో కన్నడ జట్టు టైటిల్‌ను దక్కించుకుంది. బర్త్‌డే బాయ్ అభిమన్యు మిథున్ హ్యాట్రిక్‌కు తోడు లోకేశ్ రాహుల్, మయాంక్ అగర్వాల్ అర్ధసెంచరీలతో కర్ణాటక విజయాన్నందుకుంది. బ్యాటింగ్‌లో ఓ మోస్తారుగా రాణించిన కార్తీక్‌సేన.. బౌలింగ్‌లో తేలిపోయింది.**

**బెంగళూరు:** విజయ్ హజారే వన్డే టోర్నీ టైటిల్‌ను కర్ణాటక కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కర్ణాటక 60 పరుగుల తేడాతో (వీజేడీ పద్ధతి)లో తమిళనాడుపై విజయం సాధించింది. హజారే టైటిల్‌ను దక్కించుకోవడం కర్ణాటకకు ఇది నాలుగో సారి. గతంలో 2013-14, 2014-15, 2017-18లో టైటిల్ సాధించింది. మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచిన కర్ణాటక.. తమిళనాడును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్ అభినవ్ ముకుంద్ (85), బాబా అపరాజిత్ (66) అర్ధసెంచరీలతో 49.5 ఓవర్లలో 252 పరుగులు చేసింది. వీరికి తోడు విజయ్ శంకర్(38), షారుఖ్ ఖాన్ (27) ఫర్వాలేదనిపించారు. అభిమన్యు మిథున్ (5/34) హ్యాట్రిక్‌తో సహా ఐదు వికెట్లు పడగొట్టాడు. వర్షం అంతరాయంతో కుదించిన లక్ష్యాన్ని కర్ణాటక వికెట్ కోల్పోయి విజయాన్నందుకుంది. ఓపెనర్ రాహుల్ (52 నాటౌట్), అగర్వాల్ (69 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. ఏకైక వికెట్ సుందర్(1/51)కు దక్కింది. అభిమన్యు మిథున్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కింది.

**మిథున్ హ్యాట్రిక్:**
తొలుత బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడుకు ఆదిలోనే మురళీ విజయ్(0) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. కీపర్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి విజయ్ పరుగుల ఖాతా తెరువకుండానే నిష్క్రమించాడు. మూడో నంబర్‌లో వచ్చిన అశ్విన్(8) కూడా విజయ్‌ను అనుసరించాడు. ఆ తర్వాత ముకుంద్, అపరాజిత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరు కలిసి కర్ణాటక బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డుకు పరుగులు జతచేశారు. ముఖ్యంగా ముకుంద్ మైదానం నలువైపులా చూడచక్కని బౌండరీలతో ఆకట్టుకున్నాడు. అపరాజిత్‌ను అండగా చేసుకుంటూ స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో 68 బంతుల్లో ముకుంద్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు అపరాజిత్ వీలు చిక్కినప్పుడల్లాబంతులను బౌండరీలకు తరలిస్తూ స్కోరును పెంచే ప్రయత్నం చేశాడు. ఇన్నింగ్స్ జోరు అందుకుంటున్న తరుణంలో ముకుంద్ ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 124 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ దినేశ్ కార్తీక్(11), సుందర్(2)నిరాశపరుచగా, శంకర్(38), షారుఖ్ ఖాన్(27) అంతోఇంతో ఆకట్టుకున్నారు. ఇన్నింగ్స్ చివరి ఓవర్ బౌలింగ్‌కు దిగిన మిథున్..ఆఖరి మూడు బంతుల్లో వరుసగా షారుఖ్ ఖాన్, మహమ్మద్(10), మురుగన్ అశ్విన్(0)ను పెవిలియన్ పంపి హ్యాట్రిక్ ఫీట్ నమోదు చేశాడు. తన ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో మిథున్‌కు ఇది తొలి ఐదు వికెట్ల ప్రదర్శన కాగా, కెరీర్‌లో ఇది తొలి హ్యాట్రిక్.

**రాహుల్, అగర్వాల్ అదుర్స్:**
లక్ష్యఛేదన కోసం బరిలోకి దిగిన కర్ణాటకకు మెరుగైన ఆరంభం దక్కింది. ఓపెనర్ దేవదూత్ పడిక్కల్(11) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా..రాహుల్, అగర్వాల్ అజేయ అర్ధసెంచరీలతో కదంతొక్కారు. తమదైన ఫామ్‌ను కొనసాగిస్తూ బౌండరీలతో ఆకట్టుకున్నారు. వీరిద్దరు కలిసి రెండో వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును గెలుపు తీరాలకు చేర్చారు.

**సంక్షిప్త స్కోర్లు:** తమిళనాడు: 49.5 ఓవర్లలో 252 ఆలౌట్(ముకుంద్ 85, అపరాజిత్ 66, మిథున్ 5/34, కౌశిక్ 2/39), కర్ణాటక: 23 ఓవర్లలో 146/1(రాహుల్ 52 నాటౌట్, అగర్వాల్ 69 నాటౌట్, సుందర్ 1/51)

## ఫుట్‌సల్ ప్రపంచకప్ టోర్నీకి రాష్ట్ర ప్లేయర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** స్పెయిన్ వేదికగా ఈనెల 28 నుంచి మొదలయ్యే ఏఎమ్ఎఫ్ ఫుట్‌సల్ ప్రపంచకప్ టోర్నీకి ఎంపిక చేసిన జాతీయ జట్టులో ఎనిమిది మంది తెలంగాణ ప్లేయర్లు చోటు దక్కించుకున్నారు. ఇటీవల హైదరాబాద్ వేదికగా జరిగిన ట్రయల్స్‌లో మెరుగైన ప్రతిభ కనబరిచిన వేర్వేరు రాష్ర్టాలకు చెందిన ఆటగాళ్లను భారత ఫుట్‌సల్ సమాఖ్య(ఎఫ్ఏఐ) ఎంపిక చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 11 మందిని ఎంపిక చేస్తే ఎనిమిది మంది తెలంగాణ వారే కావడం విశేషం. ఇందులో ప్రీతమ్ జోషి, ధన్వీ తేజాస్, ఆకాశ్ ప్రధాన్, శ్లోక్ అశోధా, హర్ష్ ప్రకాశ్‌సింగ్, కెవిన్ మార్క్(కెప్టెన్), జాసన్ పావెల్, ఆర్యన్ ఉన్నారు. వీరికి రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రావు శుభాకాంక్షలు తెలిపారు.



## బుమ్రా, మంధనకు విజ్డెన్ అవార్డు





**బెంగళూరు :** ప్రతిష్ఠాత్మక విజ్డెన్ ఇండియా అల్మానక్ 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, మహిళా జట్టు స్టార్ ప్లేయర్ స్మృతి మంధన దక్కించుకున్నారు. మొత్తం ఐదుగురికి ఈ అవార్డులను శుక్రవారం ప్రకటించారు. ఆఫ్ఘనిస్థాన్ స్టార్ రషీద్ ఖాన్, శ్రీలంక బ్యాట్స్‌మన్ దిముత్ కరుణరత్నె, పాకిస్థాన్ ఆటగాడు ఫఖర్ జమాన్ ఈ అవార్డులకు ఎంపికయ్యారు. కాగా, మిథాలీ రాజ్, దీప్తి శర్మ తర్వాత ఈ పురస్కారాన్ని దక్కించుకున్న భారత మూడో మహిళా క్రికెటర్‌గా స్మృతి నిలిచింది. జాతీయ జట్టు, దేశవాళీల్లో పరుగుల వరద పారిస్తున్న మయాంక్ అగర్వాల్‌కు కూడా తన ఏడో వార్షిక ప్రచురణ 2019-20లో విజ్డెన్ చోటు కల్పించింది. అలాగే విజ్డెన్ ఇండియా హాల్ ఆఫ్ ఫేమ్‌లో క్రికెట్ దిగ్గజాలు లాలా అమర్‌నాథ్, గుండప్ప విశ్వనాథ్‌ను చేర్చింది. ప్రశాంత్ కిడాంబి రాసిన 'క్రికెట్ కంట్రీ : ది అన్‌టోల్డ్ హిస్టరీ ఆఫ్ ది ఫస్ట్ ఆల్‌ఇండియా' టీమ్ పుస్తకం విజ్డెన్ బుక్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని గెలుచుకుంది.



## పోరాడి ఓడిన సింధు

### సెమీస్ చేరిన రాంకీరెడ్డి జోడీ

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్ ఫైనల్స్‌లో భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్ పోరాటం ముగిసింది. టాప్ సీడ్ తై జూయింగ్‌తో జరిగిన పోరులో 75 నిమిషాల పాటు అద్భుతంగా పోరాడిన సింధు.. చివరికి ఓటమి చెందాల్సి వచ్చింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఐదో సీడ్ సింధు 16-21, 26-24, 17-21 తేడాతో టాప్ సీడ్ తై జూ యింగ్(చైనీస్ తైపీ) చేతిలో చివరి వరకు పోరాడి పరాజయం పాలైంది. తొలి గేమ్‌లో యింగ్‌ను నిలువరించలేకపోయిన సింధు.. రెండోగేమ్‌లో సర్వశక్తులు ఒడ్డి అద్భుతంగా ఆడింది. గేమ్ మొత్తం ఉత్కంఠ మధ్య సుదీర్ఘంగా సాగగా.. ఇద్దరు ప్లేయర్లు నువ్వా-నేనా అన్నట్టు బలమైన షాట్లతో విరుచుకుపడ్డారు. చెరో పాయింట్ సాధిస్తూ ముందుకు సాగడంతో ఓ దశలో గేమ్ 24-24కు చేరింది. చివరికి బలమైన స్మాష్‌లతో అదరగొట్టిన సింధు 26-24తో గేమ్‌గెలిచి టాప్‌సీడ్‌కు దడ పుట్టించింది. అయితే, నిర్ణయాత్మక గేమ్‌లో చైనీస్‌తైపీ ప్లేయర్ శక్తినంతా కూడగట్టుకొని దూకుడుగా ఆడింది. సింధు దీటుగా ప్రతిఘటించినా.. గేమ్‌ను కాపాడుకోలేకపోయింది. మరో క్వార్టర్స్‌లో స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ 20-22, 21-23 తేడాతో అన్ సే యంగ్(కొరియా) చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో భారత షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి - చిరాగ్‌శెట్టి సెమీఫైనల్ చేరారు. క్వార్టర్స్‌లో భారత జోడీ 21-13, 22-20తేడాతో డెన్మార్క్ జోడీ కిమ్ అస్ట్రప్ - అండెర్స్ స్కారప్‌పై విజయం సాధించింది.



## అరంగేట్రంలో ఘోర పరాజయం

ఏటీకే చేతిలో 0-5తో హైదరాబాద్ ఓటమి

**కోల్‌కతా:** ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్) అరంగేట్రం మ్యాచ్‌లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ) జట్టు భారీ పరాజయాన్ని మూటగట్టుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 0-5 తేడాతో అట్లెటికో డీ కోల్‌కతా(ఏటీకే)పై ఓడిపోయింది. డేవిడ్ విలియమ్స్ (25, 44వ నిమిషాలు), రాయ్ కృష్ణ (27వ ని.) గోల్స్‌తో అదరగొట్టడంతో తొలి అర్ధభాగంలోనే 3-0తో ఆధిక్యంలో నిలిచిన ఏటీకే జట్టు... మ్యాచ్ ముగిసేందుకు రెండు నిమిషాల ముందు, ఎక్స్‌ట్రా టైమ్‌లో గ్రేసియా డబుల్ గోల్స్ సాధించడంతో సొంత మైదానంలో భారీ విజయం సాధించింది. ఏటీకే దూకుడుకు హెచ్ఎఫ్‌సీ ఏ దశలోనూ కళ్లెం వేయలేకపోయింది. డిఫెన్స్‌లో పూర్తిగా విఫలం కాగా, వచ్చిన ఆరు పెనాల్టీ కార్నర్ అవకాశాలను చేజార్చుకుంది. మ్యాచ్ 19వ నిమిషంలోనే ఏటీకే ఆటగాడు మైఖేల్ సుసాయిరాజ్ మంచి షాట్ కొట్టగా.. కొద్దిలో గోల్ మిస్సయింది. 25వ నిమిషంలో హెర్నాండెజ్ అద్భుతంగా బంతిని పాస్ చేయడంతో హైదరాబాద్ గోల్ కీపర్‌ను బోల్తా కొట్టించిన విలియమ్స్.. ఏటీకే ఖాతా తెరిచాడు. మరో రెండు నిమిషాల్లోనే రాయ్ కృష్ణ కూడా గోల్ చేయడంతో హైదరాబాద్ ఒత్తిడిలో పడింది.

ప్రారంభ దశలోనే బ్రెస్ట్ క్యాన్సర్‌ను గుర్తించడం క్యాన్సర్ చికిత్సకు కీలకం...

బ్రెస్ట్ క్యాన్సర్‌కు గల కారణాలు...
- వృద్ధాప్యం
- కుటుంబంలో బ్రెస్ట్ క్యాన్సర్ చరిత్ర
- గర్భనిరోధక మాత్రలు తీసుకోవడం
- అతిగా మద్యం తీసుకోవడం • అధిక బరువు
- ఛాతి నందు ఇంతకు ముందు కలిగి ఉన్న రేడియేషన్ ఎక్స్‌పోజర్ • దట్టమైన బ్రెస్ట్ కణజాలం
- తక్కువ శారీరక శ్రమ కలిగి ఉండడం

బ్రెస్ట్ క్యాన్సర్ యొక్క సాధారణ లక్షణాలు
- ఛాతిలో ఒకటి లేదా రెండు బ్రెస్ట్‌లలో గడ్డలు
- బ్రెస్ట్‌లో గడ్డ లేకపోయినా వాపు కలిగి ఉండడం
- బ్రెస్ట్‌పై గుంట ఏర్పడటం, దురద కలగడం
- బ్రెస్ట్ లేదా చనుమొనలల్లో నొప్పి
- చనుమొన నొక్కుకు పోవడం (లోపలి వైపుకు)
- చనుమొన లేదా బ్రెస్ట్ చర్మం ఎర్రగా మారడం, సున్నితంగా మారడం లేదా గట్టిపడటం
- చనుమొన నుండి స్రవాలు కారడం

బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ
బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్నప్పటికీ డయాగ్నస్టిక్ ఇమేజింగ్ పద్ధతిని ఉపయోగించి రోగ నిర్ధారణను చేయడం ఎల్లప్పుడూ మంచిది.
బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణలో కింది ఇమేజింగ్ పరీక్షలు ఉపయోగిస్తారు:
- డిజిటల్ లేదా డయాగ్నోస్టిక్ మామోగ్రామ్స్
- బ్రెస్ట్ యొక్క ఎమ్.ఆర్.ఐ స్కాన్లు
- బ్రెస్ట్ అల్ట్రాసౌండ్

బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్స పద్ధతులు
శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, హార్మోన్ థెరపీ లేదా క్యాన్సర్ ఏ దశలో ఉంటుందో ఆ దశ పై చికిత్స ఆధారపడి ఉంటుంది.

అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్‌లో ప్రెసిషన్ కాన్సర్ కేర్
ఇటీవల క్యాన్సర్ నిర్ధారణ మరియు చికిత్స విధానాలు గణనీయంగా పురోగమించాయి. ఎంతోమంది పేషెంట్స్ ఈ చికిత్సా విధానాల వల్ల క్యాన్సర్ పై విజయం సాధించారు మరియు ఎంతో మంది క్యాన్సర్ పేషెంట్స్ ఈ ఆధునిక చికిత్సా విధానాల వల్ల క్యాన్సర్ ను సమర్థవంతంగా ఎదుర్కోగలిగారు.

అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్ వివిధ క్యాన్సర్ విభాగాల ఉన్నత స్థాయి వైద్య బృందం, వైద్యపరమైన సామర్థ్యం, ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ చికిత్సా విధానాలతో సమగ్రమైన క్యాన్సర్ చికిత్సను అందిస్తుంది. ప్రతి ఒక్కరికి అన్ని రకాల క్యాన్సర్‌లకు ఖచ్చితమైన చికిత్సను అందివండంలో అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్ అగ్రస్థానంలో ఉంది.

దక్షిణాసియాలో ప్రతివారం ఇంటర్నేషనల్ ట్యూమర్ బోర్డు నిర్వహించే అంతర్జాతీయ క్యాన్సర్ ఆసుపత్రులలో AOI ఒకటి. ఇందులో అంతర్జాతీయ భాగస్వామి, UPMC ఆంకాలజీ బృందం నుండి వైద్యులు రోగ నిర్ధారణలో, ప్రత్యేకమైన కేసులకు చికిత్స ప్రణాళిక నిర్ధారించడం, ఫలితాలను మరియు పురోగతిని సమీక్షించి కచ్చితమైన క్యాన్సర్ సంరక్షణకు భరోసా కల్పిస్తారు. ఆంకాలజీ చికిత్సలో అత్యంత అధికారిక మరియు సమాచార సిఫారసులను అందించడంలో UPMC ప్రసిద్ధి చెందింది. ఇందులో భారతదేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ వైద్యులు పిట్స్బర్గ్ విశ్వవిద్యాలయం నుండి క్యాన్సర్ నిపుణుల బృందంతో కలిసి పనిచేస్తారు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో క్యాన్సర్ సంరక్షణకు బాటలు వేసిన వారిలో యూనివర్సిటీ ఆఫ్ పిట్స్బర్గ్ మెడికల్ కాలేజ్ (UPMC) ఒకటి.



Dr. Sudha Sinha
MD, Diplomate Internal Medicine, Diplomate in Medical Oncology & Hematology, American Board of Internal Medicine
Sr. Consultant Medical Oncologist

అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్ వారి వినూత్నమైన "సెకండ్ ఒపీనియన్ క్లినిక్" లో సంప్రదించండి, క్యాన్సర్ నిర్ధారణ మరియు చికిత్సలో ఖచ్చితమైన విధానాన్ని తెలుసుకోండి

Nallagandla, Hyderabad.
Phone: 040 - 6719 9999 | Toll Free No.: 18002082000
www.americanoncology.com
For appointment, call: 95156 68363

AMERICAN ONCOLOGY INSTITUTE
PRECISION CANCER CARE

హైదరాబాద్ | నాగపూర్ | విజయవాడ | గుంటూరు | లూథియానా | జలంధర్ | భువనేశ్వర్ | హిసార్ | శ్రీలంక

# వాణిజ్య

## ధన్‌తేరాస్ అంతంతే..

**న్యూఢిల్లీ/ముంబై, అక్టోబర్ 25:** ధంతేరస్ రోజు కూడా అతి విలువైన లోహాలను కొనుగోలు చేయడానికి జనం వెనుకంజవేశారు. గరిష్ఠ స్థాయికి చేరుకున్న ధరలు, వినియోగదారులు ఖర్చులను తగ్గించుకోవడం అధిక ప్రాధాన్యతనివ్వడంతో శుక్రవారం దేశవ్యాప్తంగ పసిడి, వెండి అమ్మకాలు 40 శాతం పడిపోయాయి. సీఏఐటీ అంచనాప్రకారం శుక్రవారం సాయంత్రం వరకు దేశవ్యాప్తంగా రూ.2,500 కోట్ల విలువైన 6 వేల టన్నుల బంగారం అమ్ముడైనట్లు తెలిపింది.

# ఎస్బీఐ అదుర్స్

- క్యూ2లో రూ.3,375 కోట్ల లాభం
- దన్నుగా నిలిచిన బీమా రంగ వాటా

**న్యూఢిల్లీ, అక్టోబర్ 25:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఆర్థిక ఫలితాలు అదరహో అనిపించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను బ్యాంక్ 3,375.40 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. 2018-19 ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ. 576.46 కోట్ల లాభంతో పోలిస్తే ఆరింతలు ఎగబాకింది. బ్యాంక్ ఆస్తుల నాణ్య తా ప్రమాణాలు పెరుగడంతోపాటు అనుబంధ బీమా రంగ సంస్థలో వాటాను విక్రయించడం ద్వారా వచ్చిన ఆదాయం లాభాలు భారీగా పుంజుకోవడానికి దోహదపడ్డాయి. సమీక్షకాలంలో బ్యాంక్ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ. 79,302.72 కోట్ల నుంచి రూ.89,437.91 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 4.5 శాతం వాటాను విక్రయించడంతో బ్యాంక్‌కు రూ.3,500 కోట్ల నిధులు సమకూరం కలిసొచ్చింది. దీంతో సంస్థలో బ్యాంక్ వాటా 62.10% నుంచి 57.60 శాతానికి తగ్గింది. ఏకీకృత విషయానికి వస్తే రూ. 72,850.78 కోట్ల ఆదాయంపై రూ. 3,011.73 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసుకున్నది. లాభంలో మూడింతలు ఎగబాకింది.

### ఆర్థిక ఫలితాల్లో ముఖ్య అంశాలు

- నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 17 శాతం పెరిగి రూ.24,600 కోట్లకు చేరుకున్నది. గతేడాది ఇది రూ.23,075 కోట్లుగా ఉన్నది.
- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ రూ.22.48 లక్షల కోట్ల రుణాల్లో 7.19 శాతానికి తగ్గాయి. అంతక్రితం ఇది 9.95 శాతం. వీటి విలువ రూ.2.05 లక్షల కోట్ల నుంచి రూ.1.61 లక్షల కోట్లకు పడిపోయాయి.
- నికర ఎన్‌పీఏ కూడా 4.84 శాతం నుంచి 2.79 శాతానికి తగ్గాయి.
- తాజాగా రూ.8 వేల కోట్లు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి.
- క్రితం ఏడాది రూ.10,184 కోట్లుగా ఉన్న బ్యాంక్ మొండి బకాయిలు గత త్రైమాసికానికిగాను రూ.11,040 కోట్లకు పెరిగాయి.
- ప్రొవిజనింగ్ కవరేజ్ రేషియో 81.23 శాతంగా ఉన్నది.
- నికర వడ్డీ మార్జిన్ 2.78 శాతం నుంచి 3.22 శాతానికి చేరుకున్నది.
- విద్యుత్ రంగానికి ఇచ్చిన 2,600 కోట్లు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి.
- డీహెచ్ఎఫ్ఎల్‌కు ఇచ్చిన ఏడు వేల కోట్ల రూపాయల రుణాన్ని మొండి బకాయిగా గుర్తించింది బ్యాంక్.
- ఎన్‌బీఎఫ్‌సీ రంగ సంస్థలకు ఇచ్చిన రుణాలు తిరిగి వసూలుకాకపోవడంతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొవాల్సి వస్తున్నదని తెలిపింది.
- రూ.16,822 కోట్ల విలువైన రుణాలు వసూలు కావడం లేదన్న బ్యాంక్...ఇవి వచ్చే రెండు త్రైమాసికాల్లో ఎన్‌పీఏలుగా గుర్తించనున్నట్లు ప్రకటించింది.
- 30-89 రోజుల్లో ఎలాంటి చెల్లింపులు జరుపని రుణాలను మొండి బకాయిలుగా గుర్తించే రుణాలు రూ.10,289 కోట్ల నుంచి రూ.9,312 కోట్లకు తగ్గాయి.
- గత త్రైమాసికంలో బ్యాంక్ రూ.12 వేల కోట్ల రుణాలను కొట్టివేసింది. క్యూ1లో కొట్టివేసిన రూ.16 వేల కోట్లతో పోలిస్తే తగ్గగా, 2018-19లో రూ.58 వేల కోట్లు.
- గత మూడు నెలల్లో టెలికం రంగానికి బ్యాంక్ రూ.35 వేల కోట్ల రుణాలను మంజూరు చేసింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఈ రుణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి.



**దేశ** ఆర్థిక మందకొడి పరిస్థితులు, మూలధన పెట్టుబడులు తగ్గించుకోవడానికి పలు కార్పొరేట్లు చూసిన గత త్రైమాసికంలో రిటైల్ అడ్వాన్స్‌లపై ప్రత్యేక దృష్టి సారించడం లాభాల్లో భారీ వృద్ధికి దోహదపడింది. రుణ మాఫీలతో రూ.16 వేల కోట్ల బకాయిలపై ప్రభావం చూపినప్పటికీ మొత్తం మొండి బకాయిల వాటా రెండు శాతం లోపేలే. డీహెచ్ఎఫ్ఎల్‌కు ఇచ్చిన రూ.7 వేల కోట్ల రుణం ప్రస్తుత త్రైమాసికంలో మొండి బకాయిల జాబితాలోకి చేరనున్నది.

**-రజనీష్ కుమార్, ఎస్బీఐ చైర్మన్**

### దూసుకుపోయిన షేరు

అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో ఎస్బీఐ షేరు ధర భారీగా పుంజుకున్నది. ఇంట్రాడేలో 8 శాతానికి పైగా లాభపడిన బీఎస్ఈలో బ్యాంక్ షేరు ధర చివరకు 7.19 శాతం లాభంతో రూ.281.60 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 7.56 శాతం అధికమై రూ. 282.35 వద్ద స్థిరపడింది. దీంతో మార్కెట్ విలువ రూ. 16,868.06 కోట్లు పెరిగి రూ. 2,51,317.06 కోట్లకు చేరుకున్నది. బీఎస్ఈలో 55.52 లక్షల షేర్లు ట్రేడింగ్ జరుగగా, ఎన్ఎస్ఈలో 10 కోట్ల షేర్లు చేతులు మారాయి.

## బిగ్ 'సి' రెండో లక్కీ డ్రా విజేతలు

**హైదరాబాద్, అక్టోబర్ 25:** ప్రముఖ మొబైల్ విక్రయ సంస్థ బిగ్'సి'..ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన దసరావళి డబుల్ ధమాకా ఆఫర్ రెండో వారం విజేతలను ఇక్కడ ప్రకటించింది. ఈవారానికిగాను కారు గెలుచుకున్నవారిలో మహమ్మద్ అథార్ అలీ(కూ.నం: 16873), టీ కోటేశ్వర్ రావు(కూ.నం:38271), వెంకట రమణ (కూ.నం: 29892), ప్రేమ్ కుమార్(కూ.నం:57623), పీ శ్రీను (కూ.నం:116872), నవీన్ (కూ. నం:18005), డీ గణేష్ (కూ. నం: 113972), పీ బాలస్వామి రెడ్డి(కూ. నం: 64730), మహ్మద్ లతీఫ్ (కూ.నం:110486), కే శ్రీనివాస్‌రావు (కూ. నం: 112291)లు ఉన్నారు. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ బాలు చౌదరి మాట్లాడుతూ..దసరా, దీపావళిని దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన డబుల్ ధమాకా ఆఫర్‌కు కొనుగోలు దారుల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని, ఈ ఆఫర్‌లో ప్రతి పదిరోజులకొకసారి లక్కీ డ్రా తీస్తున్నట్లు చెప్పారు. కంపెనీ రిటైల్ అవుట్‌లెట్ వద్ద కొనుగోలు చేసినవారు 30 మారుతి ఆల్టో, 30 బజాజ్ ప్లాటినా బైకులను గెలుచుకునే అవకాశాన్ని కంపెనీ కల్పించింది.




Diwali DHAMAKA DAYS
25TH - 29TH OCT
CELEKT®
Best · Next · Latest
20% OFF paytm CASHBACK
Upto 10% CASH BACK HDFC BANK
₹1 Down Payment Through DC EMI
5% CASH BACK BAJAJ FINSERV
iPhone 6S 32GB
32" BIG LED TV
ఫోన్ & 32" LED TV ₹29999
4G 3GB+32GB
32" BIG LED TV
ఫోన్ & 32" LED TV ₹10999
Full View Display
4G BIG LED TV
ఫోన్ & BIG LED TV ₹9999
Exchange 2G Phone with a 4G Phone
5.45" Screen
Finger Touch Sensor
Dual Rear Cam
50% OFF ₹3999
OPPO A9 2020
ONE TIME SCREEN REPLACEMENT
Casserole Set ₹2499 FREE
NOKIA 4.2
Power Bank 10000mAh FREE
vivo V15 Pro (6+128 GB)
Belly Cookware ₹2499 FREE
SAMSUNG Galaxy A10s | A30s | A50s | A70s
10% EXTRA CASHBACK SBI Card
OR
0 DOWN PAYMENT
realme C2 | 5 | 5 Pro | XT
BEST PRICE
ఆన్‌లైన్ కన్న తక్కువ ధరల్లో
mi Xiaomi
10% CASH BACK HDFC BANK
One Time Screen Replacement
All Models Available
INDIA'S No.1 Smart TV Brand
10% CASH BACK HDFC BANK
1 Year Extended Warranty
32" 40" 43" 49" 55" TV's Available
OPPO
RENO 2F (8GB+128GB) ₹25,990
RENO 2Z (8GB+256GB) ₹29,990
RENO 2 (8GB+256GB) ₹36,990
24" Trolley FREE ₹4000
COMPLETE DAMAGE PROTECTION
ONE TIME SCREEN REPLACEMENT
HDFC BANK 10% CASH BACK
RBL BANK 10% CASH BACK
S1 (6GB+128GB) ₹18,990
Y17 (4GB+64GB) ₹13,990
V17Pro (8GB+128GB) ₹27,990
Casserole Set FREE ₹2499
GREAT DIWALI FESTIVAL 101
Pay ₹101 and get vivo Phone
Cable ₹99
Earphones ₹199
Memory Card ₹299
Speaker ₹499
Bluetooth Headset ₹699
Power Bank ₹999
T&C Apply*
సవరన్ స్ట్రీట్, ఆర్ & బి గెస్ట్ హౌజ్ ఎదురుగా, కరీంనగర్.
కళ్యాణ్ నగర్ చౌరస్తా, గోదావరిఖని . గాంధీచౌక్ దగ్గర, జమ్మికుంట
www.celekt.com @celektindia @celektindia @celektindia
9121007777


LOT
DIWALI OFFERS
ఈ పండుగ సంబరాలలో ఎన్నో ఆఫర్లను, మరెన్నో కానుకలను సొంతం చేస్కోండి.
UPTO 60% OFF ON EXCHANGE*
GET EXTRA EXCHANGE BONUS UPTO ₹5000
FLAT 30% Paytm CASHBACK
UPTO 10% CASHBACK HDFC BANK CREDIT & DEBIT CARDS
1 MONTH EMI FREE
*Conditions Apply
ASSURED FREE GIFTS
UPTO ₹500 CASHBACK PhonePe
ONE TIME SCREEN REPLACEMENT FREE *On Selected Models
BUY 1 GET 2 6 MONTHS SCREEN REPLACEMENT & EXTENDED WARRANTY
₹1 DEBIT CARD EMI
0 DOWN PAYMENT
5% CASH BACK BAJAJ FINSERV
vivo V17Pro
32MP Dual Pop-up Clear as Real
Power Bank + BT Headset
worth of ₹4,999 GIFTS FREE
(8+128 GB) ₹27,990 ₹29,990
10 CASHBACK
Pay ₹101/- Get Cash Back 20%
PRICE DROP OFFERS
vivo S1
S1(4+128GB) ₹16,990 ₹17,990
S1(6+128GB) ₹18,990 ₹19,990
vivo Y SERIES
Y17 (4+128 GB) ₹13,990 ₹14,990
Y12 (3+64 GB) ₹10,990 ₹11,990
Y15 (4+64 GB) ₹12,990 ₹13,990
Y91 (3+32 GB) ₹8,990 ₹9,990
OPPO
A9 2020 | A5 2020
The New Expert
upto 7.5 CASHBACK HDFC BANK
1 MONTH EMI FREE
PRICE DROP OFFERS
F11 Pro (6+128 GB) ₹19,990 ₹21,990
F11 (6+128 GB) ₹16,990 ₹17,990
ONE TIME SCREEN REPLACEMENT FESTIVE SPECIAL OFFER FREE
SAMSUNG
Galaxy A70s | A50s | A30s
10% EXTRA CASHBACK SBI card
Secured by Knox
Buy SAMSUNG Galaxy
A70 (6+128GB)
A50 (6+128GB)
GET SPECIAL OFFER
XOLO ZX
Only ₹11999/-
SMART WATCH FREE
OnePlus 7T Pro
90 Hz Display. Smooth Like Never Before.
NEVER SETTLE
iPhone
11 ProMax ₹7000 CASH BACK
11&11 Pro ₹6000 CASH BACK
iPhone XR ₹5000 CASH BACK
iPhone 7 ₹3000 CASH BACK
realme XT
New Arrival
realme X Pop-up Generation
8 | 128GB ₹19,999
4 | 128GB ₹17,499
INDIA'S No.1 Smart TV Brand
Range Starts From ₹12499 onwards
mi
Now Available
10% CASH BACK HDFC BANK
0 Down Payment BAJAJ FINSERV EMI
1+1 Year EXTENDED WARRANTY
BIG DISCOUNTS UP TO ₹12000
NOTE 7 PRO 6+64GB ₹13749
Redmi 7s 4+64GB ₹9999
Redmi Y3 3+32GB ₹7999 4+64GB ₹10999
Redmi 7A 2+16GB ₹5299 2+32GB ₹5599
10% CASHBACK HDFC BANK
Offer applicable on All Models
SCREEN REPLACEMENT FREE
Jio ₹699
No Exchange Required
LOT
Helpline: 1800 123 3567
www.lotmobiles.com

నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 26 అక్టోబర్ 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi

ఉన్నత లక్ష్యం నిర్దేశించుకోవడమే కాదు.. దాన్ని చేరుకోవాలనే తపన ఉండాలి. నిరంతరం గమ్యాన్ని గుర్తుచేసేంత కసి ఉండాలి. అనుకున్నది సాధించేందుకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. వీటికి తోడు కొంత ఓర్పు కూడా ఉండాలి. ఇవన్నీ ఉన్నపుడే విజయం సొంతమవుతుంది. అందరు నుంచి కొందరుగా మారడం సాధ్యమవుతుంది. గురువారం టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులందరూ ఇలాంటి లక్షణాలు ఉన్నవారే. ప్రభుత్వాధికారి కావాలనే కలను సాకారం చేసుకునేందుకు శ్రమించారు. తాత్కాలిక ఆనందాలను త్యాగం చేశారు. శ్రమను ఆయుధంగా చేసుకొని చివరకు విజయాన్ని సాధించారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న గ్రూప్-2 విజేతల మనోగతంపై జిందగీ కథనం.

# పట్టుబట్టారు.. జాబ్ కొట్టారు



## స్టేట్ నం.1 ర్యాంకు ఊహించలేదు

టాప్ 5లోపు ఒక ర్యాంకు వస్తుందనుకున్నాను. కానీ స్టేట్ నం.1 అంచనా వేయలేదు. నా సంతోషం మాటల్లో చెప్పలేను. ఇప్పటికే వందల మంది ఫోన్లు చేసి శుభాకాంక్షలు చెప్పారు. డిప్యూటీ తాసీల్దార్‌గా ఎంపికవడం గర్వంగా ఉంది. 2012 డీఎస్సీ.. స్కూల్ అసిస్టెంట్ వచ్చింది. ఇబ్రహీంపట్నం మండలం పోచారం జెడ్‌పీహెచ్‌ఎస్‌లో టీచర్‌గా చేస్తున్నా. 2014లో గ్రూప్-2 ప్రిపరేషన్ ప్రారంభించా. ఒకవైపు టీచర్‌గా పాఠాలు చెబుతూనే సమయం కేటాయించుకొని ప్రిపేర్ అయ్యాను. సెలవు రోజుల్లో 15 గంటల పాటు చదివాను. పరీక్షలు పూర్తయ్యే వరకు పండుగలు పక్కకు పెట్టాను. సమయం వృథా అవుతుందని మొబైల్‌ని కూడా దూరంగా ఉంచా. తెలంగాణ ఏర్పడ్డాక తొలి గ్రూప్-2 పరీక్షను మేం ఎదుర్కొన్నాం. పరీక్ష సరళి మారింది. సిలబస్ మారింది. అది మాకు పెద్ద సవాల్. అయినా ప్రణాళికాయుతంగా ముందుకు వెళ్లా. నమస్తే తెలంగాణ పత్రిక నా ప్రిపరేషన్‌లో ఎంతగానో ఉపయోగపడింది. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, కరెంట్ ఎఫైర్స్ గురించి పత్రికలో వచ్చిన సమాచారంతో నోట్స్ తయారు చేసుకున్నా. సిలబస్, పరీక్షా విధానంపై అవగాహన కోసం కేవలం 35 రోజుల కోచింగ్ మాత్రమే తీసుకున్నా. తర్వాత సొంతగా ప్రిపేర్ అయ్యాను. నాన్న రామమూర్తి 2010లో చనిపోయారు. అమ్మ పద్మావతి, అన్నయ్య కలిసి నా చదువుకు తోడ్పాటు అందించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే వారి లక్ష్యం స్థిరంగా ఉండాలి. దానికి తగిన శ్రమ నిరంతరంగా ఉండాలి. ఆత్మవిశ్వాసం కోల్పోకూడదు. అప్పుడే విజయం సొంతమవుతుంది. ఇంటర్వ్యూలో ప్రొఫెషన్, హాబీస్, డిప్యూటీ తాసీల్దార్ నా మొదటి ప్రిఫరెన్స్ కాబట్టి 'ఎలా మార్పు తీసుకువస్తారు? విధులు ఎలా నిర్వర్తిస్తారు?' తదితర ప్రశ్నలను అడిగారు.

**- ఉదారపు నరేష్,** దానవాయిగూడెం కాలని, ఖమ్మం జిల్లా

## మహిళా విభాగంలో మొదటి ర్యాంకు

మహిళా విభాగంలో స్టేట్ 1 ర్యాంకు వచ్చింది. సబ్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యాను. 2012 నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కోరిక ఉండేది. అప్పటి నుంచి చదువుతూనే ఉన్నా. గ్రూప్-2 నోటిఫికేషన్ రావడంతో సీరియస్‌గా చదవడం మొదలు పెట్టాను. మొదట్లో కోచింగ్‌కు వెళ్లాను. కొంత ఐడియా వచ్చాక, సొంతంగా నోట్స్ రాసుకున్నా. దాన్నే అనుసరించా. ఇక తెలుగు అకాడమీ బుక్స్ చాలా ఉపయోగపడ్డాయి. ఎక్కువ సంఖ్యలో బుక్స్ చదవడం కంటే కొన్ని ఎంపిక చేసిన పుస్తకాలను ఎక్కువ సార్లు చదవడం వల్ల ప్రయోజనమైంది. పరీక్షకు సమయం తక్కువగా ఉన్నప్పటికీ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాను. నాన్న దేవగిరి కేశవరెడ్డి సింగరేణి ఉద్యోగి. అమ్మ విజయలక్ష్మి గృహిణి. వీరితో పాటు నా విజయంలో నా భర్త మందపాటి వెంకటేశ్వరెడ్డి ప్రోత్సాహం ఎంతో ఉంది. 2014లో వచ్చిన సింగరేణి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం చేసుకుంటూ, కొడుకును చూసుకుంటూనే ప్రిపేర్ అయ్యా. స్టేట్ టాపర్‌గా నిలవడం, సబ్ రిజిస్ట్రార్ జాబ్ రావడం పట్ల నాతో పాటు తల్లిదండ్రులు, నా భర్త, ఊరు ప్రజలు సంతోషంలో మునిగిపోతున్నాం. పరీక్షలు పారదర్శకంగా నిర్వహిస్తున్నందుకు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ చక్రపాణి గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

**- నిర్మల దేవగిరి,** గౌరిగూడెం, సత్తుపల్లి మండలం, ఖమ్మం





## టాప్ 50 అనుకుంటే టాప్ 2 వచ్చింది

టాప్ 50లో ఒక ర్యాంకు వస్తుందని అనుకున్నా. కానీ రెండో ర్యాంకు వచ్చింది. నేను ఎంపిక చేసుకున్న డిప్యూటీ తాసీల్దార్ రావడం సంతోషంగా ఉంది. ఇప్పటికే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేస్తున్నా. గ్రూప్ 2 నోటిఫికేషన్ రాకముందు నుంచే ఇతర పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత సిలబస్ ప్రకారం చదివాను. ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. సొంతంగా నోట్స్ తయారు చేసుకున్నా. నాన్న కరుణాకర్ రెడ్డి వ్యవసాయం చేస్తారు. అమ్మ ఉమాదేవి గృహిణి. కుటుంబం తోడ్పాటు చాలా ఉంది. నన్ను ఎప్పుడూ ప్రోత్సహించారు. పరీక్షలు రాగానే అందరూ చదువుతారు. కాని కొందరే విజేతలుగా మారుతారు. గుడ్డిగా, గంటలు గంటలు చదవడం కంటే పరీక్షను దృష్టిలో ఉంచుకొని ప్రిపేర్ అవడం మంచిది. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒక అవగాహన ఉండాలి. అప్పుడే లక్ష్యాన్ని చేరుకోవడం సులువవుతుంది.

**- ఒగ్గు రఘునందన్ రెడ్డి,** అడసర్లపాడు, వేంసూర్ మండలం, ఖమ్మం జిల్లా

## నా లక్ష్యాన్ని ఇలా సాధించా..

2013 నుంచి ప్రిపేర్ అయ్యాను. అర్హత ఉన్న అన్ని ఉద్యోగ పరీక్షలు రాశాను. కానీ ప్రతిసారి నిరాశే ఎదురైంది. దగ్గరి వరకు వచ్చి ఉద్యోగాలు చేయి జారేవి. చాలా బాధ అనిపించేది. అయితే ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఒకప్పుడు ప్రశ్నల సరళి వేరు..ఇప్పుడు అడుగుతున్నది వేరు. అవి గమనిస్తూ, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు వెళ్లాను. ఈ ఏడాది జేపీఎస్ ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు గ్రూప్ 2లో ఈఓపీఆర్డీ వచ్చింది. చివరికి నేను అనుకున్నది సాధించా. ఈ ప్రయాణంలో నా కుటుంబం తోడుగా నిలిచింది. నాన్న సింగరేణి ఉద్యోగి రాయమల్లు, అమ్మ మల్లక్క నాకంటే ఎక్కువ ఓపికతో నా సక్సెస్ కోసం ఎదురు చూశారు. ఇక నిత్యం ప్రోత్సాహం అందించిన స్నేహితులకు కృతజ్ఞతలు చెప్పాలి. ఉద్యోగం సాధించాలనుకునే వారు ఓర్పుగా ఉండాలి. నిత్యం అప్‌డేట్ అవుతూ ఉండాలి. అప్పుడే విజయం సాధ్యమవుతుంది.

**- నామని శ్రీనివాస్,** వరిపేట గ్రామం, కాసిపేట మండలం, మంచిర్యాల జిల్లా.





## విఫలం నుంచి విజయం వైపు

గ్రూప్-2 సాధించాలనేది నా కల. దాన్ని సాధించేందుకు ఎనిమిది ఏండ్లు పట్టింది. గతంలో రెండు సార్లు గ్రూప్-2 రాశాను. వీఆర్‌వో రెండుసార్లు రాశాను. గ్రూప్ 1 మెయిన్స్ వరకూ వెళ్లాను. ఇలా ఎన్నో వైఫల్యాల నుంచి ఇప్పుడు అనుకున్నది సాధించాను. ఈ ఏడాది జేపీఎస్ ఉద్యోగం రాగా, ఇప్పుడు ఏసీటీవోగా ఎంపికయ్యాను. చాలా సంతోషంగా ఉంది. టీఎస్‌పీఎస్సీ చాలా పారదర్శకంగా గ్రూప్2 ప్రక్రియ ముగించింది. అందుకు చైర్మన్ చక్రపాణి గారికి ధన్యవాదాలు. ఆర్థికంగా కాస్త పటిష్ఠంగా ఉన్న కుటుంబం మాది. నాన్న రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్. తమ్ముడు ఆర్థికంగా సాయం చేశారు. కష్టపడి సాధిస్తే ఏదైనా సాధ్యమవుతుంది. కాస్త సమయం పట్టవచ్చు కాని విజయం మాత్రం వస్తుంది. నాకు ఎనిమిదేండ్లు పట్టింది. కానీ, కొందరు స్నేహితులు రెండేళ్లలో సాధించిన వారు ఉన్నారు. చదివే విధానంలో మార్పు రావాలి. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో అనే విషయంపై అవగాహన వస్తే.. మార్కులు స్కోర్ చేయడం సులువు.

**- చిట్యాల భాను ప్రకాష్,** కొండాపూర్ గ్రామం, మద్దూర్ మండలం, సిద్ధిపేట జిల్లా.

## ఏడాది సీరియస్‌గా ప్రిపేర్ అయ్యాను

ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత విప్రోలో ఉద్యోగం చేశాను. అక్కడ రెండేళ్లు చేశాక ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేర్ కావాలనే ఆలోచన వచ్చింది. సివిల్స్ లక్ష్యంగా ఎంపిక చేసుకొని ప్రిపరేషన్ ప్రారంభించాను. మొదటి ప్రయత్నంగా రాలేదు. అదే సమయంలో గ్రూప్-2 నోటిఫికేషన్ రావటంతో ప్రిపరేషన్ ప్రారంభించాను. 13 నెలల పాటు సీరియస్‌గా చదివాను. ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. సొంతంగా నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను. ఈ క్రమంలో ఈ ఏడాది జూనియర్ పంచాయతీ సెక్రెటరీ ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు నేను కోరుకున్నట్లుగానే సచివాలయంలో ఏఎస్‌వో ఉద్యోగం వచ్చింది. నాన్న రాములు, అమ్మ ఎల్లమ్మ ఇద్దరూ కూలీలే. కష్టపడి చదివించారు. ఎప్పుడూ నాకు తోడుగా నిలిచారు. ఎంతో ప్రోత్సహించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే అన్నింటికంటే ముందు ఓపిక ఉండాలి. అలా ఉన్నవారికే విజయం వస్తుంది. చెప్పుడు మాటలు విని చెడు ఆలోచనలు చేయకూడదు. ఒకే పరీక్ష కోసం ఎదురు చూడకుండా అన్ని ఉద్యోగాలు రాయాలి. అలా చేయడం వల్ల ముందు ఒక ఉద్యోగం వస్తుంది. దాన్ని ఒక వేదికగా చేసుకొని లక్ష్యంగా పెట్టుకున్న ఉద్యోగం కోసం కష్టపడితే విజయాన్ని చేరుకోవడం సులభమవుతుంది.

**న్యాలం శ్రీశైలం**
మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా



... సిద్ధార్థ్ బీసగోని

# అరుదైన గౌరవం



**శాంతి, ప్రశాంతతలకు పర్యాయ పదంగా బౌద్ధమతం మనకు పరిచయమే. బౌద్ధ సన్యాసులంటే పచ్చనిచెట్ల కింద ధ్యానం చేసుకునే సాధువులుగానే తెలుసు. బౌద్ధమతాన్ని స్వీకరించిన కొంతమంది సన్యాసినులు కుంగ్‌ఫు యుద్ధకళలో ప్రావీణ్యాన్ని సంపాదించారు. ఆత్మరక్షణ కోసం మహిళలకు కుంగ్‌ఫులో శిక్షణ ఇచ్చి ఓ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు.**

మూసపద్ధతులను వదిలేసి సమాజానికి తమవంతుగా సేవచేయడానికి బౌద్ధ సన్యాసినులు ముందుకు వచ్చారు. బౌద్ధ సన్యాసులు వ్యాయామం చేయడం, యుద్ధకళలు నేర్చుకోవడంపై గతంలో నిషేధం ఉండేది. సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, లఢఖ్‌ల్లోని బౌద్ధమఠాల్లో ఉండే 700 మంది సన్యాసినులు శ్రీకారం చుట్టారు. అందుకోసం కుంగ్‌ఫులో శిక్షణ పొందారు. విపత్కర పరిస్థితుల్లో మహిళలు తమను తాము ఎలా రక్షించుకోవాలో శిక్షణ ఇచ్చారు. సమాజంలో మహిళలపై జరిగే అకృత్యాలపై పోరాడేందుకు కొంతమంది సన్యాసినులు చేసిన కృషికి అరుదైన గౌరవం దక్కింది. ఆత్మరక్షణతో పాటు, మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. వీరు అందించిన సేవలకు 'ఆసియా గేమ్ చేంజర్' అవార్డు లభించింది. '2015లో నేపాల్లో భూకంపం సంభవించింది. ఆ సమయంలో బాధితులను సాయం అందించాం. ప్రాణాపాయ పరిస్థితుల నుంచి రక్షించామని' రూప అనే సన్యాసిని చెబుతున్నది. నేపాల్, లఢఖ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతాలకు సైకిల్ యాత్ర చేసి సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. మహిళల అక్రమరవాణ, ప్లాస్టిక్ వాడం, పర్యావరణ కాలుష్యం వంటి అంశాలపై అక్కడి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. ఖాట్మండు నుంచి లఢఖ్ వరకు 45,000 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేసి ఇంటింటికీ తిరిగి అనేక అంశాలపై అవగాహన కల్పించామని రూప అంటున్నది. సమాజానికి తమ వంతు సేవలందించిన ఇంద్ర నూయి, ముఖేష్ అంబానీ, దేవ్ పటేల్ వంటి వారు ఇప్పటికే ఆసియా గేమ్ చేంజర్ అవార్డును అందుకున్నారు.

## వంటింటి చిట్కాలు



- ఆపిళ్ల పక్కనే అరటి పండ్లను ఉంచితే త్వరగా పండుతాయి.
- పుదీనా, కొత్తిమీర చట్నీ రంగు మారకుండా ఉండాలంటే చేసిన వెంటనే నిమ్మరసం పిడితే సరిపోతుంది.
- పెసర పిండిలో నిమ్మరసం కలిపి వెండి వస్తువుల్ని తోమితే కొత్త వాటిలా తళతళా మెరుస్తాయి.
- పచ్చిమిర్చిని కోయడం అయిపోయాక పంచదార కలిపిన నీటితో చేతుల్ని కడిగితే చేతులు మంటగా అనిపించవు.
- ఆకుకూరలు వండేటప్పుడు చిటికెడు పంచదార కలిపితే కూర సహజరంగును కోల్పోదు.
- ఆలుగడ్డల్ని ఉప్పు నీళ్లలో నానబెట్టి వేయిస్తే ముక్కలు రుచిగా ఉంటాయి.
- వంటకాల్లో సుగంధద్రవాల్ని అలాగే వేసే బదులు పొడిచేసి వేస్తే సువాసన వస్తాయి.
- ఆమ్లెట్ వేస్తున్నప్పుడు గుడ్డులోని సొనకు కాస్త పాలు, చిటికెడు పంచదార కలిపితే మంచి టేస్ట్ వస్తుంది.

# గిరిపుత్రుల 'దండారి'



**కొండకోనల్లో కాలిగజ్జెలు చిందులేస్తున్నాయి. గిరిపుత్రులు రేలా పాటలు పాడుతుంటే.. కొండా కోనమ్మా కోరస్ అందుకుంటున్నాయి. అమావాస్య చీకటిని పారదోలేందుకు పున్నమి నిండు వెన్నెల ఎదురు చూస్తున్నది. అడవిబిడ్డలు దండారి సంబురాల్లో చెట్టూ, పుట్ట, పిట్ట.. భాగమై అడవికి అందం తీసుకొచ్చాయి.**

ఎద్దుకొమ్ములతో చేసిన రుమాలును తలపై పెట్టకొని 'రే రేల రే రేలా' అంటూ సంప్రదాయబద్ధంగా నృత్యం చేసే గిరిజన, గోండుల పండుగ దండారి! గిరిజనుల గుస్సాడీ నృత్యాలకు పులకించని వాళ్లంటూ ఉండరు. ఈ దండారి సంబురమంతా ప్రకృతి రమణీయంగా, సహజసిద్ధంగా ఉంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో సూర్యుడి వెలుతురును కూడా చూడలేని అడవి బిడ్డలు ప్రతియేటా ఈ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ఒడ్డున ఉన్న 'పద్మల్‌పురి కాకో' ఆలయంలో.. యేటా దసరా తర్వాత వచ్చే ఆశ్వీయుజ పౌర్ణమితో దండారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దీపావళి అమావాస్యతో ముగుస్తాయి. పండుగ తర్వాత రెండ్రోజుల పాటు సంబురాలు కొనసాగుతాయి. 'పద్మల్‌పురి కాకో' వీరి ఆరాధ్యదైవం. కాకో తెలుగు రాష్ట్రంలోనే ఏకైక ఆలయంగా ప్రసిద్ధి చెందినది. 15 రోజులపాటు గుడిరేవు ప్రాంతం గిరిజనం గుస్సాడీ నృత్యాలతో అలరిస్తారు. తెలంగాణ నుంచే కాకుండా.. మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా గిరిజనులు పెద్ద ఎత్తున ఈ ఆలయానికి తరలివస్తుంటారు. ఆదివాసీ, గోండు, ప్రదాన్, కొలాం, ఇతర గిరిజనులు ఈ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. పద్మల్‌పురి కాకో ఆలయం వద్ద జరిగే దండారి ఉత్సవాలకు ఆదివాసీలు కుటుంబ సమేతంగా వచ్చి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం విందు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. పద్మల్‌పురి కాకోకు అతి పవిత్రతతో నైవేద్యాలు తయారు చేస్తారు. పాయసంతో పాటు రుబ్బిన పెసరు, మినుములు, బబ్బెర గారెలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. వీటిని గానుగ, నువ్వులు, పల్లి నూనెతో తయారు చేస్తారు. దంచిన బియ్యంతో తయారు చేసిన అరిసెలు కూడా నైవేద్యంగా నివేదిస్తారు. సంబంధించిన ధాన్యాన్ని కేవలం ఆరచేతితో మాత్రమే కొలుస్తారు. దండారి ఉత్సవాలు ముగిసే దాక గిరిజనులు నిత్యం ప్రత్యేక భజనలు చేస్తారు. గిరిజన భాషలో పాటలు పాడుతారు. ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివెళ్తారు.

ప్రకృతిని ఆరాధించే గిరిజనులు ఆటా పాటాలతో మునిగి తేలుతారు. గిరిజన గూడేలు ఆట పాటలతో హోరెత్తుతాయి. ఎక్కడెక్కడో ఉన్న తమ పిల్లలు, బంధువులను పిలుచుకుని మరీ గిరిజనులు ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. గిరిజనులు తమ సంప్రదాయాలకు ఎంత విలువ ఇస్తారనేది ఈ దండారి సంబురాల ద్వారా తేటతెల్లం అవుతుంది. దీనికి దాదాపు 200 ఏళ్ల చరిత్ర ఉందని పెద్దలు చెబుతుంటారు. పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లేందుకు శ్రీకృష్ణ పరమాత్మని ప్రార్థిస్తారు. తమ అజ్ఞాతవాసం విజయవంతంగా ముగించేలా వరం ఇవ్వాలని కోరుకుంటారు. దీంతో శ్రీకృష్ణుడి ఆశీర్వాద బలంతో పాండవులు తమ అజ్ఞాతవాసం పూర్తి చేసుకోవడమే కాకుండా కురుక్షేత్ర యుద్ధంలో పోరాడి విజయం కూడా సాధించారు. దీనిలో భాగంగానే దండారి సంబురాలు జరుపుకొంటారని గిరిజన పెద్దలు చెబుతుంటారు. కృష్ణున్ని కొలిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని వారు చెబుతారు. దీపావళికి వారం రోజులు ముందుగా ప్రారంభించి పండుగ ముగిసిన రెండు రోజుల వరకు కొనసాగిస్తారు. చివరి రోజు ఇంటింటికీ తిరుగుతూ ఎత్మాసార్ దేవుళ్లకు మొక్కుతారు. సంప్రదాయం ప్రకారం నవధాన్యాలు స్వీకరించి ఎత్మాసార్ దేవుళ్లకు వీడ్కోలు పలుకుతారు. అదే రోజు సాయంత్రం గ్రామదేవతలకు బలిచ్చి పూజలు చేస్తారు. అందరూ బాగుండాలని కోరుకుంటూ.. తమ దేవతలను తిరిగి పూజగదిలో భద్రం చేస్తారు.



**ఈడుకొచ్చిన యువతీయువకులకు పెళ్లిచూపులతో సంబంధాలు కలుపుతారు. పెళ్లిచూపులకు వేదికగా నిలిచే ఈ వేడుక అనంతరం ఇరు కుటుంబాలు అంగీకరిస్తే.. దీపావళి తర్వాత పెళ్లి ముహూర్తం నిర్ణయిస్తారు. ఆ రోజు రాత్రి, మరుసటి రోజు పగలు విందు వినోదాలు, నృత్యాలతో గడుపుతారు.**

ఈ దండారి సంబురాలు గిరిజనుల అనుబంధాలు, ఆప్యాయతలకు ప్రతీరూపంగా నిలుస్తాయి. గిరిజన గ్రామాల్లోని దండారీ బృందాలు పక్కన ఉన్న మరో గ్రామానికి వెళ్లి ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఈ సంవత్సరం ఆతిథ్యం ఇచ్చిన బృందం మరో ఏడాది అతిథ్యం స్వీకరించిన గ్రామానికి వస్తుంది. ముందుగా దండారి నిర్వహించే బృందం గ్రామ శివారులో డప్పులు మోగిస్తారు. ఆ శబ్దం విన్న గ్రామస్తులంతా వచ్చి దండారీ బృందాన్ని ఆహ్వానిస్తూ ఘన స్వాగతం పలుకుతారు. తర్వాతి రెండ్రోజులు విందు, వినోదాలతో గడుపుతారు.

... డప్పు రవి

నమస్తే తెలంగాణ
సంపద
[ కరీంనగర్ ]
శనివారం 26 అక్టోబర్ 2019

## ప్రాజెక్టుల పండుగ ఆఫర్లు



పండగవేళలో నగరానికి చెందిన పలు నిర్మాణ సంస్థలు సరికొత్త ఆఫర్లను ప్రకటించింది. అప్పా జంక్షన్ చేరువలో నిర్మితమైన పీబీఈఎల్ సిటీలో ఇప్పటికే కొనుగోలుదారులు స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులోని ఇతర బ్లాకుల్లో ఫ్లాట్లను సంస్థ ప్రస్తుతం విక్రయిస్తుంది. అయితే, ముందస్తు చేసే చెల్లింపుల ఆధారంగా తుది ధరను నిర్ణయిస్తామని పీబీఈఎల్ సిటీ ప్రకటించింది. ముందే ముప్పయ్ శాతం సొమ్ము చెల్లిస్తే.. చదరపు అడుక్కీ రూ.4,300కే ఫ్లాటును అందజేస్తామని అంటున్నది. యాభై శాతం చెల్లిస్తే రూ.3,900.. వంద శాతం సొమ్ము ముందే చెల్లిస్తే.. రూ.3,600కే విక్రయిస్తామని అంటున్నది. కొంపల్లి బొల్లారం రోడ్డులోని వీబీ సిటీలో ఈ నెలాఖరులోపు ఫ్లాటు కొంటే పది గ్రాముల బంగారు నాణెం ఉచితమని ఇండిస్ గ్రూప్ ప్రకటించింది.

## డిసెంబరులో క్రియేట్ అవార్డ్స్ 2019

CREATE
the fire within
CREDAI REALTY AWARDS FOR TELANGANA

ఈ ఏడాది క్రియేట్ అవార్డులను డిసెంబరులో నిర్వహించడానికి క్రెడాయ్ తెలంగాణ సన్నాహాలు చేస్తున్నదని ఛైర్మన్ గుమ్మి రాంరెడ్డి తెలిపారు. 2017లో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి ఈటెల రాజేందర్, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆ కార్యక్రమంలో నిర్మాణాల్లో నాణ్యతను, నూతనత్వాన్ని ఆవిష్కరించిన సంస్థలకు అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ కార్యక్రమం నుంచి స్ఫూర్తి పొంది, ఈసారి మరింత మెరుగైన రీతిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని క్రెడాయ్ తెలంగాణ చెబుతున్నది.

# స్టీలెంత? సిమెంటెంత?

సొంతిల్లు కట్టుకోవడానికయ్యే ఖర్చెంత? | స్టీలుకెంత అవుతుంది? ఇసుకకు ఎంత? | రంగులకు ఎంత పెట్టుకోవాలి? | 1500 నుంచి 5000 చ.అ. దాకా అయ్యే ఖర్చెంత?

**సొంతంగా ఇల్లు కట్టుకోవాలని కోరుకునేవారు కొన్ని కీలకమైన అంశాలపై దృష్టి సారించాలి. ముఖ్యంగా, ఇంటి నిర్మాణంలో కీలకమైన నిర్మాణ సామగ్రిని ఎంత కొనుగోలు చేయాలనే విషయంపై అవగాహన ఏర్పడాలి. ఇల్లు కట్టాలన్న నిర్ణయానికి రాగానే సిమెంటు, స్టీలు, ఇసుక, ఇటుకలు వంటివి ఎంత అవసరమో తెలుసుకోవాలి. ఇంటికి కీలకమైన తలుపులు, కిటికీలు ఎన్ని కావాలి? ఆర్ఎంసీ కాంక్రీటు ఎంత అవసరం ఉంటుంది వంటివన్నీ కనుక్కోవాలి. ఇక, ఇంటికి కీలకమైన రంగుల విషయానికొస్తే.. ఇంటిలోపల, బయట ఎంత విస్తీర్ణం మేరకు రంగులు వేయాలి? వంటి అంశాలపై అవగాహన ఏర్పడాలి. లేకపోతే, అనుకున్న దానికంటే నిర్మాణం తడిసిమోపెడు అవుతుంది.**



ప్రస్తుతం కొంతమంది ఐదు వేల చదరపు అడుగుల్లో విలాసవంతమైన ఇల్లును కట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. లేదా, అందులో సగం విస్తీర్ణంలోనైనా కట్టుకునేవారి సంఖ్య పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో, ఓ ఐదు వేల చదరపు అడుగుల ఇంటికెంత నిర్మాణ సామగ్రి అవుతుందంటే..

| వస్తువు | మొత్తం | రేటెంత? |
|---|---|---|
| ఇటుకలు | 6000 | నాణ్యమైన రకం రూ. 89 (9 అంగుళాలవి) |
| సిమెంటు | 600 సంచులు | నాణ్యమైన సిమెంటు: బస్తాకు రూ.360 |
| స్టీలు | 17 టన్నులు | టన్నుకు రూ.50 వేలు |
| ఇసుక | 200 టన్నులు | రోబో రకం, లోడు రూ.900 |
| 20 ఎంఎం కంకర | 100 టన్నులు | టన్నుకి రూ.750 |
| **ఇంటికి రంగులు** | | |
| లోపల మొత్తం | 3,500 చ. అ. | చదరపు అడుక్కీ రూ.12 నుంచి 20 |
| బయటి ప్రాంతం | 5,865 చ.అ. | చ. అ.కీ. రూ.12 నుంచి 20 |
| మొత్తం ప్లాస్టరింగ్ | 9,365 చ.అ. | చ. అ.కీ. రూ.55 |
| ఆర్ఎంసీ | 130 క్యూబిక్ మీ. | క్యూబిక్ మీటర్ రూ.3,800–4,200 |
| తలుపులు | 24 | హై డెన్సిటీ వుడ్, రూ.15,000 ఒక్కోటి |
| కిటికీలు | 26 | మొదటిరకం: చదరపు అడుక్కీ రూ.500 |
| ఫ్లోరింగ్ | 6500 చ.అ. | రూ.300 (చదరపు అడుక్కీ) |

- ప్లంబింగ్ కోసం ఒక్కో టాయిలెట్‌కు రూ.50,000 దాకా ఖర్చు అవుతుంది. ఇంటికి ఐదు టాయిలెట్లు కావాలి. ఎలక్ట్రికల్ విషయానికొస్తే.. చదరపు అడుక్కీ రూ.150 దాకా ఖర్చొస్తుంది. మొత్తానికి, 5000 చదరపు అడుగుల్లో ఒక ఇల్లును కట్టాలంటే.. చదరపు అడుక్కీ ఎంతలేదన్నా రూ.1,250 నుంచి రూ.1,500 దాకా ఖర్చవుతుంది. ఇంట్లో వినియోగించే ఫ్లోరింగ్, హార్డ్‌వేర్, సానిటరీ వేర్, ఎలక్ట్రికల్ వంటి ఆధునిక రకాలను బట్టి తుది ధర మారుతుంది. ఇంటి నిర్మాణ విస్తీర్ణం తగ్గితే, భవన డిజైనింగ్ బట్టి అంతిమ రేటు స్వల్పంగా పెరుగుతుంది. కాస్త తక్కువ విస్తీర్ణం అనగా, 2,500, 1,500 చదరపు అడుగుల్లో కట్టే ఇళ్లకు తుది ఖర్చులో ఐదు శాతం దాకా ఖర్చు పెరగడానికే ఎక్కువ ఆస్కారముంది. ఇంటి విస్తీర్ణం తగ్గితే, డిజైన్ బట్టి తుది రేటు మారుతుందని మర్చిపోవద్దు.



| ఇంటి విస్తీర్ణం | కనీస ధర | గరిష్ఠ ధర |
|---|---|---|
| 5,000 చ.అ. | 62.50 లక్షలు | 75 లక్షలు |
| 2,500 చ.అ. | 31.25 లక్షలు | 37.50 లక్షలు |
| 1,500 చ.అ. | 18.75 లక్షలు | 22.50 లక్షలు |

(చదరపు అడుక్కీ: రూ.1250– 1500 చొప్పున లెక్కిస్తే వచ్చిన మొత్తం ఇది)

– సురేష్, ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్, వసంత ఆర్కిటెక్ట్స్

**పండగ వేళలో ఇండ్ల అమ్మకాలు పెరుగుతున్నాయని.. దాదాపు 70 శాతం కొనుగోలుదారులు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టుల్లోనే కొనుగోలు చేస్తున్నారని ఓ సంస్థ నిర్వహించిన తాజా సర్వేలో తేలింది. ఈ పోకడ ప్రధానంగా, హైదరాబాద్ వంటి నగరంలోనూ కనిపిస్తున్నదని ఆ సంస్థ సర్వేలో పేర్కొన్నది.**



## నవ జంటలే నయా బయ్యర్లు

హైదరాబాద్ వంటి మహానగరంలో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావించేవారు.. వినాయక చవితి నుంచి ఉగాది వరకూ ఇండ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తారనే విషయం తెలిసిందే. ఇందులో కొంతమంది దీపావళి సమయంలో సొంతింట్లోకి అడుగు పెట్టడానికి ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఫ్లాట్లు, ఇండ్ల అమ్మకాల్లో సుమారు 15 నుంచి 30 శాతం దాకా పెరుగుదల నమోదు కావడం గమనార్హం. కాకపోతే, వీరంతా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టుల్లోనే కొనుగోలు చేయడానికి ముందుకొస్తున్నారు. ఒక ప్రాజెక్టులో ఫ్లాటు తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చే ముందు, వీరంతా ఆధునిక సదుపాయాలు, నగరానికెంత చేరువలో ఉంది?, ప్రజా రవాణా అందుబాటులో ఉందా? వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. అందుకే, గత నెల నుంచి కొనుగోలుదారులు ప్రాజెక్టులను విరివిగా సందర్శిస్తున్నారు. వరంగల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, ఖమ్మం వంటి జిల్లాల్లోనూ ఇండ్లను కొనుగోలు చేసే వారి సంఖ్య అధికమైంది. ఇందులో అపార్టుమెంట్లను కొనేవారి శాతం 30 నుంచి 35 శాతముండగా.. ప్లాట్ల కోసం చూసే వారి సంఖ్య 50 శాతమున్నది. ఇక, బహుళ అంతస్తుల అపార్టుమెంట్లలో ఎంచుకోవడానికి 15 నుంచి 20 శాతం మంది ముందుకొస్తున్నారు.

### ధరే కీలకం..

హైదరాబాద్లో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావించేవారు.. గత ఒకట్రెండెండ్ల నుంచి పలు ప్రాజెక్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. వీరంతా గతంలో ఉన్న రేటు, ప్రస్తుత ధరను గమనించాకే తుది నిర్ణయం తీసుకుంటున్నారు. నిర్మాణం పురోగతిని పక్కాగా అంచనా వేయడంతో పాటు రేటును కూడా గమనించాకే అడుగు ముందుకేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇండ్లను కొనుక్కునే వారిలో ఎక్కువగా 35–40 ఏండ్ల మధ్యలో వారే ఉంటున్నారు. ఇందులో 83 శాతం పురుషులుంటే, మహిళలది 17 శాతమని సర్వేలో సంస్థ తెలియజేసింది. వంద శాతం మంది ఆస్తి కావాలని అడిగితే.. అందులో ఇంటిని ఎంచుకునేవారు కేవలం 2 శాతమే కావడం గమనార్హం.




## ఏ ప్రాంతంలో ఎంత కిరాయి?

| ప్రాంతం | అద్దె రేటు | |
|---|---|---|
| | 2 బీహెచ్‌కే | 3 బీహెచ్‌కే |
| ఆదిభట్ల | 10,500–15,000 | 16,000–18,000 |
| అమీర్‌పేట్ | 12,000–14,000 | 20,000–21,000 |
| అత్తాపూర్ | 10,000–13,000 | 14,000–18,000 |
| బాచుపల్లి | 9,000 – 11,000 | 11,000–14,000 |
| బండ్లగూడ | 7,500 – 9,000 | 11,000–15,000 |
| బీరంగూడ | 6500 – 8,000 | 9,000– 12,000 |
| బేగంపేట్ | 13,000–15,000 | 20,000–23,000 |
| చందానగర్ | 12,000–14,000 | 17,000–20,000 |
| ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ | 20,000–25,000 | 31,000–41,000 |
| హైటెక్‌సిటీ | 25,000–30,000 | 29,000–38,000 |
| ఖైరతాబాద్ | 13,000–16,000 | 20,000–25,000 |
| ఖాజాగూడ | 24,000–28,000 | 40,000–49,000 |
| కోకాపేట్ | 20,000–25,000 | 26,000–35,000 |
| కొండాపూర్ | 15,000–18,000 | 24,000–30,000 |
| కేపీహెచ్‌బీ | 13,000–19,000 | 25,000–28,000 |
| మదీనాగూడ | 12,000–14,000 | 17,000–23,000 |
| మణికొండ | 13,000–17,000 | 20,000–26,000 |
| మసాబ్‌ట్యాంక్ | 15,000–18,000 | 23,000–24,000 |
| మియాపూర్ | 13,000–15,000 | 16,000–19,000 |
| నల్లగండ్ల | 16,000–19,000 | 23,000–27,000 |
| నానక్‌రాంగూడ | 20,000–25,000 | 32,000–41,000 |
| నిజాంపేట్ | 10,000–12,000 | 14,000–18,000 |
| పోచారం | 9,000–12,000 | 12,500–14,000 |
| సనత్‌నగర్ | 14,000–18,000 | 24,000–30,000 |

- **కేవలం అవగాహన కోసమే ఈ ధరలు.** అపార్టుమెంట్ ఎంత పాతది? ప్రధాన రహదారికి ఎంత చేరువలో ఉన్నది? అపార్టుమెంట్‌లో ఉన్న సౌకర్యాలు, చుట్టుపక్కల మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందాయా? వంటి అంశాల ఆధారంగా తుది రేటు ఆధారపడుతుంది.

## షాద్‌నగర్‌లో 'సిరివనం'




'సిరివనం' అనే వెంచర్‌ను విజన్ ప్రాపర్టీస్ సంస్థ షాద్‌నగర్ చేరువలో అభివృద్ధి చేస్తున్నది. ఇక్కడి బస్టాప్ నుంచి కేవలం పదిహేను నిమిషాల్లో ప్రయాణిస్తే చాలు.. ఈ వెంచర్‌కు చేరుకోవచ్చు. ప్రస్తుతం అభివృద్ధి పనులను జోరుగా జరిపిస్తున్నామని సంస్థ ఎండీ నాగం తిరుపతిరెడ్డి తెలిపారు. ఇందులో ప్లాట్లు కొనేవారికి శ్రీ గంధం చెట్లను అందజేస్తామన్నారు. ఇవి పెరగడానికి అనుకూలమైన ప్రాంతంలోనే సిరివనంకు శ్రీకారం చుట్టామని చెప్పారు. 605 చదరపు గజాల ప్లాటు కొనుగోలు చేసేవారికి ముప్పయ్ శ్రీగంధం చెట్లను ఇస్తామని.. వాటిని విక్రయించగా వచ్చిన ఆదాయంలో అరవై శాతం వాటా కొనుగోలుదారులకు అందజేస్తామని వివరించారు. శాస్త్రవేత్తల పర్యవేక్షణలో సిరివనంను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్లాటు కొన్నవారికి తక్షణమే రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు.

## పదివేలకు పైగా సందర్శకులు..



క్రెడాయ్ వరంగల్ ఇటీవల నిర్వహించిన ప్రప్రథమ ప్రాపర్టీ షో విజయవంతం అయ్యిందని క్రెడాయ్ తెలంగాణ కార్యదర్శి ప్రేమ్ సాగర్ రెడ్డి తెలిపారు. ఇటీవల హైదరాబాద్ విచ్చేసిన ఆయన 'సంపద'తో మాట్లాడుతూ.. వరంగల్‌లో మొట్టమొదటిసారిగా భారీ స్థాయిలో సందర్శకులు విచ్చేసిన ప్రాపర్టీ షో తమదేనని గర్వంగా చెప్పారు. రెండు రోజుల్లో ఎంతలేదన్నా పది వేలకు పైగా ప్రజలు విచ్చేసి తమకు కావాల్సిన ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాల వివరాలను తెలుసుకున్నారని చెప్పారు. తమ మొదటి షో విజయవంతం కావడంతో, తదుపరి ప్రాపర్టీ షోలను ఇతర నగరాల్లో నిర్వహించేందుకు క్రెడాయ్ తెలంగాణ ప్రణాళికల్ని రచిస్తుందని తెలిపారు.




## 4.5 లక్షల అందుబాటు గృహాలు

**2020** సంవత్సరం పూర్తయ్యేలోపు 4.5 లక్షల అందుబాటు గృహాలను అందించాలనే లక్ష్యాన్ని పలు సంస్థలు నిర్దేశించుకున్నట్టు ఇటీవల ఓ సర్వే నివేదికలో వెల్లడైంది. కేంద్ర ప్రభుత్వం అధిక పన్ను ప్రయోజనాలు అందించడం ద్వారా కొనుగోళ్లకు ప్రోత్సాహం లభించిందని, 2022 నాటికి అందరికీ గృహాలు అందించాలనే ఆలోచనతో కేంద్రం కొన్ని నెలలుగా ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టిందని నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా కేంద్ర బడ్జెట్ సందర్భంగా రూ.45 లక్షల్లోపు విలువ చేసే గృహాల రుణాలపై చెల్లించే వడ్డీపై పన్ను మినహాయింపు పరిమితిని ప్రభుత్వం ఏటా రూ.1.5 లక్షల నుంచి 3.5 లక్షలకు పెంచిందని స్పష్టం చేసింది. నివేదిక ప్రకారం 2020 డిసెంబర్ వరకు భారతదేశంలో 7.95 లక్షల గృహాలు పంపిణీ జరుగుతుందని అంచనా. 2019 చివరి మూడు నెలల్లో 3.1 లక్షలకు పైగా అందుబాటు గృహాలు మార్కెట్‌లో అందుబాటులోకి రాగా, మిగిలిన 4.83 లక్షల యూనిట్లు 2020 వరకు అందుబాటులోకి వస్తాయని డెవలపర్లు చెబుతున్నారు. తక్కువ వడ్డీ, అధిక పన్ను ప్రయోజనాల ఫలితంగా గృహాల గిరాకీ సమీప భవిష్యత్తులో పెరుగుతుందని భావిస్తున్నారు. చాలామంది కొనుగోలుదారులు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇండ్లనే ఎంచుకుంటున్నారని, ప్రాజెక్టు పూర్తి కావడంలో ఆలస్యమవుతుండటంతో కొనుగోలుదారులు డెవలపర్లపై విశ్వాసం కోల్పోతున్నారని నివేదిక స్పష్టం చేసింది. ఇది గృహాల అమ్మకంపై ప్రభావం చూపుతోంది. దీంతో డెవలపర్ల మనుగడ కష్టమవుతోంది. నిలిచిపోయిన ప్రాజెక్టులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం రూ. 20 వేల కోట్ల నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో ప్రాజెక్టు డెలివరీ రేటు పెరగొచ్చని డెవలపర్లు అంచనా వేస్తున్నారు.








వనపర్తిలోని నల్లచెరువు వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ముథోల్ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి

**కుభీర్:** పేదవాడి సొంతింటి కల సాకారం చేయడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని నిర్మల్ జిల్లా ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని వీరేగాంవ్‌లో గ్రామంలో 15 డబుల్ బెడ్రూం ఇండ్లకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇండ్లు లేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు పూర్తి ప్రభుత్వ ఖర్చుతో నిర్మించి ఇవ్వడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. నిర్మల్ జిల్లాలో మొదట ఎల్లపల్లి తర్వాత కుభీర్ మండలంలోని వీరేగావ్‌లో ప్రారంభోత్సవం చేయడం సంతోషంగా ఉన్నదని చెప్పారు.



నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని వీరేగావ్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం (ఇన్‌సెట్) డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

## సమయపాలనలో దక్షిణ మధ్య రైల్వేనే మెరుగు!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమయపాలనను మెరుగుపరుచుకునే దిశగా దక్షిణ మధ్య రైల్వే చేస్తున్న కృషి మంచి ఫలితాలిచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో సమయపాలన 82 శాతం పెరిగిందని దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ప్రకటించింది. భారత రైల్వే సమయపాలన 74 శాతంగా నమోదయినట్టు పేర్కొన్నది. సమయపాలన మెరుగుకు తీసుకున్న చర్యలు, అమలుచేసిన సంస్కరణలు, ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానం ఆశించిన రీతిలో తోడ్పడిందని ప్రకటించింది.



# ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

- కృష్ణమ్మ నీటితో నల్లచెరువు నింపాం
- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- అలుగుపారిన నల్లచెరువు వద్ద పూజలు

**వనపర్తి, నమస్తే తెలంగాణ:** ప్రజలకు ఇచ్చిన మాటప్రకారం వర్షాధారంపైనే ఆధారపడి ఉన్న జిల్లా కేంద్రంలోని నల్లచెరువు(మినీ ట్యాంక్‌బండ్)కు కృష్ణమ్మ నీటిని తీసుకొచ్చి అలుగు పారించామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆనాటి సంస్థానాధీశులు కట్టించిన నల్లచెరువు అలుగుపారిన సందర్భంగా శుక్రవారం మంత్రి నిరంజన్‌రెడ్డి రైతులు, నాయకులు, పట్టణ ప్రజలతో కలిసి అలుగువద్ద పూలుచల్లి పూజలుచేశారు. అనంతరం నల్లచెరువు వద్ద ఏర్పాటుచేసిన బతుకమ్మ, వినాయక నిమజ్జనం ఘాట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సమైక్యరాష్ట్రంలో నిరాదరణకుగురై అన్యాక్రాంతమైన చెరువులు టీఆర్‌ఎస్ పాలనలో పూర్వవైభవాన్ని సంతరించుకుంటున్నాయని చెప్పారు. నల్లచెరువులో నీళ్లు చూడక దశాబ్దాలు గడిచాయని, ఇక నీళ్లను చూడలేమనే అపనమ్మకం ప్రజలకు ఉండేదని, కృష్ణా నీళ్లు పారిస్తానని గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని చెప్పారు. ఆయకట్టు భూములు సాగులోకి రావడమేకాకుండా నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఉన్న బోర్లన్నీ రీచార్జి అయ్యాయని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఈదుల, తాళ్ల చెరువులను పునరుద్ధరిస్తామని, వచ్చే వానాకాలం నాటికి ఈ రెండు చెరువులు అందుబాటులోకి తెవాలని నిర్ణయించామని తెలిపారు. ఈ మూడు చెరువులు నిండితే మత్స్యకారులకు సరిపడా ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు.

# కొండగట్టు ఆదాయం 1.65 కోట్లు

- గతంతో పోలిస్తే అదనంగా రూ.25,83,500 పలికిన నాలుగు దుకాణాల హక్కులు
- షెడ్యూళ్ల ద్వారా ఆదాయం రూ.85,720



**మల్యాల:** జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధానంలో రెండేండ్ల కాలపరిమితితో పలు దుకాణాల నిర్వాహణకు హక్కులు అప్పగించేందుకు ఆలయఅధికారులు శుక్రవారం షీల్డ్, బహిరంగ వేలం, ఈ టెండర్లు నిర్వహించారు. నాలుగు దుకాణాల ద్వారా ఆలయానికి రూ.కోటి 65 లక్షల 74 వేల 610 ఆదాయం సమకూరింది. ఆలయ పరిధిలోని మరుగుదొడ్లు, స్నానపుగదుల నిర్వహణకు వేలం పాటలు నిర్వహించగా మూడు షెడ్యూళ్లు దాఖలయ్యాయి. శారద శానిటేషన్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధి రూ.41 లక్షల 61వేల 555కు హక్కులను దక్కించుకున్నారు. గత ధర రూ.27,00,555, ఈ సారి రూ.14.61 లక్షల ఆదాయం అదనంగా సమకూరనుంది. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో భక్తులు కొట్టిన కొబ్బరికాయల ముక్కలను పోగుచేసుకునే హక్కులకు మూడుసంస్థలు పాల్గొనగా వేములవాడకు చెందిన శ్రీ రాజరాజేశ్వర ట్రేడర్స్ సంస్థ ప్రతినిధి రవి రూ.99 లక్షల 55వేల 555లకు హక్కులను దక్కించుకొన్నారు. గతంలో రూ.95 లక్షల 55వేల 555లకు హక్కులను దక్కించుకోగా ఈ సారి రూ.4లక్షలు పెంచి హక్కులను దక్కించుకున్నారు. శీతల పానీయాలు, ఐస్‌క్రీం దుకాణాల నిర్వాహణకు ముత్యంపేటకు చెందిన పంజాల శ్రీనివాస్ రూ.23లక్షల 75 వేలకు హక్కులను దక్కించుకోగా, గతంలో రూ.16 లక్షల 75వేలు. ఈ సారి ఆలయానికి రూ.ఏడు లక్షల ఆదాయం అదనంగా వచ్చింది. గుట్టకింద ఒకటో నంబర్ దుకాణానికి రెండు షెడ్యూళ్లు దాఖలవగా రాకేశ్ గతం కంటే రూ.22,500 ఎక్కువపాడి రూ.82,500కు హక్కులను దక్కించుకున్నారు. ఫొటో స్టూడియో, లాకర్ గది నిర్వాహణ, గుట్ట దిగువనగల పదోనంబర్ గదికి సింగిల్ షెడ్యూళ్లు దాఖలయ్యాయి.

### ఏడు దుకాణాల వేలం వాయిదా

గుట్ట కింద దుకాణ సముదాయాల్లోని 6,7,8,9నంబర్ల దుకాణాలకు షెడ్యూళ్లు దాఖలు కాకపోవడంతో మొత్తం ఏడు దుకాణాల వేలం ప్రక్రియను అధికారులు వాయిదా వేశారు. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి నాలుగు దుకాణాల టెండర్ల ద్వారా రూ.1కోటి 65లక్షల 74వేల 610ల ఆదాయం సమకూరగా గతంతో పోలిస్తే రూ.25లక్షల 83వేల 500ల ఆదాయం అదనంగా సమకూరనుంది. టెండర్లలో పాల్గొనేందుకు షెడ్యూళ్ల దాఖలు, ప్రవేశరుసుం ద్వారా ఆలయానికి రూ.85,720 ఆదాయం సమకూరినట్టు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మారుతి స్వామి, కరీంనగర్‌లోని అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ సీనియర్ సహాయకులు పీ ఉమ, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ, వైరాగ్యం అంజయ్య, టెండర్ సెక్షన్ ఇన్‌చార్జిలు శ్రీనివాసాచారి, కాసర్ల శ్రీనివాస్, ఆలయ భద్రతాసిబ్బంది ఇంచార్జి సముద్రాల రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.




## మసీదుల్లోకి ముస్లిం మహిళల ప్రవేశంపై మీరేమంటారు ?

కేంద్రాన్ని వివరణ కోరిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 25:** మసీదుల్లోకి ముస్లిం మహిళలను అనుమతించడంపై స్పందన తెలుపాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రాన్ని కోరింది. ముస్లిం మహిళలను మసీదుల్లోకి అనుమతించకపోవడం వివిధ ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందంటూ యాస్మిన్ జుబెర్ అహ్మద్ పీర్జాడే అనే వ్యక్తి ప్రజ ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ముస్లిం మహిళలను మసీదుల్లోకి అనుమతించేలా ప్రభుత్వ అధికారులు, వక్ఫ్ బోర్డు వంటి ముస్లిం సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేయాలంటూ అందులో కోరారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్, న్యాయమూర్తులు ఎస్ఏ బోబ్డె, ఎస్ఏ నజీర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ చేపట్టింది. దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర న్యాయ, మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలకు నోటీసులు జారీ చేసింది.




## స్థూలకాయంతో ఆస్తమా..!



**శరీర** బరువు ఎక్కువగా ఉండడం వల్ల అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, గుండెజబ్బుల వంటివి వచ్చే అవకాశముందని తెలిసిందే. ఇప్పుడు ఈ జబ్బుల వరుసలో ఆస్తమా కూడా చేరింది. అధిక బరువు, స్థూలకాయం ఉన్నవాళ్లలో కొవ్వు చర్మం కింద అడిపోస్ కణజాలంలో పేరుకుపోతుంది. రక్తనాళాల్లో కూడా చేరి రక్తప్రసరణకు అంతరాయం కలిగిస్తాయి. అయితే ఈ కొవ్వు డిపాజిట్లు ఊపిరితిత్తుల శ్వాస మార్గాల గోడల్లో కూడా చేరుతాయని కొత్త పరిశోధనలో తేలింది. ఇలా కొవ్వు చేరడం వల్ల ఊపిరి తీసుకోవడం కష్టమై పిల్లికూతలు, ఆస్తమా వ్యాధి వచ్చే అవకాశం ఉన్నట్టు చెప్తున్నారు. ఈ అధ్యయనం యూరోపియన్ రెస్పిరేటరీ జర్నల్‌లో ప్రచురితమైంది. చనిపోయినవాళ్లలో 52 మంది ఊపిరితిత్తులను ఈ అధ్యయనంలో పరిశీలించారు. వీరిలో 16 మంది ఆస్తమాతో చనిపోగా 21 మందికి ఆస్తమా ఉన్నప్పటికీ ఇతర కారణాల వల్ల మరణించారు. ఇకపోతే 15 మందికి ఆస్తమా లేదు. అంటే ఆస్తమా రిస్కు ఎక్కువగా ఉన్నట్టే. సైంటిస్టులు 1372 శ్వాస మార్గాల నిర్మాణాలను, ఊపిరితిత్తుల కణజాలాన్ని పరిశీలించి, వాటిలోని కొవ్వు కణజాలాన్ని బాడీ మాస్ ఇండెక్స్‌తో పోల్చిచూశారు. ఇందులో బీఎంఐతోపాటు కొవ్వు కణజాలం కూడా పెరుగుతున్నట్టు గమనించారు. ఈ కొవ్వు శ్వాసమార్గాల నిర్మాణాన్ని కూడా మార్పు చెందించి ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతున్నట్టు అధ్యయనంలో తేలింది. శ్వాసమార్గాల్లో కొవ్వు పేరుకుపోవడం వల్ల గాలి ఊపిరితిత్తులకు వెళ్లడానికి, అక్కడి నుంచి రావడానికి ఆటంకం ఏర్పడుతుంది. అందువల్ల ఆస్తమా లక్షణాలు వచ్చే అవకాశం ఉంటున్నట్టు చెప్తున్నారు వెస్టర్న్ ఆస్ట్రేలియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పీటర్ నోబెల్. అధిక బరువు, స్థూలకాయంతో పాటు అప్పటికే ఆస్తమా ఉన్నవాళ్లలో సమస్య మరింత తీవ్రంగా మారేందుకు ఆస్కారం ఉంటుందంటున్నారాయన.

## పసిపిల్లల ఆహారమా.. విషమా..?!



చంటిబిడ్డలకు ఘనాహారం అలవాటు చేసేటప్పుడు రెడీమేడ్‌గా దొరికే పౌడర్లను వాడుతుంటారు. కానీ వీటిలో అనేకరకాల విషతుల్యమైన రసాయనాలు ఉన్నాయని ఇటీవలి పరిశోధనల్లో తేలింది. ప్రతి ఫుడ్‌లోనూ కనీసం ఒక్క రసాయనమైనా హానికరమైనది ఉంటున్నదని చెప్తున్నారు అధ్యయనకారులు. ఈ రసాయనాలు చాలా తక్కువ మొత్తంలో ఉంటున్నా.. కొద్దికాలం వాడుతూ ఉంటే క్రమంగా వీటి దుష్ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు. మార్కెట్‌లో అమ్ముతున్న 95% ఆహారపదార్థాల్లో ఒకటి లేదా అంత కన్నా ఎక్కువ రకాల హానికర రసాయనాలు ఉంటున్నాయి. వీటిలో లెడ్, ఆర్సెనిక్, మెర్క్యురీ, కాడ్మియం లాంటివి కనిపిస్తున్నాయి. మొత్తం 168 బేబీఫుడ్స్‌ని పరీక్షించగా.. వాటిలో నాలుగింటిలో ఒక ఫుడ్‌లో ఈ భారలోహాలు ఉన్నట్టు బయటపడిందని హెల్దీ బేబీస్ బ్రైట్ ఫ్యూచర్స్ (హెచ్‌బీబీఎఫ్) సంస్థ అధ్యయనం పేర్కొంటున్నది. ఆర్సెనిక్, లెడ్ లాంటి ఈ లోహాలు నాడీకణాల అభివృద్ధికి హానిచేస్తాయంటున్నారు బోస్టన్ కాలేజీకి చెందిన పిడియాట్రీషియన్ డాక్టర్ ఫిలిప్ లాండ్రిగన్. ఈ లోహాలు రైస్‌తో తయారుచేసిన ఆహార పదార్థాల్లోనే ఎక్కువ కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. ఇలాంటి టాక్సిక్ కెమికల్స్‌కి దూరంగా ఉండాలంటే పిల్లలకు బియ్యానికి సంబంధించిన పదార్థాలు లేని మల్టీగ్రెయిన్, ఓట్‌మీల్ లాంటివి అలవాటు చేయాలంటున్నారు. బయట తయారుగా ఉన్నవి కొని పిల్లలకు పెట్టే కన్నా పప్పులు, బియ్యం, డ్రైఫ్రూట్స్, కూరగాయలు, పండ్ల లాంటి వాటితో ఇంట్లో చేసుకునే ఆహార పదార్థాలనే పసిపిల్లలకు పెట్టడం మంచిదంటున్నారు నిపుణులు.

## అన్ని ఫ్లూజ్వరాలకూ ఒకే వ్యాక్సిన్!



జలుబు, దగ్గుతో అతలాకుతలం చేసేది ఫ్లూ. ఇప్పటికే కొన్ని రకాల ఫ్లూ వైరస్‌లకు వ్యాక్సిన్లు ఉన్నాయి. కానీ కొన్నిరకాల వైరస్‌ల వల్ల కలిగే ఫ్లూ అడ్డుకునేందుకు ఏమీ లేవు. ఇప్పుడు అన్ని రకాల ఫ్లూ వైరస్‌లనూ నియంత్రించడానికి ఒకే వ్యాక్సిన్‌ను రూపొందించడానికి కసరత్తు జరుగుతున్నది. జలుబుకు మందులు వాడితే వారం రోజుల్లో వాడకపోతే ఏడు రోజుల్లో తగ్గుతుందని ఓ మాట ఉండనే ఉంది. అంటే జలుబును నియంత్రించే సరైన చికిత్స లేదని అర్థం. జలుబు కొన్ని వేలరకాల వైరస్‌లలో ఏదో ఒకదానివల్ల కలుగుతుంది. ఇవన్నీ ఫ్లూ వైరస్‌లే. అందుకే ఇన్ని రకాల వైరస్‌లకు వ్యాక్సిన్లు తయారుచేయడం కష్టమైంది. కాని ఇప్పుడు అన్నిటికీ కలిపి ఒకే వ్యాక్సిన్ తీసుకొచ్చే పనిలో ఉన్నారు పరిశోధకులు. ఫ్లూ వైరస్‌ల ఉపరితలం మీద హీమాగ్లుటినిన్ అనే ప్రొటీన్ ఉంటుంది. హోస్ట్ కణాలపై దాడిచేయడానికి ఇదే మార్గదర్శనం చేస్తుంది. ఈ ప్రొటీన్ వల్లనే మనుషులను వైరస్ ఇన్‌ఫెక్ట్ చేస్తుంది. ఈ హీమాగ్లుటినిన్‌లో తల (హెడ్), తోక (స్టాక్) అనే రెండు భాగాలుంటాయి. వీటిలో తల భాగం అన్ని వైరస్‌లలో ఒకేలా ఉండదు. కాని స్టాక్ మాత్రం దాదాపుగా ఒకేలా ఉంటుంది. అందువల్ల హీమాగ్లుటినిన్ స్టాక్‌ను టార్గెట్ చేస్తూ వ్యాక్సిన్‌ను తయారుచేయవచ్చని భావిస్తున్నారు సైంటిస్టులు. ఇందుకోసం కైమెరిక్ హీమాగ్లుటినిన్ అనే ప్రొటీన్ రకంపై పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఈ పరిశోధనలు విజయవంతం అయితే యూనివర్సల్ ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్ రాక ఎంతో దూరంలో ఉండదంటున్నారు ప్రొఫెసర్ ఫ్లోరియన్ క్రామర్.

# కశ్మీర్‌లో ఇండిపెండెంట్ల హవా

- బ్లాక్ ఎన్నికల్లో 217 కౌన్సిళ్లలో విజయం.. 81 చోట్ల బీజేపీ గెలుపు
- ఎన్నికలను బహిష్కరించిన ప్రధాన పార్టీలు
- ఓటుహక్కు వినియోగించుకున్న కశ్మీరీలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు

**శ్రీనగర్, అక్టోబర్ 25:** జమ్ముకశ్మీర్‌లో బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిళ్లకు (బీడీసీ) జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థుల హవా కొనసాగింది. పటిష్ఠ భద్రత మధ్య గురువారం జరిగిన బీడీసీ ఎన్నికల్లో 217 కౌన్సిళ్లలో స్వతంత్రులు పాగా వేయగా, 81 కౌన్సిళ్లలో బీజేపీ విజయం సాధించింది. మరో ఎనిమిది కౌన్సిళ్లలో జమ్ముకశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ గెలుపొందింది. రాష్ట్రంలో మొత్తం 316 బీడీసీ కౌన్సిళ్లు ఉండగా, 283 బ్లాక్‌లకు ఎన్నికలు జరిగాయి. కాగా, 15 మంది బీజేపీ నేతలతోపాటు 27 బ్లాకుల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక హోదాను రద్దుచేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న తర్వాత తొలిసారి జరిగిన ఈ ఎన్నికలను బీజేపీ మినహా ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) బహిష్కరించిన నేపథ్యంలో అత్యధిక స్థానాలను స్వతంత్రులు గెలుచుకోవడం విశేషం. ఈ ఎన్నికల్లో 98.3% పోలింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) శైలేంద్రకుమార్ తెలిపారు. జమ్ముకశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లోని 309 బీడీసీ చైర్‌పర్సన్ పోస్టులకు 1012 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అంతకుముందు బీజేపీ అధికార ప్రతినిధి అల్తాఫ్ ఠాకూర్ మాట్లాడుతూ కశ్మర్ పరిధిలో తమ పార్టీ, తమతో భావ సారూప్యంతో కలిసి పనిచేసే అభ్యర్థులు 62కు పైగా బ్లాకులలో విజయం సాధించారని, జమ్ములో మాత్రమే కాక కశ్మీర్‌లోనూ తమ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. జమ్ముకశ్మీర్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గులాం అహ్మద్ మిర్ మాట్లాడుతూ.. 'మా నాయకులంతా జైళ్లలో మగ్గడం వల్ల, జమ్మును దాటి వెళ్లకుండా అనుమతులు నిరాకరించిన నేపథ్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో పాల్గొనడం అర్థ రహితం. బీజేపీ సులభంగా గెలుపొందేందుకు ప్రభుత్వం పన్నిన కుట్ర ఇది' అని ఆరోపించారు. ఇదిలా ఉండగా, పంచ్‌లు, సర్పంచ్‌ల ఎన్నికలు జరుగక పోవడంతో రెండు బ్లాక్‌ల ఎన్నికలు జరుగలేదు. నాలుగు బ్లాక్‌లను మహిళలకు రిజర్వ్ చేశారు. కానీ ఒక్క మహిళా పంచ్ ఎన్నికవ్వలేదు. అత్యధిక సంఖ్యలో బీడీసీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నందుకు కశ్మీరీలకు ప్రధాని నరేంద్రమోదీ ధన్యవాదాలు తెలిపారు. 370 అధికరణం రద్దు చేయడం వల్లే అత్యధిక ఓటింగ్ నమోదైందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన యువ ప్రజాప్రతినిధులు జమ్ము, కశ్మీర్ ప్రాంతాల్లోని ప్రజలందరి గమ్యస్థానాలను నిర్దేశిస్తారని ట్వీట్ చేశారు. 370 అధికరణానికి మద్దతు పలికినందుకు పార్టీలకతీతంగా ఎంపీలకు మరోసారి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మోదీ మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.



పెద్దపల్లిలో జాతీయ రహదారి పక్కన చెత్తను సేకరిస్తున్న ఎమ్మెల్యే దాసరి, తదితరులు

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపు

**పెద్దపల్లి కలెక్టరేట్:** ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బస్టాండ్ నుంచి శాంతినగర్, హనుమాన్ దేవాలయం, క్రిస్టియన్‌కాలనీ, ప్రగతినగర్, అయ్యప్ప దేవాలయం, అమర్‌నగర్, మజీద్ చౌరస్తాల మీదుగా జెండా చౌరస్తా వరకు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్ల మీద పడేసిన ఓ పెట్రోల్ బంక్ నిర్వాహకులకు రూ. 5వేలు, ఎలక్ట్రికల్ షాపు యజమానికి రూ. 5వేలు, బండారి బ్రదర్స్ షాపు యజమానికి రూ. 5వేలు, వీ1 ఫ్యాషన్స్ యజమానికి రూ. 2వేలు, బాలాజీ బటన్ స్టోర్స్ షాపు యజమానికి రూ. 2వేలు, మదీనా బ్యాగ్ సెంటర్ యజమానికి రూ. 2వేలు, హైమద్ రెగ్జిన్‌వర్క్స్ దుకాణ యజమానికి రూ. 500 చొప్పున జరిమానాలను విధించి వసూలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేకాధికారి, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డిలు, మున్సిపల్ సిబ్బంది, జిల్లా అధికారులు, మెప్మా మహిళలంతా పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు.

## భారత్-చైనా సరిహద్దు వెంట 18 రోడ్లు

ఇప్పటికే ప్రభుత్వం ఆమోదం.. నిధులు మంజూరు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 25:** అరుణాచల్ ప్రదేశ్‌లోని భారత్-చైనా సరిహద్దు వెంట 18 రహదార్లను నిర్మించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 1,607 కి.మీ. మేర నిర్మించే ఈ రహదారుల కోసం ఇప్పటికే రూ.1,175 కోట్లను మంజూరు చేశామని చెప్పారు. గురువారం గ్రేటర్ నోయిడాలోని లఖ్నవాలి ప్రాంతంలో నిర్వహించిన ఇండో-టిబెటన్ బోర్డర్ ఫోర్స్ (ఐటీబీపీ) 58వ రైజింగ్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'ఐటీబీపీని మరింత పటిష్ఠపర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా సైనికులకు మర్ని సౌకర్యాలు కల్పించనుంది. త్వరలో రెండు హెలికాప్టర్లను కూడా అందజేయనున్నాం. మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో గస్తీ కోసం ఈ హెలికాప్టర్లు ఎంతగానో ఉపయోగపడుతాయి' అని తెలిపారు. భారత్-చైనా సరిహద్దు ప్రాంతంలో రహదారుల నిర్మాణం వల్ల గస్తీ నిర్వహించడానికి సైనికులకు సులువుగా ఉంటుందని, చొరబాట్లను మరింత సమర్థవంతంగా అడ్డుకోవచ్చని చెప్పారు. ఐటీబీపీకి ఎలాంటి అధునాతన ఆయుధాలు కావాలన్నా సమకూర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. 'దేశ ప్రజలు ప్రశాంత జీవితాన్ని గడుపడంలో సైనికుల పాత్ర అమోఘం. వాళ్లు సరిహద్దులో నిరంతరం విధులు నిర్వహిస్తూ చొరబాట్లు జరుగకుండా చూస్తున్నారు. అలాంటి సైనికుల విధులకు ఆటంకం కాకుండా ఉండేందుకు వాహనాలు, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నాం. ఆధునాతన ఆయుధాలను సమకూర్చుతున్నాం' అని కిషన్‌రెడ్డి చెప్పారు. సైనికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పేర్కొన్నారు.

# మళ్లీ రెచ్చిపోయిన ఉగ్రవాదులు

కశ్మీర్‌లో ఇద్దరు డ్రైవర్లను కాల్చిచంపి

యాపిల్ పండ్ల లారీలను తగులబెట్టిన ముష్కరులు

**శ్రీనగర్, అక్టోబర్ 25:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. యాపిల్ పండ్లను తీసుకెళ్తున్న వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరుపడంతో ఇద్దరు డ్రైవర్లు చనిపోయారు. అనంతరం యాపిల్ పండ్ల లోడ్ ఉన్న రెండు లారీలను తగులబెట్టారు. ఘటనలో మరో వ్యక్తి తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటన దక్షిణ జమ్ముకశ్మీర్‌లోని సోఫియాన్ జిల్లాలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన లారీలను లక్ష్యంగా చేసుకొన్న ఉగ్రవాదులు.. వాటిని చిత్రగాం గ్రామం సమీపంలో నిలువరించి కాల్పులకు తెగబడ్డారు. అనంతరం యాపిల్ రవాణా చేస్తున్న రెండు లారీలను దగ్ధం చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు అక్కడికక్కడే చనిపోగా.. గాయపడిన మరో వ్యక్తిని శ్రీనగర్‌లోని ఎస్ఎంహెచ్ఎస్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఒకరు రాజస్థాన్‌లోని అల్వార్‌కు చెందిన మహమ్మద్ ఇలియాస్ కాగా, మరొకరి వివరాలు తెలియాల్సి ఉన్నది. గాయపడిన వ్యక్తి పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌కు చెందిన జీవన్‌గా గుర్తించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నదని పోలీసులు తెలిపారు. కశ్మీర్‌లో ప్రస్తుతం యాపిల్ పండ్ల సీజన్ కావడంతో మారుమూల పల్లెలకు ఇతర రాష్ట్రాల వారు పెద్ద సంఖ్యలో లారీలు తీసుకొని వస్తున్నారు. ఇదే అదునుగా ఉగ్రవాదులు దాడులకు తెగబడుతున్నారని పోలీసు అధికారులు వెల్లడించారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లే యాపిల్ పండ్ల రవాణాదారులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. మూడు రోజుల్లో ఇలాంటి దాడులు జరుగడం ఇది నాలుగోసారి. మొబైల్ ఫోన్ల సేవలను కేంద్రం ఈ నెల 14న పునరుద్ధరించింది. ఆ తర్వాత మూడ్రోజులకు రెచ్చిపోయిన ఉగ్రవాదులు సోఫియాన్ జిల్లాలో రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యాన్ డ్రైవర్‌ను కాల్చి చంపి, పండ్ల తోటల యజమానిపై తీవ్రంగా దాడి చేశారు. అనంతరం మరో రెండు రోజులకు పంజాబ్‌కు చెందిన యాపిల్ వ్యాపారిని కాల్చిచంపారు. ఈ ఘటనలతో ఇతర రాష్ట్రాలకు చెందిన పండ్ల వ్యాపారులు, లారీల యజమానులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వ్యాపారులు మారుమూల ప్రాంతాలకు వెళ్లడం క్షేమకరం కాదని గుర్తించిన అధికారులు.. రైతుల నుంచి యాపిల్ పండ్లను కొనుగోలు చేసేందుకు సోఫియాన్ జిల్లాలోని ప్రధాన రహదారిపై తొమ్మిది విక్రయ కేంద్రాలను ఏర్పాటుచేశారు.

## ఓటర్లకు ఒవైసీ కృతజ్ఞతలు

మహారాష్ట్ర, బీహార్ ఎన్నికల్లో మజ్లిస్ విజయంపై హర్షం

**హైదరాబాద్:** మహారాష్ట్ర, బీహార్ ఎన్నికల్లో తమకు ఓట్లేసినవారికి ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కృతజ్ఞతలు తెలిపారు. ముంబై, యూపీలో పార్టీ ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'మజ్లిస్ అంటే ఉద్యమం. ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని ఇక్కడివరకు వచ్చాం. పార్టీకి ఓటేసిన అందరికీ కృతజ్ఞతలు. మాలేగావ్, ధులే నియోజకవర్గాల్లో ఓటర్లు విశ్వాసం వ్యక్తం చేసినందుకు వినమ్రతతో ఉంటాం. ఇన్షా అల్లాహ్.. వారిని నిరాశపరుచం' అంటూ ఒవైసీ ట్వీట్ చేశారు. మహారాష్ట్రలోని మాలేగావ్, ధూలే స్థానాల్లో ఎంఐఎం గెలుపొందింది, కిషన్‌గంజ్‌లో గెలిచి బీహార్‌లోనూ ఖాతా తెరిచింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర శాఖ పార్టీ అధ్యక్షుడు ఇంతియాజ్ జలీల్‌ను, బీహార్ నాయకుడు అక్తరుల్ ఇమాన్‌ను ఒవైసీ ప్రశంసించారు. ముంబైలో కోల్పోయిన పట్టును త్వరలోనే తిరిగి సాధిస్తామని, మరింత కష్టపడి పనిచేసి ఔరంగాబాద్ ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందుతామని హామీ ఇస్తున్నట్టు ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఔరంగాబాద్ నాయకుడు డాక్టర్ గఫార్ ఖాద్రీ సమర్థుడైన, నిబద్ధతగల నాయకుడు, పార్టీ ముంబై అధ్యక్షుడు ఫయాజ్‌ఖాన్ బాగా శ్రమించినా అక్కడ ఓడిపోయాం. తిరిగి పుంజుకుంటామని నా గట్టి నమ్మకమని పేర్కొన్నారు. యూపీలో సమర్థుడైన షౌకత్ నాయకత్వంలో పార్టీ తిరిగి పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ.. ప్రతాప్‌గఢ్ ప్రజలకు ఒవైసీ కృతజ్ఞతలు తెలిపారు.

## 150 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పాపటపల్లిలో పట్టుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ సీఐ తిరుపతిరెడ్డి

**రఘునాథపాలెం:** ప్రజాపంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్, సివిల్‌సప్లై అధికారులు శుక్రవారం దాడిచేసి పట్టుకున్న ఘటన ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పాపటపల్లిలో చోటుచేసుకుంది. సివిల్‌సప్లై ఖమ్మం అర్బన్ డీటీ విజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన రేషన్ బియ్యం వ్యాపారులు తాతా దుర్గాప్రసాద్, గంటల నాగరాజు రేషన్ బియ్యాన్ని పాపటపల్లి నుంచి ఏపీ16టీడీ 4689 నంబరు లారీలో అక్రమంగా ఆంధ్రాకు తరలించే ప్రయత్నం చేస్తుండగా విస్వసనీయ సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు దాడి చేసినట్టు తెలిపారు. దాడిలో పట్టుబడిన బియ్యం 150 క్వింటాళ్లు ఉన్నట్టు తెలిపారు. బియ్యంతో పాటు లారీని రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యాపారులు తాతా దుర్గాప్రసాద్, గంటల నాగరాజులపై 6ఏ కేసు నమోదుచేశారు.

# బీహార్‌లో ఎంఐఎం గెలుపు ప్రమాదకరం

సామరస్య వాతావరణానికి విఘాతం.. కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యలు

**పాట్నా, అక్టోబర్ 25:** బీహార్‌లోని కిషన్‌గంజ్ నియోజకవర్గం ఉప ఎన్నికలో ఎంఐఎం గెలువడం రాష్ట్రానికే ప్రమాదకరమని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ వ్యవస్థాపకుడు మహ్మద్ అలీ జిన్నా సిద్ధాంతాన్ని ఎంఐఎం పాటిస్తుంటుందని, అలాంటి పార్టీ కిషన్‌గంజ్‌లో గెలువడం బీహార్‌కే ప్రమాదకరమని శుక్రవారం ట్విట్టర్‌లో స్పందించారు. కిషన్‌గంజ్‌కలో జిన్నా సిద్ధాంతాలను పాటించే వాళ్లు, జాతీయగీతం వందేమాతరాన్ని వ్యతిరేకించేవాళ్లు గెలిచారని, వీరితో బీహార్‌లోని సామరస్య వాతావరణం దెబ్బతినే ప్రమాదమున్నదని పేర్కొన్నారు. 'సామరస్య వాతావరణంపై మాట్లాడే గిరిరాజ్‌సింగ్ రాష్ట్రంపై ప్రేమ ఉంటే ఢిల్లీలో ఎందుకు కూర్చున్నారు. కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసి రాష్ట్రంలోని పరిస్థితిని చక్కదిద్దడానికి కృషిచేయవచ్చు కదా'అని బీహార్ మంత్రి శ్యాం రజాక్ వ్యంగ్యంగా పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శనివారం 26 అక్టోబర్ 2019



విజయ్ దేవరకొండ

# అభిమానులతో పాట..

'ఈ సినిమాలో తరుణ్‌భాస్కర్ నటన ప్రతి ఒక్కరిని అలరిస్తుంది. ప్రమోషనల్ సాంగ్ కోసం నేను చాలా కష్టపడ్డాను' అని అన్నారు హీరో విజయ్ దేవరకొండ. ఆయన నిర్మాతగా మారి కింగ్ ఆఫ్ ది హిల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందిస్తున్న చిత్రం 'మీకు మాత్రమే చెప్తా'. తరుణ్‌భాస్కర్, అనసూయభరద్వాజ్, అభినవ్ గోమఠం, వాణిభోజన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. షమ్మీర్ సుల్తాన్ దర్శకుడు. నవంబర్ 1న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ చిత్రంలోని 'నువ్వే హీరో' వీడియో సాంగ్‌ను విజయ్ దేవరకొండ సమక్షంలో హైదరాబాద్‌లో ఆయన అభిమానులు విడుదలచేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'ఈ పాటలో నాతో పాటు తరుణ్‌భాస్కర్, అభినవ్ నటించాల్సింది. కానీ అనివార్య కారణాల వల్ల కుదరలేదు. వినోదభరిత కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం అందరిని మెప్పిస్తుందనే నమ్మకముంది' అని అన్నారు. దర్శకుడు షమ్మీర్ సుల్తాన్ మాట్లాడుతూ 'ఈ కథ అందరికి కనెక్ట్ అవుతుందనే నమ్మకముంది. రొటీన్‌కు భిన్నమైన ఎంటర్‌టైనర్ ఇది' అని పేర్కొన్నారు. నిర్మాతగా విజయ్‌కి ఈ సినిమా మంచి పేరు తెచ్చిపెట్టాలని ఆదిత్య మ్యూజిక్ ఉమేష్‌గుప్తా చెప్పారు. ఈ కార్యక్రమంలో తరుణ్‌భాస్కర్, అభినవ్ పాల్గొన్నారు.



వెంకటేష్

# 'అసురన్' రీమేక్‌లో..

ధనుష్ కథానాయకుడిగా నటించిన తమిళ చిత్రం 'అసురన్' ఇటీవలే విడుదలై విమర్శకులు ప్రశంసలందుకుంటున్నది. సామాజికాంశాల్ని స్పృశిస్తూ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందించారు. వెట్రిమారన్ దర్శకత్వం వహించారు. కమర్షియల్‌గా కూడా ఈ సినిమా పెద్ద విజయాన్ని సాధించింది. ఈ చిత్రాన్ని వెంకటేష్ కథానాయకుడిగా తెలుగులో రీమేక్ చేయబోతున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, వి క్రియేషన్స్ పతాకాలపై సురేష్‌బాబు, కళైపులి ఎస్ థాను సంయుక్తంగా నిర్మించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు. ప్రస్తుతం వెంకటేష్ 'వెంకీమామ' చిత్రంలో నటిస్తున్నారు.

# 85 ఏళ్ల వృద్ధురాలిగా..

దాదాపు 23 ఏళ్ల తర్వాత విలక్షణ నటుడు కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇండియన్-2'. 1996లో రూపొందిన 'ఇండియన్'కు సీక్వెల్‌గా సమకాలీన రాజకీయాల్లోని అవినీతి, లోతుపాతుల్ని చర్చిస్తూ తనదైన శైలి కమర్షియల్ హంగులకు సందేశాన్ని జోడిస్తూ దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో కమల్‌హాసన్‌కు జోడీగా కాజల్ అగర్వాల్ నటిస్తున్నది. ఆమె ఇందులో 85 ఏళ్ల వృద్ధురాలిగా కనిపించబోతున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. కమల్‌హాసన్‌కు భార్యగా ప్రయోగాత్మకంగా ఆమె పాత్ర సాగుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం భోపాల్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. దాదాపు నలభై కోట్ల వ్యయంతో ఓ భారీ యాక్షన్ సీక్వెన్‌ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు శంకర్. పీటర్ హెయిన్ సారథ్యంలో రెండు వేల మంది జూనియర్ ఆర్టిస్టులతో తెరకెక్కించనున్న పోరాట ఘట్టం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం చెబుతున్నది. సిద్దార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్ ఈ సినిమాలో కీలక పాత్రల్ని పోషించనున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది.



కాజల్ అగర్వాల్

# ఆర్టికల్ 370 నేపథ్యంలో..



అభిషేక్ అగర్వాల్

కశ్మీర్ లోయలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్న చిత్రం 'ది కశ్మీర్‌ఫైల్స్'. వివేక్ అగ్నిహోత్రి దర్శకుడు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఆర్టికల్ 370 చుట్టూ అల్లుకున్న కథాంశంతో చారిత్రక నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. ఆర్టికల్ 370 ఎందుకు తీసుకొచ్చారు? రద్దు వెనక కారణాలేమిటి అనే అంశాల్ని ఇందులో చర్చించబోతున్నారు. చరిత్రలో భాగమైన లెజెండ్స్ పాత్రల్లో ప్రముఖ నటులు కనిపించబోతున్నారు. వచ్చే ఏడాది ఆగస్ట్ 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకులముందుకు తీసుకొస్తారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్న వివరాల్ని త్వరలో తెలియజేయనున్నారు.



దీపికా పదుకునే

# ద్రౌపది పాత్రలో..

గత ఏడాది బాలీవుడ్ నటుడు రణ్‌వీర్‌సింగ్‌ను పెళ్లాడింది బాలీవుడ్ సొగసరి దీపికా పదుకునే. వివాహం తర్వాత ఏడాదిపాటు సినిమాలకు బ్రేక్ తీసుకున్న ఆమె ప్రస్తుతం కొత్తదనంతో కూడిన కథాంశాల్ని ఎంచుకుంటున్నది. పురాణేతిహాసం మహాభారతం ఆధారంగా బాలీవుడ్‌లో 'మహాభారత్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనున్నది. ఈ సినిమాలో ద్రౌపది పాత్రలో దీపికా పదుకునే నటించనున్నది. అంతేకాదు ఈ సినిమాకు ఆమె ఓ నిర్మాతగా వ్యవహరించనున్నారు. మధు మంతెనతో కలిసి దీపికాపదుకునే ఈ ఇతిహాస చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమా గురించి ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీపికా మాట్లాడుతూ తన జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే మంచి పాత్ర అవుతుందని తెలిపింది. 'పురాణాల్లోని ఓ గొప్ప పాత్రను పోషించనుండటం గర్వంగా ఉంది. ద్రౌపది దృక్కోణం నుంచి మహాభారతాన్ని కొత్తగా, ఆసక్తికరంగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేయబోతున్నాం. భారతం ఆధారంగా గతంలో వచ్చిన చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. జీవిత పాఠాల్ని తెలియజెప్పే విధంగా ఉంటుంది' అని పేర్కొంది. పలు భాగాలుగా ఈ సినిమాను రూపొందించనున్నారు. తొలి భాగాన్ని 2021 దీపావళికి విడుదల చేస్తారు. ప్రస్తుతం దీపికా పదుకునే యాసిడ్‌దాడికి గురైన లక్ష్మీఅగర్వాల్ జీవితం ఆధారంగా రూపొందుతున్న 'చపాక్' సినిమాతో పాటు '83'లో నటిస్తున్నది.

# సంగీత ప్రధాన థ్రిల్లర్



సాన్య, సందీప్, జోయా

సందీప్, శివ, విశ్వాస్, ఠాగూర్, సాన్య, జోయా నాయకానాయికలుగా ఘంటాడి కృష్ణ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఘంటాడి కృష్ణ, సురేష్‌రెడ్డి నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశానికి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి క్లాప్‌నివ్వగా, కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సంగీత ప్రధానంగా సాగే సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. అన్ని రకాల వాణిజ్య అంశాలుంటాయి. గతంలో వచ్చిన '6టీన్స్'ను పోలి ఉంటుంది. ఆరు పాటలుంటాయి. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం' అన్నారు.

**'రోజాపూలు' 'ఒకరికొకరు' 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' వంటి సినిమాలతో తెలుగు పరిశ్రమలో మంచి గుర్తింపును సంపాదించుకున్నారు శ్రీరామ్. ఆయన కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రాగల 24గంటల్లో'. శ్రీనివాసరెడ్డి దర్శకుడు. నవంబర్ మొదటివారంలో ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీరామ్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి...**

# మంచి కథల కోసం అన్వేషిస్తున్నా!



శ్రీరామ్

'కొంత విరామం తర్వాత నేను తెలుగులో నటిస్తున్న 'అసలేం జరిగింది' షూటింగ్ ముగించుకొని చెన్నైలో ఉండగా శ్రీనివాసరెడ్డి ఈ కథ చెప్పారు. వినగానే చాలా ఎక్సైటింగ్‌గా అనిపించింది. ఆయన గత చిత్రాలకు పూర్తి భిన్నంగా మర్డర్‌మిస్టరీ థ్రిల్లర్ ఇతివృత్తంతో సాగుతుంది. కామెడీ, ఫ్యామిలీ కథా చిత్రాల దర్శకుడిగా పేరున్న శ్రీనివాసరెడ్డి ఇలాంటి వినూత్నమైన పాయింట్‌ను ఎంచుకోవడం ఆశ్చర్యపరిచింది. మొదటి రోజు షూటింగ్‌లోనే నాపై పతాక ఘట్టాల్ని చిత్రీకరించారు. బలమైన ఉద్వేగాలు కలబోసిన ఆ సన్నివేశాలు సినిమాకు ఆయువుపట్టుగా ఉంటాయి.

**సరికొత్త పోలీస్ పాత్రలో...**

నేను గతంలో పోలీస్ పాత్రల్ని పోషించాను. కానీ ఇందులో భిన్న పార్శ్వాల్లో నా పాత్ర సాగుతుంది. మర్డర్ మిస్టరీని ఛేదించే క్రమంలో పోలీస్ అధికారికి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయనేది ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. 24 గంటల్లో జరిగే కథ ఇది. అనుక్షణం అనూహ్య మలుపులతో ఉత్సుకతను రేకెత్తిస్తుంది. సినిమాలోని ప్రతి పాత్రకు రెండు భిన్నమైన కోణాలుంటాయి.

**మంచి అవకాశాల కోసం...**

తెలుగులో వినూత్నమైన కథల కోసం అన్వేషిస్తున్నాను. నచ్చిన కథలు దొరక్కపోవడం వల్లే తెలుగులో తక్కువ సినిమాలు చేస్తున్నాను. స్వతహాగా నాకు ప్రేమకథా చిత్రాలంటే ఇష్టం. ప్రస్తుతం తెలుగులో లవ్‌స్టోరీస్ తెరకెక్కించే ధోరణి ఎక్కువగా ఉండటం సానుకూల పరిణామంగా చెప్పవచ్చు.

**రెండు భాషల్లో అవకాశాలు..**

ప్రస్తుతం తమిళంలో ఆరు సినిమాలు చేస్తున్నాను. అన్నీ సోలో హీరోగానే తెరకెక్కబోతున్నాయి. ఇక తెలుగులో మధుకర్ అనే కొత్త దర్శకుడితో ఓ సినిమా చేస్తున్నాను. సామాజికాంశాలు మేళవించిన ప్రేమకథ అది. నేను అనుకోకుండా హీరోనయ్యా. కెరీర్ తొలినాళ్లలో అవకాశాలు వెల్లువెత్తాయి. చేతిలో పుష్కలమైన అవకాశాలు ఉన్న తరుణంలో ఓ ప్రమాదం కారణంగా ఏడాది పాటు చిత్రసీమకు దూరంగా ఉన్నాను. ఆ గ్యాప్ వల్ల వచ్చిన అవకాశాల్ని వదులుకోవాల్సి వచ్చింది.







